సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 332

బుధవారం 22-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'




### నగదును మించి డిజిటల్

త్వరలోనే నగదు లావాదేవీలను డిజిటల్ పేమెంట్స్ అధిగమిస్తాయన్న మోదీ - 13లో



### తొమ్మిది నెలలు నడిచాను

బర్మా నుంచి భారత్‌కు తన కాలి నడక ప్రయాణాన్ని గుర్తుచేసుకున్న హెలెన్ - 11లో



### పశ్చిమ దేశాలదే ఈ పాపం

ఉక్రెయిన్‌లో ప్రస్తుత పరిస్థితికి ముమ్మాటికీ పశ్చిమ దేశాలే కారణమని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు.

- వివరాలు 6లో▶



### పుతిన్ గెలవడం కల్ల: బైడెన్

ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తామని... పుతిన్ ఎప్పటికీ విజయం సాధించలేరని అమెరికా అధ్యక్షుడు బైడెన్ అన్నారు.

- వివరాలు 6లో▶



### 'ముంబై' కుట్రదారులు పాక్‌లో..

పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని రచయిత, కవి జావెద్ అక్తర్ పాక్ గడ్డపైనే కడిగేశారు.

- వివరాలు 6లో▶



# అల్విదా సానియా

### ఆటకు వీడ్కోలు పలికిన టెన్నిస్ దిగ్గజం

రెండు దశాబ్దాలుగా అంతర్జాతీయ యవనికపై భారత టెన్నిస్‌కు చిరునామాగా నిలిచిన సానియా మీర్జా తన కెరీర్‌కు వీడ్కోలు పలికింది. గత నెలలో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ సందర్భంగా రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించిన ఈ హైదరాబాదీ స్టార్ దుబాయ్ ఓపెన్ తన కెరీర్‌లో చివరి టోర్నీ అని పేర్కొంది. మంగళవారం జరిగిన దుబాయ్ ఓపెన్ మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సానియా (భారత్)–మాడిసన్ కీస్ (అమెరికా) జోడీ 4–6, 0–6తో వెరోనిక కుదెర్‌మెతోవా–లుద్మిలా సమ్‌సనోవా (రష్యా) ద్వయం చేతిలో ఓడిపోయింది. తన 20 ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో సానియా ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో కలిపి మొత్తం 43 డబ్ల్యూటీఏ టైటిల్స్ సాధించింది. 91 వారాలు డబుల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచింది. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించింది. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్ రత్న'... 'అర్జున అవార్డు'... పౌర పురస్కారాలు 'పద్మభూషణ్', 'పద్మశ్రీ' అందుకుంది. వచ్చే నెలలో సానియా మీర్జా కొత్త పాత్రలో కనిపించనుంది. మహిళల ప్రీమియర్ లీగ్ టి20 క్రికెట్ టోర్నీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుకు సానియా 'మెంటార్'గా వ్యవహరించనుంది.

12లో

## న్యూస్‌రీల్

### ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రంలో భారీ లోపం



ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండంలో 1,600 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో భారీ లోపం బయటపడింది. బాయిలర్‌లోని రీహీటర్ ట్యూబ్స్ విఫలం కావడంతో ట్రయల్ రన్ వాయిదా పడింది.

- వివరాలు 10లో▶

### సీఐపై దాడి కేసులో టీడీపీ నేతల అరెస్ట్



ఏపీలోని గన్నవరంలో విధి నిర్వహణలో ఉన్న సీఐను కులం పేరుతో దూషిస్తూ... రాళ్లతో దాడి చేసిన కేసులో టీడీపీ నేత పట్టాభి సహా పది మందికి కోర్టు రిమాండ్ విధించింది. ఈ ఘటనలో అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు.

- వివరాలు 10లో▶

### మజ్లిస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీర్జా రహమత్ బేగ్



హైదరాబాద్ స్థానిక సంస్థల మజ్లిస్ అభ్యర్థిగా మీర్జా రహమత్ బేగ్‌ను ఆ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. సీనియర్ శాసనసభ్యుడు అహ్మద్ పాషా ఖాద్రీ వద్ద సాధారణ కార్యకర్త స్థాయిలో కారు డ్రైవర్‌గా పనిచేసిన రహమత్ బేగ్ ఇబ్రహీంబాగ్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

- వివరాలు 2లో▶

# కాంగ్రెస్ వైపు కామ్రేడ్లు!

## బీఆర్‌ఎస్ నాయకుల తీరు, అధిష్టానం మౌనంపై అసహనం

### ప్రత్యామ్నాయంపై సీపీఐ, సీపీఎం దృష్టి

- కారుతో కుదరకపోతే కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలనే ఆలోచన
- వామపక్షాలను కలుపుకొనేందుకు హస్తం సిద్ధం!
- ఇప్పటికే వామపక్షాలను సంప్రదించిన సీనియర్ నేతలు
- వారు అడిగినన్ని సీట్లు ఇచ్చేందుకు సుముఖత!
- కాంగ్రెస్‌తోనూ కుదరకపోతే ఒంటరిగానే లెఫ్ట్ పోటీ
- చెరి 25 స్థానాల్లో బరిలో నిలిచే యోచన



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది సమయం కూడా లేదు. ముందస్తు ఎన్నికలపైనా ఊహాగానాలు సాగుతున్నాయి. రాష్ట్రంలోని రాజకీయ పక్షాలన్నీ ఎన్నికలు లక్ష్యంగానే వ్యూహాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పొత్తులు తెరపైకి వస్తుండగా.. వామపక్షాలు తాజాగా కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలనే ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. వాస్తవానికి మునుగోడు ఉప ఎన్నికలో లెఫ్ట్ పార్టీలు బీఆర్‌ఎస్‌కు మద్దతు

మిగతా 2వ పేజీలో ▶

### కమ్యూనిస్టుల ముందు 3 ప్లాన్‌లు...

లెఫ్ట్ పార్టీలు ప్లాన్ ఏ, ప్లాన్ బీ, ప్లాన్ సీ.. ఇలా మూడు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

**ప్లాన్ ఏ..** బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండేలా కృషి చేయడం. చెరో పది సీట్లు అడగాలి. మునుగోడు, దేవరకొండ, మిర్యాలగూడ, నకిరేకల్, పాలేరు, వైరా, కొత్తగూడెం, భద్రాచలం, మధిర, ఇబ్రహీంపట్నం, హుస్నాబాద్ స్థానాల కోసం పట్టుబట్టాలి. ఒకవేళ కొన్ని కాదని ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామంటే ఆలోచించాలి.

**ప్లాన్ బీ..** బీఆర్‌ఎస్ తర్వాత బీజేపీని వ్యతిరేకించే కాంగ్రెస్, వైఎస్సార్‌టీపీ, తెలంగాణ జన సమితి వంటి పార్టీలతో జత కట్టడం. కాంగ్రెస్ పార్టీ అడిగినన్ని సీట్లు ఇవ్వడానికి సాను కూలంగా ఉండటం కీలకాంశం.

**ప్లాన్ సీ..** కాంగ్రెస్ గౌరవప్రదమైన సీట్లకు అంగీకరించని పక్షంలో, ఏదైనా కారణంతో ఆ పార్టీతోనూ పొత్తు కుదరని పక్షంలో ఒంటరి పోరాటం చేయడం. చెరో 25 స్థానాల్లో పోటీ చేసి ఎన్నికల పోరాటంలో బీజేపీ సహా ఇతర పార్టీల వైఖరులను, విధానాలను ఎండగట్టడం.

## ప్రపంచాన్ని ఆదుకొనేలా

# మన ఫార్మా

### మంత్రి కేటీఆర్ ధీమా

- భవిష్యత్తులో మహమ్మారులు ప్రబలితే ఎదుర్కొంటుంది
- జీవశాస్త్ర రంగంలో ఇప్పటికే అగ్రస్థానంలో రాష్ట్రం
- ఫార్మాసిటీతో మరింత ఉన్నత స్థితికి ఎదుగుతుంది
- 24న బయో ఆసియా సదస్సు సందర్భంగా మీడియాతో చిట్‌చాట్



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో కరోనా వంటి మహమ్మారులు ప్రబలితే ప్రపంచాన్ని ఆదుకోగల స్థాయిలో హైదరాబాద్ ఫార్మాసిటీ ఉండబోతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ధీమా వ్యక్తం చేశారు. జీవశాస్త్ర రంగంలో ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం ఫార్మాసిటీ ఏర్పాటుతో మరింత ఎత్తుకు ఎదుగుతుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బయో ఆసియా సదస్సు ఈ నెల 24వ తేదీ ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కేటీఆర్ విలేకరులతో ముచ్చటించారు.

**త్వరలో ఎంఆర్‌ఎన్‌ఏ టీకా కేంద్రం**

'జీవశాస్త్ర రంగంలో హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచంలోనే అతి కీలకమైన కేంద్రంగా మారింది. ఏటా 900 కోట్ల టీకాలు తయారు చేస్తోంది. త్వరలోనే ఈ సంఖ్య 1,400 కోట్లకు చేరుతుంది. టీకాలన్నింటిలో తెలంగాణ వాటా 50 శాతానికి చేరుతుంది. అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదిత ఫార్మా కంపెనీలు అత్యధికంగా (214) ఉండటం, సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్కు, త్వరలో ప్రారంభం కానున్న ఫార్మాసిటీ వంటివి హైదరాబాద్‌ను జీవశాస్త్ర రంగంలో అగ్రగామిగా నిలుపుతున్నాయి. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్'తో పాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఎంఆర్‌ఎన్‌ఏ టీకా కేంద్రం కూడా త్వరలో హైదరాబాద్‌లో

మిగతా 3వ పేజీలో ▶

### వివాదాల తక్షణ పరిష్కారానికే..

# ఐఏఎంసీ

- సమయానుకూల పరిష్కారాలూ ముఖ్యమే.. ఐఏఎంసీ ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి కేటీఆర్
- ఐఏఎంసీ అంతర్జాతీయ స్థాయికి చేరుతుందన్న హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, హైదరాబాద్: టీఎస్ ఐపాస్‌తో అంతర్జాతీయ సంస్థలు తెలంగాణ బాటపట్టాయని, ఏదైనా వివాదం వచ్చినా వెంటనే పరిష్కరించడం కోసమే అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పినట్లు ఐటీ మంత్రి కేటీఆర్ చెప్పారు. వివాదాలను సమయానుకూలంగా పరిష్కరించడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. మంగళవారం హయత్ హోటల్లో సిరిల్ అమర్‌చంద్ మోహన్‌దాస్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ) నిర్వహించిన ఫైర్‌సైడ్ చిట్‌చాట్‌లో కేటీఆర్

మిగతా 14వ పేజీలో ▶



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న వీసీ సురేశ్‌కుమార్, పక్కన మంత్రి హరీశ్‌రావు

## ఇందిరానగర్ పాఠశాలలో ఫారెన్ లాంగ్వేజెస్

- శిక్షణ ఇచ్చేందుకు దత్తత తీసుకున్న ఇఫ్లూ
- ఎంఓయూ అందజేసిన వైస్ చాన్స్‌లర్ సురేశ్‌కుమార్
- విద్యార్థులు ఇతర భాషలూ నేర్చుకోవాలి: మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): విద్యార్థులకు విదేశీ భాషలను నేర్పించేందుకు సామాజిక బాధ్యతలో భాగంగా ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ (ఇఫ్లూ) సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుంది. ఈ మేరకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి వీసీ ప్రొఫెసర్ సురేశ్‌కుమార్ ఒప్పంద పత్రాన్ని (ఎంఓయూ)

మిగతా 3వ పేజీలో ▶

## శంషాబాద్‌లో వంద పడకల ఆసుపత్రి

### ఎట్టకేలకు ప్రకటించిన కేంద్ర కార్మిక శాఖ ఏడాదిన్నర ప్రతిపాదనకు మోక్షం

శంషాబాద్: కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించేందుకుగాను రాష్ట్రంలో వంద పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ఎట్టకేలకు ఏడాదిన్నరకు మోక్షం లభించింది. ఈ ప్రతిపాదనను ఆమోదిస్తున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేంద్రయాదవ్ మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు 190వ ఈఎస్‌ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 8 ఈఎస్‌ఐ వంద పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నామని, రాష్ట్రంలోని శంషాబాద్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రిని నిర్మించనున్నామని అధికారికంగా ప్రకటించారు. దీంతో కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ శివారులో గగన్‌పహాడ్, కాటేదాన్, సాతంరాయి పారిశ్రామికవాడలతోపాటు కొత్తూరు, నందిగామ, బాలానగర్, షాద్‌నగర్ పారిశ్రామిక వాడలకు శంషాబాద్ చేరువలో ఉంది. దీనికితోడు నగర శివారులోని అన్ని పారిశ్రామిక ప్రాంతాల నుంచి ఇక్కడికి రాకపోకలు సాగించేందుకు ఔటర్ రింగు రోడ్డు వంటి అనువైన అనుసంధాన రహదారులు, రైల్వే కనెక్టివిటీ ఉంది.



ప్రధానాలయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ పూజ చేస్తున్న అర్చకులు

## వైభవంగా యాదాద్రీశుని బ్రహ్మోత్సవాలు

పాంచరాత్ర ఆగమ సిద్ధాంతం ప్రకారం బ్రహ్మోత్సవాలు

మార్చి 3 వరకు నిర్వహణ

3లో

# వీధికుక్కల వీరంగం

### రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో స్వైర విహారం

- విశ్వనగరం హైదరాబాద్‌కూ తప్పని బెడద
- మహానగరంలో నెలకు 2,000–2,500 కుక్కకాటు కేసులు
- తాజాగా నాలుగేళ్ల చిన్నారిపై దాడి చేసి చంపిన కుక్కల గుంపు
- రాష్ట్రంలో ఏడాదిలో మూడు రెట్లు పెరిగిన కుక్క కాటు ఘటనలు
- కుక్కల కట్టడికి హైకోర్టు ఆదేశించినా చర్యలు శూన్యం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వీధి కుక్కలు పేట్రేగిపోతున్నాయి. కాలనీలు, బస్తీల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. కొన్నిచోట్ల క్రూర మృగాల్లా రెచ్చిపోతూ పసిపిల్లల ప్రాణాలు తీస్తున్నాయి. విశ్వనగరంగా చెప్పుకుంటున్న హైదరాబాద్‌లోనూ వీటి బెడద తప్పడం లేదు. సోమవారం బాగ్ అంబర్‌పేటలో కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ నాలుగేళ్ల బాలుడు మరణించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు వేర్వేరు ఘటనల్లో కూడా ఇద్దరు చిన్నారులపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.

**2022లో నవంబర్ నాటికే 80,281 కుక్కకాట్లు**

రాష్ట్రంలో కుక్కకాటు కేసులు ఏడాది కాలంలోనే గణనీయంగా పెరిగాయి. నాలుగేళ్ల క్రితం భారీగా ఉన్న కేసులు.. మరుసటి రెండేళ్లు తగ్గగా.. తర్వాత నాలుగో ఏడాది మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2021లో 24,124 కుక్క కాట్లు సంభవించగా, 2022లో నవంబర్ నాటికే ఏకంగా 80,281 మందిని కుక్కలు కరిచినట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నివేదిక వెల్లడించింది. అంటే అంతకుముందు ఏడాదితో పోలిస్తే

మిగతా 5వ పేజీలో ▶



**ఆహారం దొరక్కే..: మేయర్ విజయలక్ష్మి**

అంబర్‌పేట ఘటనలో కుక్కలకు ప్రతిరోజూ ఆహారం వేసే వారు రెండురోజులుగా వేయనందునే ఆకలికి తట్టుకోలేక బాలునిపై దాడి చేసి ఉంటాయని హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి అభిప్రాయపడ్డారు. ఇదొక ప్రమాదం మాత్రమేనంటూ.. బాలుడు మరణంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# 'బెల్ట్' తీస్తాం

### కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులపై చర్యలు

- తెలంగాణ తెచ్చామన్నందుకే రెండుసార్లు అవకాశమిచ్చారు..
- మరి రాష్ట్రాన్నిచ్చిన కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి..
- వరంగల్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో టీపీసీసీ చీఫ్



సాక్షి, వరంగల్: 'రాష్ట్రంలో 3 వేల వైన్ షాపులు, 60 వేల బెల్ట్ షాపులు కేసీఆర్ తీసుకొచ్చారు. అందుకే అక్కల బాధలను అర్థం చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గ్రామాల్లో బెల్ట్ షాపులుంటే బట్టలూడదీసి కొట్టి బొక్కలో వేయిస్తా'అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆనాడు కాంగ్రెస్ రైతు బజార్‌లను తెరిపిస్తే.. ఈనాడు బెల్ట్ షాపులు తెరిచారని, వీటిని కాంగ్రెస్ రాగానే రద్దు చేస్తుందని ప్రకటించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంగళవారం రాత్రి జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ తెచ్చామని చెప్పిన బీఆర్‌ఎస్ పార్టీకి

మిగతా 2వ పేజీలో ▶

**భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు** | **ఉద్రిక్తతకు దారితీసిన యువజన నేతపై దాడి ఘటన!** 2లో



## ఇదండీ సంగతి



## క్లుప్తంగా...

### మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదు: జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని విద్యుత్ శాఖమంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. మంగళవారం సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రాల మెడపై కత్తి పెట్టి మోటార్లకు మీటర్లు బిగించే కుట్ర చేస్తోందని అసెంబ్లీలో స్పష్టంగా ప్రస్తావించామని తెలిపారు. సాక్ష్యాధారాలతో సహా బీజేపీ కుట్రను బయట పెట్టామన్నారు. ఇంకా ఇక్కడి బీజేపీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని, వారిని రైతులు ఎక్కడికక్కడ నిలదీయాలని జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బూత్ లెవెల్ కార్యకర్త అని, అజ్ఞానంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

### మేం దాడులకు దిగితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పారిపోతారు

**చావులోనూ సాయన్నకు బాధ మిగిల్చారు: మహేశ్‌కుమార్**



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రతిదాడులకు దిగితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రాష్ట్రం వదిలి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అవినీతిపై పోస్టర్లు అంటిస్తున్నారన్న కారణంగా వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ నేత తోట పవన్‌పై దాడి చేయడం హేయమని మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తోట పవన్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అనుచరులు కిరాతకంగా దాడిచేశారని, హత్య చేసేందుకు యత్నించారని, వినయ్‌భాస్కర్‌తో పాటు ఆయన అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని మహేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దళిత నాయకుడు సాయన్నకు ప్రభుత్వం గౌరవం ఇవ్వదా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి దళితులంటే గౌరవం లేదని, కనీసం అధికారిక లాంఛనాలతో కూడా సాయన్న అంత్యక్రియలు పూర్తి చేయకుండా చావులో కూడా సాయన్నకు బాధను మిగిల్చారని మహేశ్ ఆవేదన వ్యక్తంచేశారు.

### దళిత ఎమ్మెల్యే కాబట్టే అధికారిక లాంఛనాల్లేవు

**బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్**



నిజాంసాగర్ (జుక్కల్): కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న దళితుడైనందుకే ఆయన అంత్యక్రియలను అధికారికంగా చేపట్టలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం కేంరాజ్‌కల్లాలి, ఖండెబల్లూర్, పెద్దఎడ్గి, గుండూరు, పెద్ద గుల్లా, హంగర్గ గ్రామాల్లో మంగళవారం బహుజన రాజ్యాధికార యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...రాణి కుముదిని అనే ఐఏఎస్ అధికారిణి దళితురాలు కావడంతో సీఎస్‌గా అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగిలయ్య పేద బహుజన బిడ్డ కాబట్టే ఇంటి స్థలం ఇవ్వడంలో వివక్ష చూపారని మండిపడ్డారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన సినీప్రముఖులు మరణిస్తే అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేపట్టి, అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే అధికార లాంఛనాలు గుర్తుకు రాకపోవడం సిగ్గు చేటన్నారు.

### కేసీఆర్‌కు మహిళలంటే గౌరవం లేదు

- గవర్నర్‌ను దూషించారు
- మహిళాకమిషన్‌కు షర్మిల ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు మహిళలంటే అసలు గౌరవమే లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. మహిళల పట్ల బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆమె తెలంగాణ మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదన్నారు. మహిళల మీద జరుగుతున్న అత్యాచారాల్లో దేశంలోనే తెలంగాణ ముందుందని, మహిళల్ని జైల్లో పెట్టి చిత్ర హింసలకు గురి చేసిన సంఘటనలున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళల పట్ల జరుగుతున్న దాడులపై బీఆర్‌ఎస్ మహిళ నేతలు కనీసం మాట్లాడరని మండిపడ్డారు. గవర్నర్ తమిళిసైను సైతం అసభ్య పదజాలంతో దూషించారని, కేసీఆర్ సర్కార్‌ను నిలదీస్తే తనను నానా మాటలు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై దూషణలు చేసిన వ్యక్తుల పేర్లతో మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఎమ్మెల్యే శంకర్ నాయక్ తననే కాదు.. ఓ ఐఏఎస్ మహిళా అధికారి చెయ్యి పట్టుకున్నారని, అలాంటి వారికి మహిళల మీద గౌరవం ఉన్నట్లా అని ప్రశ్నించారు. ఇక్కడ న్యాయం జరక్కపోతే జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

---

2017లో కరీంనగర్‌లోని పోలీసు ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ)లో ముగ్గురు ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లు..

అదే సెంటర్‌లో గత నవంబర్‌లో వరంగల్‌కు చెందిన ట్రైనీ కానిస్టేబుల్ రాజా నరేందర్...

మంగళవారం వరంగల్ పోలీసు శిక్షణ కేంద్రంలో హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ..

కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందేందుకు, పొందిన... ప్రీ/పోస్టు ప్రమోషనల్ శిక్షణలో హఠాన్మరణం చెందిన వారి జాబితా ఇది. గత ఆరేళ్ల కాలంలో ఈ 'శిక్ష'ణ ఐదుగురిని బలిగొనగా.. పదుల సంఖ్యలో సిబ్బందిని అస్వస్థతకు గురిచేసింది. సర్వీసులో చేరిన పాతికేళ్ల తర్వాత, యాభై ఏళ్ల పైబడిన వయసులో ఇచ్చే ఈ ట్రైనింగ్‌పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటికే పోలీసు విభాగంలో సుదీర్ఘకాలం పని చేసిన, నామమాత్రపు దర్యాప్తు అధికారులుగా వ్యవహరించే ఈ సిబ్బందికి ఇప్పుడు కొత్తగా నేర్పేది ఏమిటన్నది సర్వత్రా ఎదురవుతున్న ప్రశ్న.

# ప్రాణాల మీదికి.. 'పదోన్నతి'

## శిక్షగా మారుతున్న ప్రీ/పోస్టు ప్రమోషనల్ ట్రైనింగ్

- కానిస్టేబుళ్లకు దశాబ్దాల సర్వీసు తర్వాతే దక్కుతున్న పదోన్నతి
- ఆ వయసులోనూ డీటీసీ, పీటీసీల్లో శిక్షణ తప్పనిసరి
- వరంగల్‌లో శిక్షణ పొందుతూ కన్నుమూసిన హెడ్‌కానిస్టేబుల్
- ఈ 'శిక్ష'ణకు ఆరేళ్లలో ఐదుగురు బలి.. పదుల సంఖ్యలో అస్వస్థత

సాక్షి, హైదరాబాద్

కానిస్టేబుల్ స్థాయి వారికి కెరీర్‌లో ఒక్కసారి వచ్చే పదోన్నతి వారి ప్రాణాల మీదికి తెస్తోంది. పోలీసు విభాగంలో ఎస్సైగా అడుగుపెట్టిన అధికారి పదవీ విరమణ చేసే నాటికి కనిష్టంగా రెండు, డీఎస్పీగా చేరిన వారికి నాలుగు, ఎస్పీ హోదాలో రిపోర్టు చేసిన ఐపీఎస్ అధికారికి నాలుగు నుంచి ఐదు వరకు పదోన్నతులు దక్కుతాయి. కానిస్టేబుళ్ల వద్దకు వచ్చేసరికి ఇలాంటి పరిస్థితులుండవు. 1996లో కానిస్టేబుల్‌గా పోలీసు విభాగంలో అడుగుపెట్టి, ప్రస్తుతం 50 ఏళ్లకు అటు ఇటు ఉన్న వాళ్లు ఇటీవలే ఒక్క మెట్టు ఎక్కి హెడ్ కానిస్టేబుళ్లు అయ్యారు. పై స్థాయిలో ఉండే అధికారుల సంఖ్య తక్కువ కావడం, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లే 80 శాతానికి పైగా ఉండటమూ ఈ పదోన్నతుల ఆలస్యానికి ఒక కారణం. ఫలితంగా కానిస్టేబుల్ స్థాయి వారిలో 95 శాతం వరకు పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేస్తుంటారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఎన్ని హామీలిచ్చినా ఇది మారకుండా.. పరిష్కారానికి నోచుకోకుండా ఉంటోంది.

**వీళ్లు కొత్తగా నేర్చుకునేది శూన్యం**

పోలీసు విభాగంలో అడుగుపెట్టి దాదాపు రెండు దశాబ్దాలపాటు పనిచేసిన కానిస్టేబుళ్లు కేసుల దర్యాప్తు, సమాచారం సేకరణ, కోర్టు వ్యవహారాలు, నిందితుల వేట తదితర అంశాల్లో కీలక పాత్ర పోషించి ఆయా అంశాల్లో నిష్ణాతులుగానే ఉంటారు. ఎస్సై, ఆపై స్థాయి అధికారులు సైతం తమ ఠాణాల్లో సీనియర్ కానిస్టేబుళ్లకే ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇలాంటి సీనియర్ అధికారులకు పదోన్నతులు ఇస్తున్నామనో, ఇచ్చామనో శిక్షణకు పిలిచి కొత్తగా నేర్పేది ఏమిటన్నది ఏళ్లుగా ఎదురవుతున్న ప్రశ్న. ఎస్సై నుంచి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన వారికి లేని ఈ శిక్షణ తమకే ఎందుకని కానిస్టేబుళ్లు ప్రశ్నిస్తున్నారు. పదోన్నతి శిక్షణ తీసుకున్నప్పటికీ తాము నిర్వర్తించేది రొటీన్ విధులేనని అంటున్నారు.

### అనారోగ్యాలకు కేరాఫ్

ఇతర వాటితో పోలిస్తే వృత్తిపరమైన అనారోగ్యాలు పోలీసు విభాగంలో అధికం. దాదాపు 70% మంది ఊబకాయం, బీపీ, షుగర్, హృద్రోగంతోపాటు ఆస్తమా, ఇతర వ్యాధులతో బాధపడుతుంటారు. సర్వకాల సర్వావస్థల్లోనూ అందుబాటులో ఉండాల్సి రావడం, వేళాపాళా లేని తిండి, నిద్ర కారణంగా ఈ రుగ్మతలు వీరికి తప్పట్లేదు. 50 ఏళ్లకు దగ్గరగా ఉన్న వారికి ఈ సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. అలాంటి వారిని శిక్షణ పేరుతో పని చేస్తున్న ప్రాంతానికి దూరంగా పంపడం, తెల్లవారుజాము 4.30 గంటల వరకు స్వల్ప విరామాలతో ఇండోర్, ఔట్‌డోర్ శిక్షణ ప్రాణాల మీదికి తెస్తోంది. ఒకప్పుడు ఈ శిక్షణ 3 నెలలు ఉండగా... తర్వాత దాన్ని 45 రోజులకు కుదించారు. అయితే ఇదంతా కాకుండా వీరికి కేవలం చట్టం, ఇతర కీలకాంశాలు బోధించడానికి వారం రోజుల రిఫ్రెష్‌మెంట్ క్లాసులు సరిపోతాయని మాజీ పోలీసు అధికారులు చెబుతున్నారు.

### డ్రిల్స్ పునరుద్ధరిస్తే ఉత్తమం



కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ విధుల్లో వ్యత్యాసం ఉంటుంది. ఈ కారణంగానే పదోన్నతి సమయంలో శిక్షణ అనివార్యం. నిబంధనల ప్రకారం ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ వారంలో రెండుసార్లు (ఒకసారి సాధారణ, మరోసారి ఆయుధాలతో) డ్రిల్ చేయాలి. బందోబస్తు భారం, పని ఒత్తిడితోపాటు ఇతర కారణాలతో ఇవి జరగట్లేదు. కేవలం ఇన్‌స్పెక్షన్లు ఉన్నప్పుడు మాత్రమే ఓ వారం ముందు నుంచి డ్రిల్స్ చేస్తున్నారు. ఈ కారణంగా శారీరక వ్యాయామానికి పోలీసులు పూర్తిగా దూరమవుతున్నారు. అందువల్ల డ్రిల్స్‌ను పునరుద్ధరిస్తే శిక్షణకు వెళ్లినప్పుడు ఇలాంటి అపశ్రుతులను నివారించవచ్చు.

\- బి.రెడ్డన్న, రిటైర్డ్ ఎస్పీ

### ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

పోలీసు విభాగంలో అనేక మంది వివిధ రకాలైన అనారోగ్యాల బారినపడతారు. కొందరికి దీర్ఘకాలిక సమస్యలుంటాయి. దైనందిన విధులతో ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించడం కూడా దీనికి కారణమే. నిర్లక్ష్యానికి తావు లేకుండా అనునిత్యం వ్యాయామం చేయడం, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని డాక్టర్ సలహా తీసుకుంటే ఇలాంటి ఉదంతాలకు తావుండదు.

\- ఎన్.ప్రకాష్, వైద్యుడు

### రాష్ట్ర పోలీస్ విభాగంలో సిబ్బంది



| డీజీపీ | అదనపు డీజీ | ఐజీపీ | డీఐజీ |
|---|---|---|---|
| 5 | 17 | 8 | 12 |

| ఎస్పీ | ఏఎస్పీ | డీఎస్పీ | ఇన్‌స్పెక్టర్ |
|---|---|---|---|
| 110 | 548 | 428 | 1,569 |

| ఎస్‌ఐ | ఏఎస్‌ఐ |
|---|---|
| 3,893 | 4,255 |

| హెడ్‌కానిస్టేబుల్ | కానిస్టేబుల్ |
|---|---|
| 9,047 | 43,271 |

(బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్- 2022 జనవరి 1 నాటి గణాంకాలు)

## శిక్షణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ మృతి

- అస్వస్థతకు గురవడంతో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలింపు
- చికిత్స పొందుతూ మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

నాంపల్లి (హైదరాబాద్): వరంగల్‌లోని మమ్నూరు పోలీసు శిక్షణాకేంద్రంలో ట్రైనింగ్‌లో ఉన్న ఓ హెడ్ కానిస్టేబుల్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని కొండాపూర్ శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటూ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని మధ్య మండలం నాంపల్లి పోలీసు స్టేషన్‌లో వి.లక్ష్మీనారాయణ విధులు నిర్వహిస్తున్నారు. అయితే శిక్షణ కోసం వరంగల్‌లోని మమ్నూరు పోలీసు శిక్షణా కేంద్రానికి వెళ్లారు. రెండు రోజుల క్రితం సెలవుపై హైదరాబాద్‌కు వచ్చిన ఆయన సోమవారం తిరిగి మమ్నూరుకు వెళ్లిపోయారు. కాగా, సాయంత్రం బీపీ తక్కువై కళ్లు తిరిగి కిందపడ్డారు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో హనుమకొండ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. లక్ష్మీనారాయణకు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీకాకుళం పలాస ప్రాంతానికి చెందిన లక్ష్మి నారాయణ 1996వ బ్యాచ్ పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. పిల్లలిద్దరూ అమెరికాలో ఉంటున్నందున వారు రాగానే అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

## మజ్లిస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బేగ్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల మజ్లిస్ అభ్యర్థిగా మీర్జా రహమత్ బేగ్‌ను ఆ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్‌కు మద్దతు ఇస్తున్నట్లు అధికార పార్టీ బీఆర్‌ఎస్ ఇప్పటికే ప్రకటించింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బరిలో దిగి పరాజయం పాలైన రహమత్ బేగ్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అదృష్టం వరించినట్లయింది. సీనియర్ శాసన సభ్యుడు అహ్మద్ పాషా ఖాద్రీ వద్ద సాధారణ కార్యకర్త స్థాయిలో కారు డ్రైవర్‌గా పనిచేసిన రహమత్ బేగ్ 1994 నుంచి కార్వాన్ అసెంబ్లీ నియోజవర్గంలోని ఇబ్రహీంబాగ్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. స్థానిక సంస్థల కోటాలో రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా ఎన్నికైన సయ్యద్ అమీన్ ఉల్ హసన్ జాఫ్రీ వయోభారం దృష్ట్యా ఆయన స్థానంలో బేగ్‌కు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్న కారణంగా మజ్లిస్ గెలుపు నల్లేరుపై నడక లాంటిదైనా బీజేపీ నుంచి పోటీ ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు.

## మండలి 'స్థానిక'లో ఎంఐఎంకు బీఆర్‌ఎస్ మద్దతు




సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 13న జరిగే శాసనమండలి హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎన్నికలో ఎంఐఎం పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు బీఆర్‌ఎస్ ప్రకటించింది. పార్టీ సీనియర్లతో చర్చించిన అనంతరం ఎంఐఎంకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. 2017లో జరిగిన శాసనమండలి హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎన్నికల్లో మద్దతు ప్రకటించిన మాదిరిగానే ప్రస్తుత ఎన్నికల్లోనూ తమ అభ్యర్థిని బలపరచాలని ఎంఐఎం పార్టీ కోరింది. మిత్రపక్షం ఎంఐఎం పార్టీ నుంచి అందిన అభ్యర్థన మేరకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో 127 మంది ఓటర్లకు గాను ప్రస్తుతం 117 మంది ఓటు హక్కు కలిగి ఉండగా ఇందులో బీఆర్‌ఎస్‌కు ఏడుగురు ఎమ్మెల్యేలు, పది మంది ఎమ్మెల్సీలు, ఐదుగురు రాజ్యసభ సభ్యులు, 18 కార్పొరేటర్లు కలుపుకుని మొత్తం 41 మంది ఓటర్లు బీఆర్‌ఎస్‌కు ఉన్నారు. కాగా, బీఆర్‌ఎస్ మద్దతు ప్రకటన నేపథ్యంలో ఎంఐఎం అభ్యర్థిగా బేగ్ అభ్యర్థిత్వాన్ని ఒవైసీ ప్రకటించారు.

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మూడు నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూటీఎస్) తరపున బి.భుజంగరావు మంగళవారం తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద దాఖలు చేశారు. టీఎస్‌టీసీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) తరపున కాసం ప్రభాకర్ మంగళవారం నామినేషన్‌లు దాఖలు చేశారు.

## కాంగ్రెస్ వైపు కామ్రేడ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించాయి. ప్రచారం సైతం నిర్వహించాయి. భవిష్యత్తులోనూ సీపీఎం, సీపీఐతో కలిసే వెళ్తామని ఆ సమయంలో బీఆర్‌ఎస్ నేతలు చెప్పారు. సీఎం కేసీఆర్ కూడా కమ్యూనిస్టులతో పొత్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. నిన్న, మొన్నటివరకు ఇదే విధమైన వాతావరణం కన్పించింది. కానీ వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎవరితోనూ పొత్తు పెట్టుకోదని, అవగాహన మాత్రమే ఉంటుందని ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్ చెప్పడం, బీఆర్‌ఎస్ అధిష్టానం దీనిపై మౌనం వహించడం కమ్యూనిస్టు పార్టీలను అయోమయంలో వేసింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ కలిసిరాకపోతే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది.

**బీజేపీ ఓటమే లక్ష్యం..:** బీజేపీని ఓడించడమే లక్ష్యంగా లెఫ్ట్ పార్టీలు పనిచేస్తున్నాయి. బీజేపీతో విభేదించే పార్టీలు ఏవైనా సరే వాటితో కలిసి ముందుకెళ్తున్నాయి. ఎన్నికల్లో పొత్తులూ పెట్టుకుంటున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా సీపీఐ, సీపీఎం పార్టీలు బీఆర్‌ఎస్‌తో జత కట్టాయి. ఆ పార్టీ విజయంలో తమ వంతుపాత్ర పోషించాయి. బీఆర్‌ఎస్ ఆవిర్భావం నేపథ్యంలో ఇటీవల ఖమ్మంలో ఆ పార్టీ నిర్వహించిన సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేరళ సీఎం పినరయి విజయన్, ఆ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని, తమ్మినేని పాల్గొని ఐక్యత చాటారు. కానీ ఇటీవల కాలంలో వామపక్షాలతో పొత్తుపై బీఆర్‌ఎస్ నాయకులు స్వరం మార్చారు. అసెంబ్లీ స్థానాలు ఇచ్చేది లేదని, అవసరమైతే పెద్దల సభకు నామినేట్ చేస్తామంటూ తలోమాట మాట్లాడుతుండటంతో లెఫ్ట్ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలోనే సీపీఐ, సీపీఎంలు ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నాయని, ఇదే అదనుగా కాంగ్రెస్ రంగంలోకి దిగిందని, ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కొందరు లెఫ్ట్ నేతలతో మంతనాలు జరిపారని తెలిసింది. అడిగినన్ని సీట్లు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిన కాంగ్రెస్ పెద్దలు.. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పోటీ చేస్తే అధికారం ఖాయం. కాబట్టి మీరు మా వైపు రండి..' అంటూ ఆహ్వానించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు మూడు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

## 'బెల్ట్' తీస్తాం

▶ మొదటి పేజీ తరువాయి




రేవంత్ సభకు హాజరైన ప్రజలు

రెండుసార్లు అవకాశం ఇచ్చారని.. అదే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇచ్చి చూడాలని విజ్ఞప్తి చేశారు. '10 ఎకరాల్లో పంజాగుట్ట చౌరస్తాలో గడీ నిర్మించుకున్నాడు. సచివాలయం, ప్రగతి భవన్‌లో విలాసవంత జీవనం ఉంది. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్, కొడుకు కేటీఆర్ 500 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. కానీ.. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు' అని ఆయన మండిపడ్డారు.

**వరంగల్‌ను చెత్త కుప్పలా తయారు చేశారు**

''దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన వరంగల్‌కు 2014లో గ్రహణం పట్టింది. ప్రజలపై ఆధిపత్యం చెలాయించే ప్రతీ సందర్భంలోనూ కాకతీయ యూనివర్సిటీ బిడ్డలు స్పందించారు. కానీ ఈ వర్సిటీలో నియామకాలు లేవు. బోధనా సిబ్బంది లేరు. ఉన్నవాళ్లకు జీతాలు లేవు. విద్యార్థులకు వసతుల్లేవు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు. మొన్న సునీల్‌నాయక్ పీజీ చదివి ఆత్మహత్య చేసుకున్నాడు. కొడంగల్‌లో నామీద కోపం ఉండి అభివృద్ధి చేయలేదు. కొండా దంపతుల మీద కోపం ఉండి వరంగల్‌ను చెత్త కుప్పలా తయారు చేసింది ఈ దండుపాళ్యం ముఠా''అని రేవంత్ విమర్శించారు. వరంగల్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలకు గంజాయి అలవాటు చేశారు. ఇక్కడి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో సహా వరంగల్ ఎమ్మెల్యేలు అంతా కబ్జాలకు పాల్పడుతున్నారు అని ఆయన ఆరోపించారు. ''దాడులే ప్రాతిపదికగా రాజకీయం చేద్దామంటే కేసీఆర్.. తేదీ, స్థలం ప్రకటించండి. కేసీఆర్ ఫామ్‌హౌస్ అయినా, వరంగల్ హంటర్ రోడ్డు అయినా ఎక్కడైనా సిద్ధం'' అని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. సమావేశంలో మాజీ మంత్రి కొండా సురేఖ, ములుగు ఎమ్మెల్యే సీతక్క, వరంగల్ ఇన్‌చార్జ్ అంజన్‌కుమార్ యాదవ్, కొండా మురళి, సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్య, వేం నరేందర్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతికి తల్లి వేరు మాతృభాషే



శ్రీదేవి

చార్మినార్: మాతృభాషకు మర్యాదనిస్తూ పరభాషలను గౌరవించుకోవాలని, మన సంస్కృతికి తల్లి వేరు మాతృభాషేనని తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు విభాగం నిర్వహించిన భాషా సదస్సులో శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. ఢాకా విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు తమ మాతృభాషను బంగ్లా భాషగా గుర్తించాలని ఆత్మ బలిదానాలను చేశారని, వారి ప్రాణత్యాగాలకు గుర్తుగా యునెస్కో ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. తెలుగు భాషా సాహిత్యాల ఆవిర్భావానికి తెలంగాణ ప్రాంతంలోనే మూలాలున్నాయని ఈనాటి పరిశోధకులు నిరూపించారన్నారు. విద్యార్థులు మన భాషా సాహిత్యాల అధ్యయనం పట్ల దృష్టి సారించాలన్నారు.

## ఓట్లు, కమీషన్లు తెచ్చే పథకాలకే బీఆర్‌ఎస్ ప్రాధాన్యం



**9 ఏళ్ల పాలనలో కీలకరంగాలకు తగ్గిన బడ్జెట్ కేటాయింపులు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ సర్కారు తన తొమ్మిదేళ్ల పాలనలో కీలక రంగాలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించిందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఓట్లు కుమ్మరించే, కమీషన్లు తెచ్చే పథకాలు, ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. కీలకమైన విద్య, వైద్యం, మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధి నిధుల్లో కోత పెట్టిందని పేర్కొన్నారు. ఆ మేరకు మంత్రి మంగళవారం ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తంగా తెలంగాణలో సామాజిక అభివృద్ధిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. నిధులు ఇవ్వకుండా, నియామకాలు చేపట్టకుండా విద్యరంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, 2022–23లో విద్యకు నిధుల కేటాయింపు జాతీయ సగటు 14.8% ఉంటే, తెలంగాణ ఖర్చు 7.6% ఉందన్నారు. ఆరోగ్య రంగంలో జాతీయ సగటు 6.3 శాతం ఉంటే, తెలంగాణ నిధుల కేటాయింపులు 5 శాతానికే పరిమితమైందని, రోడ్లు, బ్రిడ్జిలకు బడ్జెట్‌లో కేవలం 3.7 శాతమే నిధులు కేటాయించగా, జాతీయసగటు 4.5 శాతంగా ఉందని తెలిపారు. పట్టణాభివృద్ధికి నిధుల కేటాయింపు జాతీయ సగటు 3.5 శాతం ఉంటే తెలంగాణ కేటాయింపులు 2.8% ఉన్నాయని, గ్రామీణాభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు జాతీయ సగటు 5.7% ఉంటే, తెలంగాణ కేటాయింపులు 3.6 శాతానికే పరిమితమయ్యాయన్నారు.

### 'బండి' బాధేందో అర్థం కావట్లేదు: హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున బ్రహ్మాండంగా 80 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే ఒక ప్రతిపక్ష నాయకుడు దీన్ని చూసి గగ్గోలు పెడుతుండు.. ఆయన బాధ ఏమిటో అర్థం కావట్లేదు'అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను ఉద్దేశించి ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మంగళవారం సిద్దిపేటలో రాత్రి బీసీ స్టడీ సర్కిల్ శాశ్వత భవన శంకుస్థాపన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇన్ని ఉద్యోగాలకు ఒకేసారి నోటిఫికేషన్ వేయడం వెనుక ప్రభుత్వం కుట్ర ఉందని, ఉద్యోగాల నోటిఫికేషన్ వల్ల మాకు(బీజేపీ)కి కార్యకర్తలు ఎలా దొరుకుతారని, మాకు కార్యకర్తలు లేకుండా ఒక కుట్ర చేస్తున్నారంటూ బండి సంజయ్ బాధపడుతున్నారని మంత్రి హరీశ్‌రావు వ్యంగ్యంగా వివరించారు.

### బీఆర్‌ఎస్ కార్యకర్తల అరెస్టుకు భట్టి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: యువజన కాంగ్రెస్ నేత తోట పవన్‌పై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేయడాన్ని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. ప్రోత్సహించిన, దాడికి పాల్పడిన నిందితులను వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరంగల్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నేత తోట పవన్‌పై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేయకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

**ఉద్రిక్తతకు దారి తీసిన యువజన నేతపై దాడి ఘటన!**

- యూత్ కాంగ్రెస్ నేత పవన్‌కు రేవంత్ రెడ్డి పరామర్శ
- తెలంగాణ వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలకు రేవంత్‌రెడ్డి పిలుపు...

ఆస్పత్రిలో పవన్‌ను పరామర్శిస్తున్న రేవంత్‌రెడ్డి ▶



సాక్షి ప్రతినిధి, వరంగల్: హనుమకొండలో యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై దాడి ఉత్కంఠ, ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ దాడిని నిరసిస్తూ టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. దాడిలో గాయపడ్డ పవన్‌ను హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో మంగళవారం పరామర్శించిన రేవంత్ రెడ్డి.. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా పోలీస్ కమిషనరేట్‌కు చేరుకున్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పోలీస్ కమిషనరేట్ ముందు బైటాయించి ధర్నా చేశారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌పై హత్యా నేరం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్‌ని రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. చట్టపరంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారు.

**'దాస్యం దద్దమ్మ' ఫ్లెక్సీతోనే వివాదం..**

రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఓరుగల్లులో అలజడి సృష్టించింది. హనుమకొండలో సోమవారం రాత్రి జరిగిన పాదయాత్ర, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో స్థానిక ఎమ్మెల్యేపై విడుదల చేసిన చార్జిషీట్‌తో 'దాస్యం దద్దమ్మ' ఫ్లెక్సీని యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ ప్రదర్శించారు. దీంతో ఆగ్రహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కొందరు స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ముగియగానే దారికాచి పవన్‌పై దాడి చేశారు. తీవ్రగాయాలతో పవన్ స్పృహతప్పి పడిపోవడంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కొద్ది గంటలకు స్పృహలోకి వచ్చిన పవన్ తనను హతమార్చేందుకే బీఆర్‌ఎస్‌కు చెందిన రంజిత్ రెడ్డి, రాజ్‌కుమార్, అభిలతోపాటు సుమారు 15 మంది దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**హైదరాబాద్ అపోలోకు పవన్ తరలింపు... పోలీసుల అదుపులో ఐదుగురు...?**

పవన్ ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని డాక్టర్లు సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు విచారణ జరుపుతున్న ప్రత్యేక బృందాలు పవన్‌పై దాడి ఘటనతో సంబంధం ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలకు వివరించారు. చట్టపరంగా విచారణ జరిపి త్వరలోనే నిందితులందరినీ గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు... కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రేవంత్ రెడ్డి పిలుపు..**

పోలీస్ కమిషనరేట్ ఎదుట రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ దాడి వెనుక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. హత్యాయత్నం చేసిన బీఆర్‌ఎస్ నాయకుల ఫోన్‌లను సీజ్ చేయాలని, రక్త నమూనాలు సేకరించి గంజాయి మత్తు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. దాడులతో రాజకీయం చేయాలంటే డేట్ డిసైడ్ చేయండంటూ సీఎం కేసీఆర్‌కు రేవంత్ సవాల్ విసిరారు. పాదయాత్ర దగ్గర దాడి అంటేనే... కాంగ్రెస్ పార్టీపై, నేతలపై జరిగిన దాడిలా చూడాలని వ్యాఖ్యానించారు. తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ విభాగాలు ఈ దాడిని సీరియస్‌గా తీసుకుని గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో నిరసన, ధర్నాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## క్లుప్తంగా...

### అంబేడ్కర్ వర్సిటీలో కొత్తగా పీజీ డిప్లొమా కోర్సులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కొత్తగా పీజీ డిప్లొమా కోర్సులను ప్రవేశ పెట్టినట్లు విశ్వవిద్యాలయ కామర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్ తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ హ్యూమన్ రీసోర్స్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 10 ఆఖరి తేదీ అని వెల్లడించారు. ఆయా కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సుల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. సమాచారం కోసం 7382929570 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

### మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష ఫీజు గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును మార్చి 1 వరకూ పెంచినట్టు విద్యాశాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకూ 57,358 ఆన్‌లైన్ దరఖాస్తులు అందినట్టు తెలిపింది.

### వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–దర్భంగా (07046/07047) ప్రత్యేక రైళ్లు మార్చి 9వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ప్రతి గురు, ఆదివారాల్లో రాకపోకలు సాగించనున్నాయి. హైదరాబాద్–గోరఖ్‌పూర్ (02575/02576) ప్రత్యేక రైళ్లు మార్చి 3వ తేదీ నుంచి జూలై 2 వరకు రాకపోకలు సాగిస్తాయి. ప్రతి శుక్ర, ఆదివారాల్లో ఇవి అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్–జైపూర్ (07115/07116) ప్రత్యేక రైళ్లు మార్చి 3 నుంచి జూలై 2 వరకు ప్రతి శుక్ర, ఆదివారాల్లో రాకపోకలు సాగిస్తాయి. హైదరాబాద్–యశ్వంత్‌పూర్ (07265/07266) ప్రత్యేక రైళ్లు మార్చి 7 నుంచి మార్చి 29 వరకు నడుస్తాయి. ప్రతి మంగళ, బుధవారాల్లో ఇవి నడుస్తాయి.

### డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ నేడు

సాక్షి,హైదరాబాద్: బీఎస్సీ అలాయిడ్ హెల్త్ సైన్సెస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. కళాశాల వారీగా మిగిలిన సీట్ల వివరాలను www.knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునని స్పష్టం చేసింది.

### ఎండీ హోమియో వైద్య సీట్ల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ఎండీ హోమియో వైద్య సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య వర్సిటీ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నేడు ఉదయం 9 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. పీజీ హోమియో కోర్సులో యాజమాన్య కోటా సీట్లను వెబ్ ఆప్షన్ల ద్వారా భర్తీ చేయనున్నామని పేర్కొంది. మరింత సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించింది.

### ఇగ్నో అడ్మిషన్ల గడువు పొడిగింపు

మాదాపూర్ (హైదరాబాద్): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023వ సంవత్సరం అడ్మిషన్ల గడువు తేదీని ఈనెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు కె.రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధ రకాల ప్రోగ్రాంలు అయిన సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ సర్టిఫికెట్, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ (పోస్ట్‌గ్రాడ్యుయేట్) ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9492451812, 040–23117550 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఇందిరానగర్ పాఠశాలలో ఫారెన్ లాంగ్వేజెస్

▶ మొదటి పేజీ తరువాయి

అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఇంగ్లిష్‌తో పాటుగా ఫ్రెంచ్, స్పానిష్, వంటి విదేశీ భాషలను బోధించనున్నారు. ఈ వారం నుంచే ఆన్‌లైన్‌లో తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. బోధనలు మరింత అర్థమయ్యే విధంగా యూనివర్సిటీకి తీసుకెళ్లి అక్కడ శిక్షణను ప్రత్యక్షంగా చూపించనున్నట్లు వెల్లడించారు.

### హరీశ్‌రావు కృతజ్ఞతలు

ప్రపంచంతో పోటీపడేందుకు ప్రతి ఒక్కరికీ భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అవసరమని, మాతృభాషతో పాటుగా ఇతర భాషలను నేర్చుకోవాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించేలా ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. కోరిన వెంటనే పాఠశాలను దత్తత తీసుకుని శిక్షణ ఇచ్చేందుకు తొలిసారి ముందుకువచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో యాదాద్రి ఆలయం


## వైభవంగా యాదాద్రీశుని బ్రహ్మోత్సవాలు

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం స్వస్తివాచనంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. పంచారాత్ర ఆగమ సిద్ధాంతం ప్రకారం బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. యాదాద్రి ప్రధానాలయం ఉద్ఘాటన తర్వాత జరుగుతున్న మొదటి బ్రహ్మోత్సవాలు మార్చి 3 వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రధానాలయాన్ని పూల మాలికలు, విద్యుత్ దీపాలతో అలంకరించడంతో బంగారు వర్ణంలో శోభాయమానంగా ఆకట్టుకుంటోంది. గర్భాలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరాధన, ఉపాచారాల అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రక్షాబంధనం నిర్వహించారు. విష్వక్సేనుడు సమస్త సేవా నాయకులకు అధిపతి. అంటే.. సర్వసైనాధ్యక్షుడు కావడంతో ఈయనను ఈ ఉత్సవాలకు ఉద్యుక్తున్ని చేయడమే ఈ పూజ ప్రత్యేకత. అలాగే ధాన్యరాశిలో సత్యం, జ్ఞానం, ధర్మం అనే ముగ్గురు దేవతలను ఆవాహన చేసి ఆ కలశాలలో శుద్ధ గంగాజలాన్ని పోసి మంత్రోచ్చారణల మధ్య వాటికి ప్రత్యేక పూజలు చేశారు.

**రక్షాబంధనం**

ఈ ఉత్సవాల్లో పంచనారసింహుల శక్తిని పెంచడానికి కఠోర నియమాలతో దీక్షను తీసుకోవడమే రక్షాబంధనం. గర్భాలయంలో స్వామివారి వద్ద కంకణాలకు పూజ చేసి ఉత్సవమూర్తులకు కంకణధారణ చేశారు. అనంతరం అర్చకులు.. చైర్మన్ బి.నర్సింహమూర్తి, దేవస్థానం ఈఓ గీతారెడ్డిలకు రక్షాబంధనం చేశారు. అంకురార్పణ సందర్భంగా పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పోచంపల్లి పట్టు ధోవతి, కండువా, చీర సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం ఉదయం 8 గంటలకు అగ్ని పరీక్ష, ధ్వజారోహణం, రాత్రి 7.30 గంటలకు భేరిపూజ, దేవతాహ్వానం, హవనము జరుగుతాయి.

## రి'ఫైన్'!



**రిఫైన్డ్ నూనెలు మంచివి కాదనే ప్రచారం తప్పు**

- అసలు నూనెలే వాడకపోవడం మంచిది కాదు
- 30% వరకు కేలరీలు నూనెలు, కొవ్వుల ద్వారానే రావాలి
- లూజ్ నూనెలు కొనొద్దు... ప్యాకింగ్‌వే వాడాలి
- ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ఉన్న రిఫైన్డ్ నూనెలన్నీ మంచివే
- రెండు అంతకంటే ఎక్కువ నూనెలను కలిపి వాడొచ్చు
- గానుగ గింజల్లో పుచ్చిపోయినవి లేకుండా చూసుకోవాలి
- 'సాక్షి'తో ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్యానెల్ చైర్మన్, ఐఐసీటీ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌బీఎన్ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: వంట నూనె వినియోగంపై భిన్న వాదనలు ఉన్నాయి. నూనె లేని ఆహార పదార్థాలు తింటేనే ఆరోగ్యకరమని కొందరు అంటారు. అసలు నూనెలే వాడకపోవడం అనారోగ్యానికి దారితీస్తుందని మరికొందరు చెబుతుంటారు. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకు గానుగ (కోల్డ్ ప్రెస్) నూనెనే ఎక్కువగా వినియోగించేవారు. క్రమంగా రిఫైన్డ్ (శుద్ధి చేసిన) ఆయిల్స్ మార్కెట్‌ను ఆక్రమించాయి. ప్యాకేజ్డ్ నూనెల వినియోగం పెరిగిపోయింది. కొన్నాళ్లకు శుద్ధి చేసిన నూనెలు మంచివి కావనే వాదన మొదలైంది. దీంతో మళ్లీ గానుగ నూనె వినియోగం మొదలైంది. అయితే గానుగ నూనెలే మంచివని, శుద్ధి చేసిన నూనెలు మంచివి కావన్న ప్రచారం ఏమాత్రం సరికాదని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)లోని ఆయిల్స్, ఫ్యాట్స్ సైంటిఫిక్ ప్యానెల్ జాతీయ చైర్మన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) మాజీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌బీఎన్ ప్రసాద్ అంటున్నారు. 'అసలు నూనెలే వాడకపోవడం అనారోగ్యానికి దారితీస్తుంది. సాధారణంగా ప్రతి మనిషికి రోజుకు 2 వేల వరకు కేలరీలు కావాలి. కష్టపడి పని చేసేవారికి 2,500 వరకు కేలరీలు అవసరం. అయితే అందులో 25 నుంచి 30 శాతం నూనెలు, కొవ్వుల ద్వారానే రావాలి..'అని స్పష్టం చేశారు. అయితే ఎలాంటి నూనె మంచిది, ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి తదితర అంశాలపై ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**85 శాతం శుద్ధి చేసిన వంట నూనెలే..**



డాక్టర్ ఆర్‌బీఎన్ ప్రసాద్

డయల్ **1800112100**
నూనె ప్యాకెట్లపై నిబంధనల ప్రకారం వివరాలు లేకపోతే ఎఫ్ఎస్ఎస్ఏఐ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి.

ప్రస్తుతం ప్రపంచంలో వాడుతున్న వంట నూనెల్లో 85 శాతం శుద్ధి చేసినవే. రిఫైన్డ్ నూనెల్లో వాడే రసాయనాలు అన్నీ కోడెక్స్ (నాణ్యతా ప్రమాణాలు నిర్ధారించే అంతర్జాతీయ సంస్థ) నిర్ధారించినవే. కోడెక్స్ సహా మన దేశంలోని ఎఫ్ఎస్ఎస్ఏఐ సిఫారసు చేసిన హాని చేయని రసాయనాల్ని రిఫైనింగ్‌లో వాడుతున్నారు. కాబట్టి ఎలాంటి భయం లేకుండా రిఫైన్డ్ ఆయిల్స్ వాడుకోవచ్చు. అందులో విషం ఉంటుందనేది ఏమాత్రం నిజం కాదు. అంతేకాదు కొన్ని గింజల నుంచి గానుగ పద్ధతిలో నూనెను తయారు చేయలేం. వేరుశనగ, నువ్వులు, ఆవాలు, కొబ్బరి, కుసుమ గింజలనే గానుగ చేసి నూనె తీయవచ్చు. కానీ పామాయిల్, సోయాబీన్ నూనెలను ఆ పద్ధతిలో తీయలేం. వాటిని రిఫైన్ చేయకుండా వాడలేం. ప్రపంచంలో మూడింట రెండో వంతు పామాయిల్, సోయాబీన్ నూనెలనే వాడతారు. మన దేశంలో ఏడాదికి 23 మిలియన్ టన్నుల నూనె వాడతారు. కానీ మనం 8 మిలియన్ టన్నులే ఉత్పత్తి చేస్తున్నాం. మిగిలినది దిగుమతి చేసుకుంటున్నాం. కాబట్టి గానుగ నూనె అందరికీ ఇవ్వలేం. గానుగ నూనె మంచిది కాదని కూడా చెప్పడం లేదు. శుద్ధి చేసిన నూనెలు మంచివి కావని ప్రచారం చేయడమే తప్పు.

గింజలను గానుగ ఆడించినప్పుడు వాటి నుంచి నూనె మొత్తం రాదు. దాదాపు 25 శాతం చెక్కలోనే ఉండిపోతుంది. కాబట్టి వాటి ధర ఎక్కువ ఉంటుంది. ఇక శుద్ధి చేసిన నూనెలను తయారు చేసే కంపెనీలు పెద్దమొత్తంలో తక్కువ ధరకు ముడిపదార్థాలు కొంటాయి. పైగా యంత్రాలతో నూనె మొత్తాన్నీ తీస్తాయి. అందువల్ల వాటి ధర తక్కువగా ఉంటుంది. ఇక గానుగ చేసేందుకు వాడే గింజల్లో పుచ్చిపోయినవి ఉంటే వాటి నూనె విషంగా మారుతుంది. ఉదాహరణకు

**ఎక్కువ రాదు కాబట్టి గానుగ నూనె ధర ఎక్కువ**

పుచ్చిపోయిన పల్లీలతో నూనె తీస్తే అందులో ఎఫ్లాటాక్సిన్ అనే విష పదార్థం ఉంటుంది. ఇది క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు కారణం అవుతుంది. అయితే అవే గింజలను రిఫైన్ చేస్తే ఎఫ్లాటాక్సిన్ పోతుంది. అప్పుడు అది మంచిదవుతుంది. పెద్ద పెద్ద కంపెనీలు తయారు చేసే రిఫైన్డ్ నూనెల్లో కల్తీ జరుగుతుందని చెప్పడం నిజం కాదు.

నూనెల్లో సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు, మోనో అన్ సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు, పాలి అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు ఉండాలి. ఈ మూడూ సమాన నిష్పత్తిలో ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) స్పష్టం చేసింది. ఈ మూడూ సమతూకంలో లేకపోతే అనేకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. పాలి అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాల్లో ఒమెగా–3, ఒమెగా–6 ఆమ్లాలుండాలి. ఒమెగా–3 ఆమ్లాలు అన్ని నూనెల్లో ఉండవు. కేవలం సోయాబీన్, ఆవనూనెల్లో మాత్రమే 5–10 శాతం ఉంటాయి. ఒమెగా–3 లేని నూనెలను వాడితే శారీరక రుగ్మతలు తలెత్తుతాయి. కాబట్టి ఒమెగా–3 ఉన్న నూనెలను వాడనివారు, ఇతర నూనెలు వాడుతున్నవారు తప్పనిసరిగా అవిసె గింజలు దోరగా వేయించినవి రోజూ కొద్దిగా తింటే సరిపోతుంది. అవిసె గింజల్లో 55 శాతం ఒమెగా–3 ఆమ్లాలుంటాయి. నిత్యం చేపలు తినేవారికి ఒమెగా–3 లభిస్తుంది. కానీ మన వద్ద నిత్యం చేపలు తినే పరిస్థితి ఉండదు. అలాగే అందరూ చేపలు తినరు. కాబట్టి ఆ ఆమ్లాలున్న నూనెలు వాడాలి. ఆలివ్‌నూనెలో మోనో అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు దాదాపు 75 శాతం ఉంటాయి. సన్‌ఫ్లవర్, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి గింజ, అవిసె నూనెల్లో పాలి అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు 50 శాతం కంటే ఎక్కువగా ఉంటాయి. కొబ్బరి నూనెలో 90 శాతం, పామాయిల్‌లో 50 శాతం వరకు సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలుంటాయి.

**ఆమ్లాలు సమాన నిష్పత్తిలో ఉండాలి**

### నూనెల మిక్సింగ్ మంచిది

రెండు అంతకంటే ఎక్కువ నూనెలను కలిపి వాడాలి. ఒక నూనెలో మూడు ఫ్యాటీ ఆమ్లాలు సమాన నిష్పత్తిలో లేనప్పుడు, సమాన నిష్పత్తిలోకి తీసుకొచ్చేలా ఏవైనా రెండు అంతకంటే ఎక్కువ నూనెలు ఇంట్లోనే కలిపి వాడుకోవచ్చు. ప్రతి నూనె ప్యాకెట్ మీద ఆ మూడు ఫ్యాటీ ఆమ్లాల నిష్పత్తి ఉంటుంది. మూడు ఫ్యాటీ ఆమ్లాల నిష్పత్తితో పాటు నూనెల్లో అతి తక్కువ పరిమాణంలో ఉండే కొన్ని గామా ఒరిజినాల్, టోకోఫిరాల్స్ (విటమిన్–ఈ), ఫైటోస్టిరాల్ వంటి పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఉదాహరణకు రైస్‌బ్రాన్‌లో ఒరిజనాల్ అనే పదార్థం ఉంటుంది. దీనివల్ల గుండెకు మేలు జరుగుతుంది. దాదాపు అన్నింటిల్లోనూ ఫైటోస్టిరాల్ ఉంటుంది. దీనికి కొలెస్టరాల్ తగ్గించే స్వభావం ఉంది. నువ్వుల నూనెలో సిసీమోల్, సిసీమోలిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవన్నీ లేబిలింగ్‌లో చూసుకోవాలి. ప్యాకింగ్‌పై ఉన్న అధికారిక సమాచారంతోనే దాన్ని వాడాలా లేదా తెలుసుకోవచ్చు.

### నూనె లూజ్‌గా అమ్మకూడదు



లూజ్ ఆయిల్ అమ్మడం నిషేధం. చట్ట ప్రకారం నేరం. లూజ్ అంటే ప్యాక్ చేయకుండా కొలిచి అమ్మే నూనె. దీనిని కొనకూడదు. ప్యాకేజ్డ్ నూనెనే కొనుగోలు చేయాలి. ప్యాకెట్లు, ప్లాస్టిక్ సీసాల్లో విక్రయించే నూనెలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ఉండాలి. పోషక విలువలు, కొలెస్ట్రాల్ వంటివి ఎంతున్నాయో ముద్రించాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ఉన్న బ్రాండెడ్ కంపెనీలవే వాడాలి. ప్యాకింగ్‌ను ట్యాంపరింగ్ చేసినట్లు ఉంటే బ్రాండెడ్ కంపెనీల నూనెలనైనా కొనకూడదు. సైంటిఫిక్ రిఫరెన్స్ లేబిలింగ్ ఉందో లేదో చూసుకోవాలి. గడువు తేదీ కూడా చూసుకోవాలి. లైసెన్స్ లేకున్నా, నిబంధనల ప్రకారం నూనె ప్యాకెట్లపై వివరాలు లేకున్నా ఎఫ్ఎస్ఎస్ఏఐ టోల్ ఫ్రీ నంబర్ (1800112100) కు ఫోన్ చేయవచ్చు.

## కౌంటర్ దాఖలు చేయండి

### 'లాకప్‌డెత్'పై అధికారులకు హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: ఇటీవల మెదక్‌లో జరిగిన ఖదీర్ ఖాన్ లాకప్‌డెత్ ఘటనపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర హోం కార్యదర్శి, డీజీపీ, మెదక్ ఎస్పీలకు మంగళవారం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 14కు వాయిదా వేసింది. మెదక్ పట్టణానికి చెందిన ఖదీర్ ఖాన్...గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 16వ తేదీ రాత్రి మృతి చెందాడు. దొంగతనం కేసులో అతన్ని పోలీసులు తీవ్రంగా కొట్టడం వల్లే మృతి చెందాడంటూ ఆయన భార్య సిద్ధేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఏఏజీ రామచంద్రరావు పోలీసుల తరఫున వాదనలు వినిపిస్తూ...ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు ఖదీర్‌ను హాజరుపరిచిన 14 రోజుల తర్వాత అతను మృతి చెందాడని చెప్పారు. వాదనల తర్వాత ధర్మాసనం..ఖదీర్ భార్య తన భర్తను లాకప్‌డెత్ చేశారని ఆరోపిస్తోందని, దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

**సిట్‌తో విచారణ జరిపించాలి...**

ఖదీర్ మృతిపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరిపించాలని, ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని కోరుతూ అతని భార్య సిద్ధేశ్వరి లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తన భర్తను అత్యంత క్రూరంగా చంపారని, సీసీటీవీ ఫుటేజీ ఫ్రీజ్ చేసేలా ఎస్పీకి ఆదేశాలివ్వాలని న్యాయస్థానానికి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. స్పెషల్ జీపీ సంతోశ్‌కుమార్ హాజరై.. సుమోటో పిల్ వివరాలను తెలిపారు. తదుపరి వాదనల కోసం ఈ పిటిషన్‌ను కూడా పిల్‌తోపాటే జతచేయాలని రిజిస్ట్రీకి సూచించారు.

### 'వార్‌రూం' కేసులో బలవంతపు చర్యలొద్దు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ గళం'ఫేస్ పేజీ నిర్వాహకులపై, కంటెంట్ క్రియేటర్లపై తాము తదుపరి ఆదేశాలిచ్చేవరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా బలవంతపు చర్యలు చేపట్టవద్దని స్పష్టంచేసింది. ఒకే అంశానికి సంబంధించి మూడు చోట్ల కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ మాజీ ఎంపీ మల్లు రవితో పాటు పలువురు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పోలీసులు వేర్వేరు చోట్ల కేసు లు నమోదు చేసి సమన్లు జారీ చేస్తున్నారని చెప్పారు. కేసు పెట్టిన వారు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు కాకపోయినా, పని చేస్తున్నట్లు పేర్కొన్నారని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణను మార్చి 14కు వాయిదా వేశారు.

### 'త్వరలో జూ.పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్'

సాక్షి, హైదరాబాద్: త్వరలోనే 317 జీవోతో ముడిపడిన బదిలీల సమస్యలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ వంటి సమస్యలను పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీనిచ్చారని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ తెలిపింది. వీటితో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో సీనియార్టీ జాబితా ప్రకారం నోషనల్ ప్రమోషన్ ఇవ్వడంపైనా నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పినట్లు వెల్లడించింది. మంగళవారం ఎర్రబెల్లి, పీఆర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, డైరెక్టర్ హనుమంతరావు 'తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్–2023'డైరీని ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శులు మరింతగా గ్రామాల పురోగతికి కృషి చేయాలని మంత్రి సూచించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

### 'డ్వాక్రా ఉత్పత్తులకు కామన్ బ్రాండింగ్'



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా తయారు చేస్తున్న నిత్యావసర, ఇతర వస్తువులకు ఇంకా ఆకర్షణీయంగా లేబిలింగ్, ప్యాకింగ్‌తోపాటు మంచి కామన్ బ్రాండింగ్ ఏర్పాటు చేయాలి. దీనికి తెలంగాణ ముద్ర ఉండేటట్టు చూడాలి. అప్పుడు ఈ వస్తువులకు డిమాండ్ మరింత పెరుగుతుంది'అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శి, సెర్ప్ సీఈవో సందీప్‌కుమార్ సుల్తానియా, ఇతర అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ సంస్థతో ఒప్పందం కుదిరిందని, అమెజాన్ వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ వంటి సంస్థలతోనూ మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయా సంస్థలతో ఒప్పందాలు చేసుకొని మహిళా ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు విస్తృతం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా అభివృద్ధి, సంక్షేమంలో మనకు సాటి లేదని, మహిళాసంఘాల అభివృద్ధి, పొదుపు రుణాల్లో దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. ఈ దశలో రాష్ట్రం పేరుప్రతిష్టలు ఇనుమడించేలా, మహిళా ఉత్పత్తులను సులువుగా, ఆకర్షణీయంగా అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముడుపోయేలా ఈజీగా, క్యాచీగా ఉండేట్లుగా బ్రాండింగ్ రూపొందించాలని మంత్రి సూచించారు. త్వరలోనే సీఎం దృష్టికి తీసుకెళ్లి, వారి అనుమతితో కొత్త బ్రాండింగ్ చేయాలని, అందుకు తగ్గట్లుగా పలు పేర్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

### పదోన్నతులు అడిగితే సస్పెండ్ చేస్తారా?

- భాషా పండితుల సమస్యలను పరిష్కరించాలి
- సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: భాషా పండితులను సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల ఉపసంహరణతోపాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వారి ప్రమోషన్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విజ్ఞప్తిచేశారు. ఈమేరకు ఆయన లేఖరాశారు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా భాషా పండితులు చేస్తున్న సేవలకు వారిని సత్కరించాల్సింది పోయి.. ప్రమోషన్లు అడిగినందుకు ముగ్గురు భాషా పండితులను సస్పెండ్ చేయడం గర్హనీయమన్నారు. రాష్ట్రంలో 8,500 మందికిపైగా ఉన్న భాషా పండితులకు 22 ఏళ్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన తెలుగు మహాసభల్లో భాషా పండితులకు వెంటనే ప్రమోషన్లు కల్పిస్తామని సీఎం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

**అధికారిక లాంఛనాల్లోనూ ఇదేం వివక్ష?**

ఎమ్మెల్యేగా ఐదుసార్లు గెలిచి ప్రజలకు సేవ చేసిన దళిత నేత సాయన్న అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించకపోవడం శోచనీయమని బండి సంజయ్ మండిపడ్డారు. నిజాం రాజు వారసుడికి మాత్రం అధికారిక లాంఛనాలతో ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించిందని ఎద్దేవాచేశారు. దళితుడైన సాయన్న విషయంలో వివక్ష చూపడం క్షమించరానిదన్నారు. అంబర్‌పేటలో గంగపుత్ర సామాజికవర్గానికి చెందిన 4 ఏళ్ల బాలుడు వీధి కుక్కల దాడిలో మరణిస్తే సీఎం కేసీఆర్ స్పందించకపోవడం బాధాకరమన్నారు.

## పోలీసుల ప్రతిష్టను పెంచేది రిసెప్షనిస్టులే

- ఫిర్యాదుదారులకు నమ్మకం కల్పించాలి: డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించడంలో పోలీస్‌స్టేషన్లలోని రిసెప్షన్ ఆఫీసర్ పాత్ర కీలకమని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లలో రిసెప్షన్ ఆఫీసర్ స్టాఫ్ ఫంక్షనల్ వర్టికల్స్‌పై తొలిసారిగా మంగళవారం రాష్ట్రంలోని 736 మంది రిసెప్షన్ అధికారులతో డీజీపీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు 17 ఫంక్షనల్ వర్టికల్స్ ప్రవేశపెట్టామని తెలిపారు. వీటిలో మొదటిదైన రిసెప్షన్ ఆఫీసర్ వర్టికల్ అత్యంత కీలకమని అన్నారు. కాగా, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌ను డీజీపీ ఆకస్మికంగా సందర్శించారు. పీటీవో విభాగం పనితీరు, వాహనాల నిర్వహణ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

**త్వరలో పోలీస్ డ్యూటీ మీట్**

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను సెప్టెంబర్‌లోగా నిర్వహించనున్నామని, ఆ బాధ్యతలను సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్‌కు అప్పగిస్తున్నామని డీజీపీ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో మెడల్స్ సాధించిన తెలంగాణ పోలీసు అధికారులు, కోచ్‌ల సన్మాన కార్యక్రమం డీజీపీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో నాలుగు విభాగాల్లో ఐదుగురికి అవార్డులు లభించాయి.

**మెడల్స్ సాధించింది వీరే...**

లిఖిత పరీక్ష విభాగంలో ఎల్.బి.నగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎ.మన్మోహన్‌కు బంగారు పతకం లభించింది. పోలీస్ వీడియోగ్రఫీ విభాగంలో సైబరాబాద్ కానిస్టేబుల్ అనిల్ కుమార్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ విభాగంలో ఎస్.ఐ.బి. ఇంటెలిజెన్స్ ఎస్.ఐ. బి.వెంకటేశ్, ఇంటెలిజెన్స్ సెల్‌లో హెడ్ కానిస్టేబుల్ బి. విజయ్‌కి సిల్వర్ మెడల్స్ లభించాయి. యాంటీ సాబోటేజ్ చెకింగ్ విభాగంలో తెలంగాణ పోలీస్ శాఖకు మూడవ ట్రోఫీ లభించింది.

## ..ఆదుకోనేలా మన ఫార్మా

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు కానున్నాయి..'అని మంత్రి తెలిపారు.

**ఈ ఏడాది రాబర్ట్ లాంగర్‌కు అవార్డు**

'బయో ఆసియా గత 19 ఏళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. వందకుపైగా దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, నోబెల్ అవార్డు గ్రహీతలకు ఆతిథ్యం ఇవ్వగలిగాం. 20 వేలకు పైగా భాగస్వామ్య చర్చలకు వెసులుబాటు కల్పించాం. ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ తయారీకి కీలకమైన ప్రయోగాలు నిర్వహించిన రాబర్ట్ లాంగర్‌కు ఈ ఏడాది జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డును అందించనున్నాం. 400కు పైగా స్టార్టప్‌లతో నిర్వహిస్తున్న పోటీలో 75 వరకూ స్టార్టప్‌లను స్క్రీన్ చేయగా.. వీటిల్లో టాప్ 5 సంస్థలు బయో ఆసియా సదస్సు తుది రోజు తమ ఆలోచనలను పంచుకోనున్నాయి..'అని వెల్లడించారు.

**తొలిసారిగా సదస్సుకు ఆపిల్ కంపెనీ..**

'బయో ఆసియా సదస్సు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నీతిఆయోగ్ ఇతర రాష్ట్రాలకు బయో ఆసియా నిర్వహణ, ఫలితాలపై మాస్టర్ క్లాస్ ఇస్తోంది. పలు అంతర్జాతీయ వేదికలపై బయో ఆసియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. (ఈ సందర్భంగా కేటీఆర్ కొన్ని ఉదాహరణలు చెప్పారు) 20వ బయో ఆసియా సదస్సులో తొలిసారి ఆపిల్ కంపెనీ కూడా పాల్గొంటోంది. ఆపిల్ ఆరోగ్య విభాగానికి చెందిన డాక్టర్ సంబుల్ దేశాయి, యూనిసెఫ్ ప్రతినిధి సింథియా మెకాఫీ, దేశీ ఫార్మారంగ ప్రముఖులు అజయ్ పిరమల్, సతీశ్‌రెడ్డి, గ్లెన్ సల్దానా తదితరులు పాల్గొంటున్నారు..'అని కేటీఆర్ వివరించారు.

**రెట్టింపు పెట్టుబడులు, ఉద్యోగాలు...**

'జీవశాస్త్ర రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం బయో ఆసియాతో పాటు అనేక ఇతర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో జీవశాస్త్ర రంగం విలువ, ఉద్యోగాలు కూడా 2028 నాటికి రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. 2021లో హైదరాబాద్, దాని పరిసరాల్లోని జీవశాస్త్ర రంగ కంపెనీల ఆదాయం 50 బిలియన్ డాలర్లుగా ఉంది. 2028 నాటికి దీన్ని వంద బిలియన్ డాలర్లకు చేరుస్తాం. ప్రస్తుతం ఈ రంగంలోని 4 లక్షల ఉద్యోగాలను 8 లక్షలు చేస్తాం. రంగారెడ్డి జిల్లా మెడికల్ కాలేజీని ఫార్మాసిటీకి అనుబంధంగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం..'అని చెప్పారు.

**'టీం ఇండియా'స్ఫూర్తి నినాదాలకే పరిమితం**

తెలంగాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. బల్క్ డ్రగ్ పార్కు మొదలుకొని రక్షణ రంగం ప్రాజెక్టు వరకు పలు విషయాల్లో కేంద్రం తనదైన శైలిలో వ్యవహరించిందని, 'టీం ఇండియా'అన్న స్ఫూర్తిని కేవలం నినాదాలకే పరిమితం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ జీవశాస్త్ర, ఫార్మా విభాగపు డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.



ఆకాశంలో తూర్పు, పడమర అనే విభజన లేదు.
తమ మనసులోంచి జనాలు ఈ విభజనను సృష్టిస్తారు,
వాటినే నిజమని నమ్ముతారు.
– బౌద్ధ ధర్మం



సాక్షి

బుధవారం, ఫిబ్రవరి, 22

# 'న్యాయం'పై నెతన్యాహూ కక్ష

అంతా అనుకున్నట్టే అయింది. గత నవంబర్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించి డిసెంబర్‌లో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ న్యాయవ్యవస్థపై కత్తిగట్టారు. ఆ వ్యవస్థలో సంస్కరణల పేరిట దాని అధికారాలు తెగ్గోసేందుకు సిద్ధపడ్డారు. కొన్ని నెలలక్రితం నెతన్యాహూ నాయకత్వంలోని లికుడ్ పార్టీకి ఎగబడి ఓట్లేసిన జనమే ఇప్పుడు న్యాయవ్యవస్థ రక్షణ కోసం వీధుల్లోకొచ్చారు. పార్లమెంటు వెలుపల అయిదారు రోజులుగా ఎడతెగకుండా నిరసన ప్రదర్శనలు సాగుతున్నాయి. వీటన్నిటినీ బేఖాతరు చేస్తూ చట్టసభలో న్యాయసంస్కరణల బిల్లు ప్రాథమిక స్థాయిలో విజయం సాధించింది. సోమవారం రాత్రి జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 63 ఓట్లు, వ్యతిరేకంగా 47 వచ్చాయి. నెతన్యాహూ నేతృత్వంలోని అతి మితవాద, మత, ఛాందసవాద కూటమి ప్రభుత్వం పార్లమెంటులోని 120 స్థానాల్లో 64 గెల్చుకుంది. రాగల నెలల్లో న్యాయ సంస్కరణల బిల్లు మరో రెండు దశలు దాటాలి గనుక ఇప్పటికిప్పుడే అంతా అయిపోయినట్టు కాదు. అయితే అధికార కూటమి వరస చూస్తుంటే ఏదేమైనా చట్టం చేసితీరాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రచార సమయంలోనే నెతన్యాహూ తాము అధికారంలోకొస్తే న్యాయవ్యవస్థను సమూల ప్రక్షాళన చేస్తామని ఒకటికి పదిసార్లు ప్రకటించారు. దేశ శ్రేయస్సు కోసం చట్టాలు చేస్తుంటే సుప్రీంకోర్టు కొట్టివేస్తున్నదని, ఇందువల్ల దేశ భద్రత ప్రమాదంలో పడుతోందని ఆయన భావన. అంతే కాదు... న్యాయవ్యవస్థ నియామకాల్లో ప్రభుత్వానిది పైచేయిగా ఉండాలన్నది ఆయన కోరిక. నెతన్యాహూ సుభాషితాల వెనకున్న అంతరార్థం వేరు. ఆ వ్యవస్థ తమకు సాగిలపడివుండాలన్నదే ఆయన మాటల్లోని సారాంశం.

తాజా బిల్లు చట్టమైతే సుప్రీంకోర్టు కొట్టేసిన నిర్ణయాన్ని పార్లమెంటు తిరగదోడొచ్చు. కనీస మెజారిటీతో...అంటే పార్లమెంటులోని 120 మంది సభ్యుల్లో 61 మంది కాదంటే సుప్రీంకోర్టు తీర్పును రద్దుచేయొచ్చు. దేశ రాజ్యాంగంగా ఉండే మౌలిక చట్టంలోని అంశాలను సమీక్షించే అధికారాన్ని సుప్రీంకోర్టునుంచి తొలగించటం మరో ప్రతిపాదన. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో రాజకీయ వర్గానిదే పైచేయి కావడం మూడో ప్రతిపాదన. ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు సభ్యులుగా ఉండే నియామకాల కమిషన్ పనిచేస్తోంది. ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించటం ఆనవాయితీగా వస్తున్నా న్యాయవ్యవస్థ ప్రతినిధుల ఆధిక్యత ఉన్నందువల్ల చాలాసార్లు ఆ వ్యవస్థ నిర్ణయమే అంతిమంగా అమలవుతోంది. ఇప్పుడు చేసిన ప్రతిపాదన దాన్ని తారుమారు చేస్తుంది. అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న అతి ఛాందసవాద యూదు పార్టీలు తమ మతంలోని యువకులను నిర్బంధ సైనిక శిక్షణనుంచి తప్పించాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాయి. ఆ చట్టం తీసుకొస్తే సమాన న్యాయం పేరిట సుప్రీంకోర్టు కొట్టేస్తుందన్న భయాందోళనలు ఆ పార్టీలకున్నాయి. అందుకే ఆ పార్టీలు గట్టిగా మద్దతునిస్తున్నాయి. మరో కీలకమైనది పాలస్తీనా సమస్య. పాలస్తీనా పౌరులను ఎంతగా ఇబ్బంది పెడితే అంతగా యూదుల్లో తమకు మద్దతు పెరుగుతుందని దాదాపు అన్ని పార్టీలూ భావిస్తాయి. యూదుల్లో జాతీయ భావాల్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవటం వాటికి అలవాటుగా మారింది. ఒకపక్క ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలన్న డిమాండ్ ప్రపంచ దేశాలన్నిటి నుంచీ వస్తుంటే ఆ ఆక్రమణలను మరింత పెంచుకోవటమే లక్ష్యంగా ఇజ్రాయెల్ పాలక పక్షాలు పని చేస్తున్నాయి. అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం ఈ ఆక్రమణలు చట్టవిరుద్ధమైనవి. అయినా అవి ఉన్నకొద్దీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం వెస్ట్‌బ్యాంకు, తూర్పు జెరూసలెంలలో ఆక్రమిత భూభాగాల్లో దాదాపు ఏడున్నర లక్షలమంది ఇజ్రాయెల్ పౌరుల ఆవాసాలున్నాయి. వీటిని మరింత పెంచుకోవాలంటే సుప్రీంకోర్టు అడ్డంకిని తొలగించుకోవాలని నెతన్యాహూ కోరుకుంటున్నారు. న్యాయసంస్కరణల బిల్లుకు జనంలో పెద్దయెత్తున వ్యతిరేకత రావటం చూసి దేశాధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్ ఈ బిల్లుపై విపక్షాలతో చర్చించాకే తదుపరి చర్యలుండాలని హితవు పలికారు. అయితే నెతన్యాహూకు ఇది రుచించలేదు. విపక్షాలతో చర్చలకు సిద్ధమే అయినా చట్టం తీసుకురావటం ఖాయమని న్యాయశాఖ మంత్రి చెప్పారంటేనే ప్రభుత్వ సంకల్పం ఏమిటో అర్థమవుతోంది. ఇప్పటికే మూడు అవినీతి ఆరోపణల్లో విచారణ ఎదుర్కొంటున్న నెతన్యాహూ శిక్షపడే ప్రమాదం నుంచి తప్పించుకోవటానికి ఈ బిల్లును తెచ్చారన్నది విపక్షాల ప్రధాన ఆరోపణ

ఇజ్రాయెల్‌కు నిర్దిష్టమైన రాజ్యాంగం లేదు. ఫెడరల్ వ్యవస్థ లేదు. దేశానికంతకూ ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు నిర్ణయమే అంతిమం. ఇందువల్ల పార్లమెంటులో బలాబలాలే అన్నిటినీ నిర్ణయిస్తాయి. ఈ స్థితిలో కార్యనిర్వాహక వ్యవస్థ నిర్ణయాలను సమీక్షించి సమతుల్యత సాధించే మరో వ్యవస్థ ఎంతో అవసరం. ఆ పాత్రను సుప్రీంకోర్టు సమర్థవంతంగా పోషిస్తోంది. దేశ జనాభా 90 లక్షలమందిలో అయిదోవంతుమంది అరబ్బులు. మరో 30 లక్షలమంది పాలస్తీనా పౌరులు వెస్ట్‌బ్యాంక్‌లో నివసిస్తున్నారు. వీరందరి ప్రయోజనాలనూ, శ్రేయస్సునూ దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు చేయాల్సిన నేపథ్యంలో మెజారిటీవాదమే చెల్లుబాటు కావాలనుకోవటం ఆత్మహత్యాసదృశమవుతుంది. స్వప్రయోజనాల కోసం దేశాన్నే పణంగా పెట్టిన నేతగా చరిత్రలో నిలుస్తారో, జనాభి ప్రాయానికి తలొగ్గుతారో నెతన్యాహూ తేల్చుకోక తప్పదు.

# నిఘంటు నిర్మాణంలో కొత్త పోకడలు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

మనకు తెలియకుండానే ఒక తెలుగు, ఒక ఆంగ్ల పదం కలగలిసిపోయిన 'సమోసా'ల్లాంటి మిశ్రమ సమాసాలు దొర్లి పోతూంటాయి. పాల పాకెట్టు, పాల వ్యాను– ఇలా వాడమని ప్రజలకు ఎవరూ చెప్పలేదు. ఇంగ్లిష్ పదాలను తెలుగులోకి అనువాదం చేసుకొని వినియోగించుకోవాలని వారు భావించనూ లేదు. వారి జ్ఞానంలోకి వచ్చిన ఇంగ్లిష్ పదాన్ని నేరుగా తెలుగు పదంలో కలిపి వాడుకున్నారు. ఇక పత్రికల్లో సరేసరి. అంబులెన్స్ సేవలు, అకౌంట్ బదిలీ, కొత్త నోటు, ట్విట్టర్ ఖాతా, గవర్నరమ్మ, డిగ్రీ పరీక్షలు, డ్వాక్రా మహిళలు, పెళ్లి ఫొటోలు– ఇలా కొల్లలుగా వచ్చి పడుతున్న మిశ్రమ పదాలను వివరిస్తుంది సరికొత్త 'తెలుగాంగ్ల మిశ్ర సమాస నిఘంటువు'.


"నిఘంటు రచన మతి చెడిన వృత్తి కాదు. ఎందుకంటే ఒక పద్ధతి ప్రకారం, ప్రణాళికాబద్ధంగా, నిఘంటు నిర్మాణం జరగాలి. 'నా బొందో' అంటూ కేంద్రీకరించి మరీ జరగాల్సిన పని. ఇందుకు నైఘంటికుడి మనస్సు నిర్మలంగా ఉండాలి. సందేహ నివృత్తి చేయగల స్పష్టత ఉండాలి. కానీ, ఒకటి మాత్రం నిజం. అప్పుడప్పుడూ ఈ వృత్తి, నిఘంటుకారుడి బుర్ర తినేస్తుంది. నిద్రాహారాలకు నోచుకోని పని రాక్షసుడిగా మారుస్తుంది".
– ఫ్రాన్స్ సాహిత్య చరిత్రను, ఫ్రెంచి భాషా పద వ్యుత్పత్తి శాస్త్ర నిఘంటువును రూపొందించి 'నా నిఘంటువును ఎలా నిర్మించాను' అన్న అత్యుత్తమ గ్రంథాన్ని రచించిన ఎమిలీ లిత్రే.

ఇప్పుడు మనం చర్చించుకునేది ఒక్కో అక్షరానికే కాదు, ఒక్కో పదానికి ఉన్న భిన్నార్థాలను గురించే కాదు, బహుశా ఇతర భాషా నిఘంటువులలో కూడా రాని, ఒక్క తెలుగులో మాత్రమే ఇటీవల వెలువడిన తొలి 'తెలుగాంగ్ల మిశ్ర సమాస నిఘంటువు' గురించి. పత్రికా భాషా నిఘంటువులు అనేక భాషల్లో ఎన్నో ఉండవచ్చు. కానీ, రెండు భాషలతో కూడుకున్న మిశ్ర సమాస నిఘంటువులు మాత్రం చాలా అరుదు. అలాంటి ప్రత్యేక నిఘంటువును విద్యారంగంలో, బోధనా రంగంలో ఉస్మానియా, హైదరాబాద్, ద్రవిడియన్ విశ్వ విద్యాలయాల్లో పరిశోధనా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా గడించిన అనుభవంతో ఆచార్య పులికొండ సుబ్బాచారి రూపొందించారు. పత్రికలు నిత్యం వాడుతూ పాఠకులకు అందించే కొత్త కొత్త మిశ్ర సమాసాల లోగుట్టును బయట పెట్టారు.

### ఆఫీసరమ్మ ఏ భాష?

పదాల వాడకంలో మనకు తెలియకుండానే ఒక తెలుగు, ఒక ఆంగ్ల పదం కలగలిసిపోయిన 'సమోసా'ల్లాంటి మిశ్రమ సమాసాలు దొర్లి పోతూంటాయి. ఉదాహరణకు 'అంబులెన్స్ సేవలు', 'అకౌంట్ బదిలీ', 'ఈడీ లేఖ', 'ఈ' పుస్తకం (ఎలక్ట్రానిక్ పుస్తకం), కొత్త నోటు, ట్విట్టర్ ఖాతా, గవర్నరమ్మ, ఆఫీసరమ్మ, డబుల్ బెడ్రూం ఇళ్లు, డిగ్రీ పరీక్షలు, డ్వాక్రా మహిళలు, పెళ్లి ఫొటోలు, పెళ్లి వీడియోలు, పేపరు ప్రకటన, ప్లాస్టిక్ చెత్త, పాల పాకెట్టు, కోళ్ల ఫారం, యూనియన్ ఎన్నికలు, సమ్మె హారన్, సీల్డు కవర్ ముఖ్యమంత్రి, స్పీకర్ నిర్ణయం – ఇలా కొల్లలుగా వచ్చి పడుతున్న తెలుగాంగ్ల మిశ్రమ సమాసాలకు ఆధారాలు, అర్థ వివరణలను సుబ్బాచారి ఎంతో శ్రమపడి అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 1,600 సమాసాలకు పొందికైన వివరణలున్నాయి. సంప్రదాయ వ్యాకరణాలు చూపించని సంధి సమాసాల నియమాలను రచయిత ప్రత్యేకించి చూపారు. ఇంతకు ముందు తెలుగు భాషలో ఉన్న అందమైన పదాలకు 'ఒక్క పదం – అర్థాలెన్నో' మకుటంతో రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి తెలుగు పదాల అందచందాలను, ప్రత్యేకతను తెల్పడానికి విశిష్టమైన తొలి ప్రయత్నం చేశారు.

రెండో మాట



ఫ్రాన్స్‌లోని లూవ్ మ్యూజియంలో ఉన్న సుమేరియన్-అక్కాడియన్ పదకోశం

### నిఘంటు చరిత్ర ప్రాచీనం

ఇలా ఒక్కో పదానికే కాదు, ఒక్కో 'వర్ణా'నికి (అక్షరానికి) కూడా భిన్నార్థాలుంటాయన్నాడు క్రీ.శ. ఒకటో శతాబ్ది నాటి చైనీస్ నైఘంటికుడు హ్యూషెన్. ప్రపంచంలో తొలి ద్విభాషా నిఘంటువు క్రీ.పూ. 2000 ఏళ్ల నాటి సుమేరియన్, అక్కాడియన్ ప్రతి. ప్రపంచంలో తొలి త్రిభాషా నిఘంటువు సుమేరియన్ – బాబిలోనియన్ – హిట్టయిట్ భాషల్లో వెలువడింది. అలాగే ఔషధ శాస్త్రానికి సంబంధించిన ఔషధీ నిఘంటువు (ఫార్మకోపియా) తొలిసారిగా మెసపటోమియా మట్టి ఫలకలపై వెలుగు చూసిందంటారు. ఎటు తిరిగీ మానవాళి విజ్ఞాన, వికాస దశల్లోకి కాలిడిన తర్వాతనే శబ్ద, రూప నిర్ణయంతో అకారాది క్రమంలో నిఘంటువులు వెలువడుతూ వచ్చాయి. మహా కథకులు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి తెలుగునాట వైద్య భాషకు అత్యంత ప్రాచీన చరిత్ర ఉందని వెల్లడించారు. మన చరకుడి ఆయుర్వేద వైద్య శాస్త్రం, శుశ్రుత కృషినీ మరవలేం. వన మూలికల ప్రాశస్త్యం తెలిపిన తొలి భారతీయ రచన 'అధర్వ వేదం' (ఇనుపరాతి యుగం) నాటిది. అనారోగ్యం అనేది 'విధి నిర్ణయం కాద'ని చెబుతూ, మానవ ప్రయత్నం ద్వారా, సంకల్ప బలం ద్వారా జీవితాన్ని పొడిగించడం సాధ్యమని చరకుడు తన వైద్య సంపుటం 'చరక సంహిత'లో స్పష్టం చేశాడు.

### వ్యవహార నిఘంటువు

ఆధునిక యుగంలో అలాంటి గొప్ప ప్రయత్నంలో భాగమే, సరికొత్త ప్రత్యేక మిశ్ర సమాస నిఘంటు నిర్మాణం అనీ, ఇది 'ఆహ్వానించదగిన' పరిణామమనీ అన్న భాషా శాస్త్రజ్ఞులు, మిత్రులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అభిభాషణతో ఏకీభవించని వారుండరు. తెలుగు వినియోగంలోకి వచ్చేసిన 'పాల క్యాను, పాల మీటరు, పాల పాకెట్టు, పాల వ్యాను, పాల ట్యాంకరు' లాంటి కొత్త సమాసాలు చేయమని ప్రజలకు ఎవరూ చెప్పలేదు. లేదా ఇంగ్లిష్ పదాలను తెలుగులోకి అనువాదం చేసుకొని వినియోగించుకోవాలని వారు భావించనూ లేదు. వారి జ్ఞానంలోకి వచ్చిన ఇంగ్లిష్ పదాన్ని నేరుగా తెలుగు పదంలో కలిపి వాడుకున్నారు. 'ఇలా వాడొద్దు, ఇంగ్లిష్ పదాన్ని తెలుగు చేసుకొని వాడుకోమని ఎవరైనా పండితుడు చెప్పినా లేదా ప్రభుత్వం వారు నిర్దేశించినా ఫలితం ఉండదు. జన వ్యవహారాన్ని ఎవరూ మార్చలేరు. ఇది అనివార్యంగా జరుగుతూ ఉన్న భాషా పరిణామం అని అర్థం చేసుకోవా'లన్న సుబ్బాచారి వ్యవహార పరిజ్ఞానం మెచ్చుకోదగింది.

భాషా పరిణామం అనేది 'సమాజ సహజ పరిణామంలో భాగంగా' జరుగుతున్నది కాబట్టే, ఇలా తెలుగాంగ్ల పదాల కలయికతో మిశ్రమ సమాసాలు అనివార్యమవుతున్నాయి. కాబట్టి భాషావేత్తలు ఈ పరిణామాన్ని విధిగా అధ్యయనం చేయవలసి ఉందన్న రచయిత భావన ప్రశంసనీయమైనది. ముందు పదాల విదేశీకరణం, దేశీయ పదాలు క్రమంగా ఉనికిలోకి వచ్చిన తరువాత దేశీకరణ, అవసరాన్ని బట్టి మిశ్ర భాషా సమాసాలూ భాషా పరిణామంలో అనివార్యమని భావించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే – సకల భాషా, సంస్కృతుల సమ్మేళనమే ఒక మిశ్ర సమాస నిఘంటువు!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### ఇదే అభిప్రాయం



డియర్ నెట్‌ఫ్లిక్స్ ఇండియా, మీ సర్వేలో పాల్గొనమని చెబుతూ నా ఈమెయిల్‌కు గంపగుత్త మెసేజీలు పంపొద్దు. అర్ధరాత్రి నుంచి మధ్యాహ్నం వరకు 31 మెయిల్స్ వచ్చాయి. నాకు తెలుసు మీరు 'నా అభిప్రాయానికి విలువ' ఇస్తారని. కానీ ఇది మరీ చిరాకుగా ఉంది. దయచేసి ఆపండి.
– షమా రాహా, జర్నలిస్ట్

### ఖరీదైన ప్రేమ



మీలో ఎంతమంది కొంత ఖరీదైనదేదో కొనుక్కొచ్చి, ఇంట్లోవాళ్లు అది అంత ఖరీదైనదని అనుకోకుండా ఉండటానికి దానిమీదున్న లేబుల్ తీసేశారు? ఇట్లాంటివి కేవలం ఇండియాలోనే చేస్తామా?
– గాయత్రీ జయరామన్, వ్యాఖ్యాత

### కాదు నేరం



ఏం జరుగుతున్నదో చూడండి. భౌతిక గాయాలు లేనంతవరకూ, జంతువులతో లైంగిక చర్యను స్పెయిన్‌లో ఇకనుంచీ నేరంగా చూడరట.
– జేమ్స్ మెల్‌విల్, కామెంటేటర్

### కావాలి కొలీజియం



తన ప్రయోజనాలే నడిపి వుండొచ్చు–ఎన్నికల కమిషన్ పైస్థాయి అధికారులు కొలీజియం ద్వారా ఎంపిక కావాలన్న ఉద్ధవ్ ఠాకరే ఆలోచన మంచిదే.
– పమేలా ఫిలిపోస్, జర్నలిస్ట్

### ఇలాగే తాగాలి



చక్కెర, పాలు కలపకుండానే టీని బాగా ఎంజాయ్ చేయొచ్చు. చక్కెర (లేదా షుగర్‌ఫ్రీ) ఒక వ్యసనం. ఒక నెల వదిలేసి చూడండి. తర్వాత టీ, కాఫీలకు మీకు తియ్యదనాన్ని కలపాలనే అనిపించదు.
– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

### వేలెత్తి చూపారు



లాహోర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో ముంబయి తీవ్రవాద దాడుల గురించి జావేద్ అఖ్తర్ తన అభిప్రాయాలను పంచుకున్నారు– ఏ తీవ్రవాదీ నార్వే నుంచి రాలేదు, వాళ్లు ఇక్కడినుండి వచ్చారని చెప్పారు. ఇంకా, మేము నుస్రత్ ఫతే అలీ ఖాన్‌ను సెలబ్రేట్ చేశాం, కానీ మీరు లతా జీ (మంగేష్కర్) కోసం ఒక్క కార్యక్రమం చేయలేదని అన్నారు.
– బీంగాస్, పాకిస్తాన్ యాక్టివిస్ట్

### మూడు యుగాలు



హిందూయిజాన్ని మూడు ముఖ్య యుగాలు విభజించవచ్చు. వేదాలు 3,000 ఏళ్ల క్రితం ప్రబలంగా ఉన్నాయి. వేదాంగాలు 2,000 ఏళ్ల క్రితం ప్రబలంగా ఉన్నాయి. వేదాంతం 1,000 ఏళ్ల క్రితం కీలకంగా మారింది. ఇవన్నీ ఉజ్జాయింపులే కావొచ్చు, కానీ హిందూ చరిత్రను గుర్తుంచుకోవడానికి సులభ అవగాహనగా పనికొస్తాయి.
– దేవ్‌దత్ పట్నాయక్, మైథాలజిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

# టర్కీ ప్రళయం ఒక పాఠం కావాలి!

అభిప్రాయం



రెహానా

టర్కీ, సిరియాలలో వచ్చిన భూకంపాలతో ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఇప్పటి వరకు 46 వేల మందికి పైగా మృత్యువాత పడ్డారు. శిథిలాల కింద ఇంకా ఎంతమంది సమాధి అయ్యి ఉన్నారో తేలాల్సి ఉంది. గాయపడిన వారి సంఖ్య లక్ష దాటింది. నిరాశ్రయులైన వారు లక్షల్లోనే ఉన్నారు. టర్కీలోని హతాయ్, కహ్రమన్ మరాష్, అద్యామాన్, నూర్దాగ్, ఇస్కంద్రన్, అంతాక్యా వంటి పలు పట్టణాలు పూర్తిగా నేల మట్టం అయ్యాయి. ఇవే కాదు భూకంప ప్రభావం పడిన సుమారు 500 కిలో మీటర్ల మేర రహదారిలో ప్రయాణం చేస్తుంటే రోడ్డుకు ఇరువైపుల ఊర్లకు ఊర్లు కాంక్రీటు కుప్పలుగా మారిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. మృతులను ఖననం చేయటానికి శ్మశానాలు సరిపోక అనేక చోట్ల ఖాళీ స్థలాలను సామూహిక ఖనన ప్రాంతాలుగా మార్చేశారు. అక్కడ కాసేపు నిలబడితే వరుసగా అంబులెన్స్‌లు వచ్చి నల్లటి బ్యాగులను రోడ్డు పక్కన పెట్టి వెళ్లే దృశ్యాలు తీవ్ర వేదనను కలిగిస్తున్నాయి.

రిక్టర్ స్కేల్‌పై ఒకదాని వెంట ఒకటిగా 7.8, 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు రావడమే ఇంతటి విధ్వంసానికి కారణమా? లేక మానవ స్వయంకృత అపరాధం కూడా మరణాల సంఖ్య పెరగటానికి కారణమా అనే కీలక ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన పరిస్థితి ప్రపంచం ముందు ఉంది. నిజమే... వరదలు, భూకంపం వంటి ప్రకృతి విపత్తులను అడ్డుకునే లేక ఆపగలిగే శక్తి మనిషికి లేదు. కానీ ప్రకృతి నుండి మనిషి నేర్చుకున్న పాఠాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సహకారంతో కచ్చితంగా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. దీనికి భూకంప ప్రమాదం అంచున వేలాడుతుండే జపాన్, చిలీ వంటి దేశాలే ఒక ఉదాహరణ. జపాన్‌లో తరచూ భూకంపాలు వస్తూనే ఉంటాయి. అది కూడా రిక్టర్ స్కేల్ పై 7.8 తీవ్రత, ఆ పైన వచ్చేవి ఎక్కువగా ఉంటాయి. కానీ ఆస్తి, ప్రాణ నష్టం కనీసంగా ఉండే విధంగా ఇక్కడ వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారు. ఎంత తీవ్ర ప్రకంపనాలు వచ్చినా ఒక్కరు కూడా చనిపోకపోవటం, అరుదుగా ఒకరిద్దరు చనిపోయిన రికార్డులే జపాన్‌లో ఉన్నాయి. జపాన్ చరిత్రలో ఒకే ఒక మినహాయింపు 2011లో వచ్చిన భూకంపం. 18 వేల మంది చనిపోయారు. అప్పుడు వచ్చిన శక్తిమంతమైన భూకంపం వల్ల సునామి రూపంలో సముద్రం విరుచుకుపడింది. దీనికి తోడు ఫుకుషిమా న్యూక్లియర్ పేలి మరింత విధ్వంసానికి దారి తీసింది. అందుకే ఆ స్థాయిలో మరణాలు నమోదు అయ్యాయి. జపాన్ కట్టడాల నిర్మాణంలో అమలు చేసే కఠిన నిబంధనల వల్ల... ప్రాణ నష్టాన్ని నివారించ గలుగుతోంది.



దక్షిణ అమెరికా దేశం చిలీ మరొక ఉదాహరణ. ఈ దేశం కూడా భూకంపాల పరంగా హై రిస్క్ జోన్‌లో ఉంది. అయినా మరణాలు నామమాత్రం. 2010లో రిక్టర్ స్కేల్‌పై 8.8 శాతం తీవ్రతతో భూ ఫలకాలు కంపిస్తే మరణాలు ఐదు వందలు మాత్రమే అంటే ఏ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారో అర్థం అవుతుంది. ఈ మార్పు వెనుక చిలీ దేశానికి ఒక చేదు అనుభవం ఉంది. 1960లో... శతాబ్దిలోనే అత్యంత తీవ్ర భూకంపం రిక్టర్ స్కేల్ పై 9.5 మ్యాగ్నిట్యూడ్‌తో వచ్చింది. అప్పుడు 1,600 మంది చనిపోయారు. ఆ తర్వాత చిలీ భవన నిర్మాణ నిబంధనల్లో సమూల మార్పులు చేసింది. జపాన్, చిలీ దేశాలు రెండూ పకడ్బందీ నిబంధనలు రూపొందించటమే కాదు కఠినంగా అమలు కూడా చేస్తున్నాయి.

టర్కీలో దీనికి విరుద్ధమైన వాతావరణం ఉంది. ఈ దేశం కూడా ప్రపంచంలోని భూకంప టాప్ టెన్ హాట్ స్పాట్‌లలో ఒకటి. ప్రస్తుత అధ్యక్షుడు ఎర్డొగన్ భూకంపాలను తట్టుకునే విధంగా కఠిన భవన నిర్మాణ నిబంధనలు ప్రవేశ పెట్టారు. కానీ క్షేత్ర స్థాయిలో అధికార యంత్రాంగంలో అవినీతి, నిర్లక్ష్యం, నిర్లిప్తత పేరుకుపోయాయి. రియల్ ఎస్టేట్ బూమ్ కోసం అడ్డగోలుగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. అది చాలదన్నట్లు 2018లో 'అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ' అనే పథకాన్ని అమలు చేశారు. పేక మేడల్లాంటి బహుళ అంతస్తుల భవనాలు ఇప్పుడు నిట్టనిలువునా కూలిపోయాయి. టర్కీ ప్రభుత్వ వర్గాల అంచనా ప్రకారం భూకంప తాకిడికి దాదాపు 50 వేలకు పైగా ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భారీ భవనాల శిథిలాల కింద నలిగి పోవటం వల్ల మరణాల సంఖ్య 50 వేల వరకు చేరుతోంది. అందుకే టర్కీ, సిరియాలో వచ్చిన భూకంపం ప్రపంచానికి ఇప్పుడు ఓ గుణపాఠం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

# లేని ఆదాయం ఉన్నట్టు చూపడమా?


విశ్లేషణ



సారంపల్లి మల్లారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం 2014 నుండి ఏటా బడ్జెట్‌ల పెంపుదలను చూపిస్తున్నది. పెంపుదల చేసినా ఆదాయాలు రావని తెలిసి కూడా పెంపుదల చూపించడం విశేషం. తీరా ఆదాయాలు తగ్గడంతో కేటాయించిన శాఖల బడ్జెట్‌లలో కోతలు పెడుతున్నారు. ముఖ్యంగా దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ, మహిళా – శిశుసంక్షేమం, వికలాంగ, వ్యవసాయ, ఆరోగ్య తదితరవర్గాలకు, శాఖలకు వ్యయంలో పెద్దఎత్తున కోతలు పెట్టడానికి కారణమిదే అని చెప్పాలి. బడ్జెట్ ఆదాయాలలో 2 ప్రధాన అంశాలు ఉంటాయి. అవి రెవిన్యూ ఆదాయం, క్యాపిటల్ ఆదాయం. రాష్ట్ర పన్నులు, కేంద్రం నుండి వచ్చే పన్నుల్లో వాటా, పన్నేతర ఆదాయం (నాన్‌టాక్స్ రెవిన్యూ), గ్రాంట్‌లు (కేంద్రం నుండి వచ్చేవి) అని 4 విధాలుగా రెవిన్యూ రాబడి ఉంటుంది. రెవిన్యూ ఆదాయం దాదాపుగా 95 శాతం నికరంగా రావాలి.

సిబ్బంది వేతనాలు, ప్రభుత్వ నిర్వహణ ఖర్చులు, తప్పనిసరిగా ఇచ్చే రాయితీలు (ఆహార తదితర) రెవిన్యూ వ్యయం కిందకు వస్తాయి. రెవిన్యూ ఆదాయం ఎక్కువగా ఉండి, వ్యయం తక్కువగా ఉన్నపుడు రెవిన్యూ మిగులు ఉంటుంది. అలాంటి రాష్ట్రం ధనిక రాష్ట్ర జాబితాలో చేరుతుంది. రెవిన్యూ వ్యయం పెరిగిన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక కమిషన్ల ద్వారా ఆ లోటును భర్తీ చేయడం కోసం యాభై శాతం రాయితీ ఇస్తుంది. కాని తెలంగాణ మిగులు బడ్జెట్ చూపుతుండటంతో ఆలాంటి రాయితీలు లేవు. రెవిన్యూ ఆదాయాన్ని పెంచి చూపి మిగులు బడ్జెట్‌గా ప్రకటించు కొన్నా వార్షికాంతాన రెవిన్యూ ఆదాయం తగ్గడంతో ఆనేక సంవత్సరాలలో లోటు ఏర్పడింది.



2020-21లో రూ. 22,298 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడినట్లు ప్రభుత్వ బడ్జెట్ నివేదికలు తెలుపుతున్నాయి. 2019 నుండి 2022 వరకు రెవిన్యూ బడ్జెట్ లోటులోనే కొనసాగింది. 2014 నుండి మొదటి 3 సంవత్సరాలు 3 అంకెల మిగులును మాత్రమే చూపాయి. మిగులు వచ్చిన సంవత్సరాలలో కూడా బడ్జెట్‌ను పెంచి చూపడానికి నాన్ టాక్స్ రెవిన్యూ, గ్రాంట్‌లను ఊహకందని విధంగా పెంచి చూపడం వలన ఈమాత్రం మిగులు ఏర్పడింది. నాన్ టాక్స్ రెవిన్యూ అంటే గనులు, వడ్డీ రాబడి, పోలీస్, జైళ్ళశాఖ, విద్య, వ్యవసాయ, ఇరిగేషన్, హౌజింగ్, రోడ్స్ తదితర శాఖల ద్వారా వచ్చే ఆదాయం. ఇందులో మిస్‌లేనియస్ జనరల్ సర్వీస్ కింద రాని ఆదాయం చూపడం వలన ఈ పద్దు బాగా పెరుగుతుంది. వాస్తవానికి నాన్‌టాక్స్ రెవిన్యూ ఏనాడూ 10, 12 వేల కోట్లు మించదు. అయినప్పటికీ ప్రభుత్వం పెద్దఎత్తున్న మిస్‌లేనియస్ జనరల్ పద్దుల కింద నిధులు పెంచింది. అదే విధంగా గ్రాంట్స్ (కేంద్రం నుండి వచ్చే సహాయం, ఇతర దేశాల నుండి వచ్చే సహాయం, అంతరంగిక వడ్డీ) చేరి ఉంటాయి. వీటిని కూడా కేంద్రం.. రాష్ట్రాలకు బడ్జెట్‌లో కేటాయింపులుగా చూపుతుంది. కేంద్ర బడ్జెట్ తరువాతనే రాష్ట్రాలు బడ్జెట్‌ను ప్రవేశపెడతాయి. తమ రాష్ట్రానికి గ్రాంట్‌లుగా కేటాయించిన నిధులను మాత్రమే రాష్ట్రాల బడ్జెట్‌లో చూపాలి. ఎక్కువ పద్దు చూపితే ఆదాయం రాక అంచనాలు తలకిందులౌతాయి.

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను తయారు చేస్తున్నపుడు మిగులుగా చూపడానికి రాని ఆదాయాన్ని వస్తున్నట్లు చూపుతున్నారు. అందువలన ఆర్థిక క్రమశిక్షణ లోపించి శాఖలకు కేటాయించిన బడ్జెట్ నిధులు అందడంలేదు. మరొక అంశం క్యాపిటల్ బడ్జెట్ (రుణ బడ్జెట్)ను పెంచి చూపడానికి వీలు కాదు. ఎఫ్ఆర్‌బీఎం ప్రకారం మాత్రమే అప్పు తేవాలి. వాస్తవానికి జీఎస్‌డీపీకి 3.5 శాతం రుణ అర్హత ఉండగా తెలంగాణ 4 శాతానికి పెంచుకోవడం జరిగింది. దీనిని 4.5 శాతానికి పెంచాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. తెలంగాణ ప్రభుత్వం కార్పొరేషన్ల పేరుతో బడ్జెటేతర రుణాలు తెస్తున్నది. అందువలన బడ్జెట్‌లో చూపిన రుణం కన్నా రాష్ట్ర రుణం ఎక్కు వగా ఉంటుంది.

ఫిబ్రవరి 10న పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటన ప్రకారం 2021–22 నాటికి రూ. 2,83,452 కోట్లు బడ్జెట్ రుణం కాగా, కార్పొరేషన్ రుణంతో కలిపి రూ. 5.29 లక్షల కోట్ల రుణం ఉన్నట్లు ప్రకటించారు. అందువలన రాష్ట్ర రుణానికి వడ్డీ చెల్లింపుల కింద ప్రస్తుతం 11 వేల కోట్లు, అసలు చెల్లింపులకు కలుపుతున్నాం. 12 జాతీయ బ్యాంకులు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (నాబార్డు) నుండి రుణాలు తెస్తున్నారు. ఈ రుణాల చెల్లింపు గడువు కూడ అప్పుడే ప్రారంభమైంది. మధ్యలో ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టులకు, ఇతర శాఖల ప్రాజెక్టులకు నిధులు అవసరం. అప్పులు తేవడానికి గల రుణ అర్హత పూర్తయింది. పారిశ్రామిక రంగం ద్వారా ఆదాయాన్ని సంపాదించాలి. ప్రస్తుతం వ్యవసాయ రంగం, సేవా రంగం నుండి మాత్రమే ఆదాయం వస్తోంది. బడ్జెట్ రూపకల్పనలో ఆర్థిక వేత్తల సలహాలను పాటించి ఉత్పత్తి రంగంపై ఎక్కువ పెట్టుబడులు పెట్టడం వలన ఆదాయం పెరుగుతుంది. అనుత్పాదక రంగంలో సంక్షేమ పథకాలు మినహా మిగిలిన వాటికి నిధుల కేటాయింపులు తగ్గించడం ద్వారా బడ్జెట్‌ను కోతలు లేకుండా నిర్వహించవచ్చు. అందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త వ్యవసాయ, ఆర్థిక రంగాల నిపుణులు I 94900 98666

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.విదియ ఉ.9.24 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.10.04 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.7.14 నుండి 8.46 వరకు, దుర్ముహూర్తం: ప.11.50 నుండి 12.36 వరకు, అమృతఘడియలు: తె.4.26 నుండి 5.58 వరకు (తెల్లవారితే గురువారం); రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.28, సూర్యాస్తమయం: 6.00.


కిరణ్(ఫైల్) నాయక్(ఫైల్)

# కంచె.. ప్రాణాలు తీసింది

- కరెంటు షాక్ తగిలి కొడుకు.. కాపాడబోయి తండ్రి మృతి
- కళ్ల ముందే భర్త, కొడుకు మృతితో తల్లడిల్లిన మహిళ

చిన్నగూడూరు: కోతులు, అడవి పందుల నుంచి పంటకు రక్షణగా పెట్టిన విద్యుత్ వైర్ల కంచె తండ్రీకొడుకుల ప్రాణం తీసింది. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం దుమ్లాతండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన ఆంగోత్ సీవీనాయక్(60), అమ్మీ దంపతుల కుమారుడు కిరణ్(30) మొక్క జొన్న పంట వేశారు. పంట కంకి పోయడంతో కోతులు, అడవి పందులు వచ్చి పంటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో చేను చుట్టూ విద్యుత్ వైర్ అమర్చారు. సాయంత్రం విద్యుత్ ఆన్‌చేసి, ఉదయాన్నే తీసివేసేవారు. కానీ మంగళవారం ఆఫ్ చేయడం మర్చిపోయారు. పంటకు నీరు కడుతుండగా కిరణ్ కాలుజారి విద్యుత్ సరఫరా అవుతున్న వైర్లకు తగిలి షాక్‌కు గురయ్యాడు. పక్కనే ఉన్న తండ్రి నాయక్ కుమారుడిని కాపాడేందుకు పట్టుకున్నాడు. గమనించిన తల్లి అమ్మీ కేకలకు పక్కనే ఉన్న రైతులు వచ్చి వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కానీ అప్పటికే ఇద్దరూ మరణించారు. కళ్లముందే భర్త, కొడుకు షాక్‌తో విలవిల్లాడుతూ మరణించడంతో గుండలవిసేలా రోదించింది. చిన్నగూడూరు ఎస్సై రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బీరు బాటిల్ బాంబ్!



| కొత్త తరహా దాడులకు మావోయిస్టుల వ్యూహరచన | భద్రతా దళాలను ఏమార్చేలా బాంబులు | సీసాలో ఐఈడీతోపాటు రాగి రేకు ముక్కలు, ప్లాస్టిక్ లెడ్, కార్బన్ ముక్కలు |
|---|---|---|

**గాజు ముక్కలతో పెను విధ్వంసం సృష్టించేలా రూపకల్పన**

రోడ్డుపై, అడవుల్లో ఖాళీ బీరు బాటిళ్లను చూస్తే ఇక అనుమానించాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఎందుకంటే మావోయిస్టులు కొత్త తరహాలో బీర్ బాటిల్ బాంబును అమర్చి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తమ వద్ద ఉందని చెప్పకనే చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా ఉన్న మావోయిస్టులు తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం(కె), భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో తమ కదలికలు ఉన్నాయని చెప్పేందుకు శాయశక్తులా ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ఇంటెలిజెన్స్, పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉండటంతో మావోయిస్టుల దుశ్చర్యలను గట్టిగా తిప్పికొడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ఏటూరునాగారం: ప్రెషర్ బాంబ్‌లు, కెమెరా ఫ్లాష్ బాంబ్‌లు, బ్యాటరీలు ఇలా అనేక రకాల మందుపాతరలు అమర్చిన మావోయిస్టులు రూటు మార్చారు. కూంబింగ్‌లో పాల్గొనే భద్రతా దళాలు, పోలీసులను ఏమారుస్తూ పేలుడు జరిపి భారీ విధ్వంసం సృష్టించేలా బీరు బాటిల్ బాంబ్ వ్యూహాన్ని అమల్లో పెడుతున్నారు. ప్రెషర్, బకెట్ బాంబులను భద్రతా దళాలు సులువుగా గుర్తిస్తుండటంతో తమ వ్యూహం మారుస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో పేలుడు తీవ్రత పెంచేందుకు మావోయిస్టులు పదునైన ఇనుప ముక్కలను పేలుడు పదార్థాల చుట్టూ ఉంచేవారు. అయితే మెటల్ డిటెక్టర్లు ఉపయోగించినప్పుడు, ఆ బాంబు జాడను భద్రతా దళాలు సులువుగా పసిగడుతున్నట్లు మావోయిస్టులు అనుమానిస్తున్నారు. దీంతో బీరు బాటిల్ బాంబు వ్యూహానికి పదును పెట్టినట్టు తెలుస్తోంది.

### ఖాళీ బాటిళ్లలో ఐఈడీ

మావోయిస్టులు ఖాళీ బీరు బాటిళ్లలో ఐఈడీ తరహా పేలుడు పదార్థాలను కూర్చి విధ్వంసం సృష్టించే వ్యూహం అమలుకు శ్రీకారం చుట్టారు. తాగి పడేసిన బీరు బాటిల్ అయితే భద్రతా దళాలు అనుమానించకుండా వదిలేస్తాయని, పైగా అందులో అమర్చిన బాంబు పేలినప్పుడు గాజు ముక్కల కారణంగా ప్రమాద తీవ్రత పెరుగుతుందనే అంచనాతో ఈ ప్లాన్ అమలు చేసినట్టు తెలుస్తోంది. గతంలో ఈ తరహా బాంబులను ఒడిశాలో పేల్చి నట్టు సమాచారం. తాజాగా బీరు బాటిల్లో అమర్చిన బాంబును ములుగు జిల్లాలో పోలీసులు గుర్తించారు.


పోలీసులు బయటకు తీసిన బీర్‌బాటిల్ , పేలుడు పదార్థాలు

గతంలో ఏటూరునాగారం ఏజెన్సీ అప్పటి పీపుల్స్‌వార్ నక్సల్స్‌కు ప్రయోగశాలగా ఉండేది. ఇప్పుడు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, వాజేడు, వెంకటాపురం(కె) ప్రాంతాలను అనువైనవి గుర్తించి తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త

### కొత్త కోణంలో బాంబు...

తరహా దాడులకు వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం మావోయిస్టులు ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం పామునూరు అటవీ ప్రాంతంలో మందుపాతర అమర్చినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వాటిని వెతుక్కుంటూ వెళ్లిన భద్రత బలగాలకు విద్యుత్ వైర్లు కనిపించాయి. వాటిని చూసుకుంటూ ముందుకెళ్లగా ఖాళీ బీరు బాటిల్ కనిపించింది. ఆ వైర్లు ఆ సీసాలోకి పోయినట్లు గుర్తించిన పోలీసులు బాంబ్ స్క్వాడ్‌ను పిలిపించి నిర్వీర్యం చేశారు. ఐఈడీ నింపిన సీసాలో భద్రత బలగాలకు గుచ్చుకునేలా ఇనుప బోల్ట్‌లు, రాగి రేకు ముక్కలు, ప్లాస్టిక్ లెడ్, కార్బన్ ముక్కలు, గన్ పౌడర్ ఇతర పేలుడు పదార్థాలను అందులో కూర్చి పెట్టారు. అది పేలితే పెద్ద ప్రమాదం ఉండేదని పోలీసులు చెబుతున్నారు.

→ ఈనెల 4న చర్ల మండలం కుర్నపల్లి మార్గంలో ఎర్రబోరు-బోదనెల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై అమర్చిన శక్తిమంతమైన 20 కిలోల మందుపాతరను చర్ల పోలీసులు నిర్వీర్యం చేశారు.

→ గత నెల 28న చర్ల మండలంలోని కొండెవాయి సమీపంలోని ప్రధాన రహదారిపై శక్తిమంతమైన మందుపాతరను పోలీసులు నిర్వీర్యం చేశారు.

**మందుపాతరలు, ప్రెషర్‌బాంబుల ఘటనలు**

→ గత నెల 26న కొండెవాయి అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలను మట్టుబెట్టేందుకు అమర్చిన ప్రెషర్ బాంబును పోలీసులు నిర్వీర్యం చేశారు.

→ గత నెల14న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పెగడపల్లి వద్ద అమర్చిన మందుపాతరను పేల్చడంతో ఏఎస్‌ఐ మహ్మద్ అస్లాం తీవ్రంగా గాయపడ్డాడు.

→ 2022 డిసెంబర్‌లో ఉంజుపల్లి సమీపంలో పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకొని పెట్టిన ప్రెషర్‌బాంబు పేలి ఆవు మృతిచెందింది.

→ 2021 జూలైలో చర్ల శివారు లెనిన్‌కాలనీ సమీపంలో చర్ల యువకుడు ప్రమాదవశాత్తు ప్రెషర్ బాంబును తొక్కడంతో అది పేలింది.

# తప్పైంది.. నన్ను క్షమించండి

**జాతీయ మహిళా కమిషన్‌కు ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి క్షమాపణలు**



సాక్షి, న్యూఢిల్లీ: 'తప్పైంది.. నన్ను క్షమించండి' అని జాతీయ మహిళా కమిషన్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌పై చేసిన వ్యాఖ్యలపై నోటీసులు అందుకున్న కౌశిక్‌రెడ్డి.. మంగళవారం ఢిల్లీలోని జాతీయ మహిళా కమిషన్ ముందు వ్యక్తిగతంగా హాజరయ్యారు. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ సుమారు 40 నిమిషాల పాటు ఆయన్ను గతంలో చేసిన వ్యాఖ్యలపై విచారించారు. ఈ సందర్భంగా కమిషన్‌కు కౌశిక్‌రెడ్డి వివరణ ఇచ్చుకున్నారు. అంతేగాక ఈ అంశంలో కమిషన్‌కు క్షమాపణలు చెప్పారని.. త్వరలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు లిఖితపూర్వక క్షమాపణ చెప్తానని కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు జాతీయ మహిళా కమిషన్ ట్వీట్ చేసింది.

## సజావుగా ఇంటర్ పరీక్షలు: సబిత

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 15 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను విద్యా శాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. పరీక్షలపై ఆమె మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఈ వివరాలను మంత్రి కార్యాలయం మీడియాకు వెల్లడించింది. పరీక్షల కోసం 1,473 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.



## 'కేసీ'కి కృష్ణా జలాల తరలింపుపై తెలంగాణ అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా ట్రిబ్యునల్-1, 2లు జరిపిన కేటాయింపులకు మించిన కృష్ణా జలాలను ఏపీ వాడుకుందని తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. కేసీ కాల్వతోపాటు తుంగభద్ర కుడిగట్టు ఎగువ/దిగువ కాల్వలకు తుంగభద్ర జలాశయం నుంచి మాత్రమే నీళ్లను విడుదల చేయాలని కృష్ణా ట్రిబ్యునల్-1 అవార్డు పేర్కొంటుండగా, కేసీ కాల్వకు ఏపీ కృష్ణా జలాలను వాడుకుంటోందని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ మురళీధర్ ఈనెల 9న తుంగభద్ర బోర్డు కార్యదర్శికి లేఖరాశారు. తుంగభద్ర ఎగువ కాల్వ(హెచ్ఎల్సీ) కోటాలో 81.5% జలాలను కృష్ణా బేసిన్ వెలుపలి ఉన్న పెన్నా బేసిన్‌కు తరలించారని, ఇది కృష్ణా ట్రిబ్యునల్-1 తీర్పుకు విరుద్ధమన్నారు. ట్రిబ్యునల్ నిర్ణయా లను ఉల్లంఘిస్తూ కేసీ కాల్వకు శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను తరలించి, తుంగభద్ర జలాల్లో ఆ కాల్వ వాటాలను తుంగభద్ర ఎగువ కాల్వకు ఏపీ తరలించుకుంటోందని ఆరోపించారు. కోటాలను తారుమారు చేయడం ట్రిబ్యునల్ తీర్పులకు విరుద్ధమని ఆ రెండు బోర్డులకు లేఖలు రాసినా.. ఫలితం లేదని పేర్కొన్నారు. తుంగభద్ర దిగువకాల్వ కోటాను ఎగువ కాల్వకు తరలించేందుకు ప్రతిపాదించి ఏపీ మరో ఉల్లంఘనకు యత్నిస్తోందని ఆరోపించారు. తుంగభద్ర నుంచి పూర్తిస్థాయి కోటాను దిగువ కాల్వ వాడుకుంటూనే గురురాఘవేంద్ర ఎత్తిపోతల ద్వారా అదనపు నీళ్లను తరలించి అనధికార ఆయకట్టుకు సరఫరా చేస్తోందని తెలిపారు. దీంతో ఆర్డీఎస్, శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల్లో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్నారు.

# బోరు నీరు తాగి.. బాలిక మృతి

**మరో 8 మందికి తీవ్ర అస్వస్థత.. నారాయణపేట జిల్లాలో ఘటన**


అనిత (ఫైల్)

మద్దూరు: బోరు మోటారు ద్వారా వచ్చే నీరు తాగి ఓ బాలిక మృతిచెందగా...మరో 8 మంది అస్వస్థతకు గురయ్యారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని మోమినాపూర్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రాకపోవడంతో బోయిన, జీడివీధిలో ఉన్న బోరు మోటారు నీటిని స్థానికులు తాగుతున్నారు. ఈ క్రమంలో సోమవారం బోరు మోటారు ద్వారా వచ్చే నీటిని తాగిన బోయిన అనిత(16)కు సాయంత్రం విరేచనాలు కావడంతో ఆశ కార్యకర్త దగ్గరకు వెళ్లగా ఓఆర్ఎస్ ప్యాకెట్ ఇచ్చింది. రాత్రికి వాంతులు, విరేచనాలు తీవ్రమై అస్వస్థతకు గురవడంతో తండ్రి బోయిని కనకప్ప వెంటనే ద్విచక్రవాహనంపై నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. ఆ తర్వాత ఇదే వీధికి చెందిన వార్ల చంద్రప్ప, బండగొండ కనకప్ప, మంగమ్మ అస్వస్థతకు గురవడంతో మద్దూరు సీఎస్సీ సెంటర్‌కు, బసపోళ్ల శ్రీనివాస్, బసపోళ్ల రాములు, బోయిని కవితలు కూడా అస్వస్థతకు గురికాగా వారిని మహబూబ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి, బసపోళ్ల హన్మమ్మ, అజయ్‌లను నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతి రెడ్డి, డీఎంహెచ్ఓ రాంమోహన్‌రావు గ్రామానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

# ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం

**ఇథనాల్ ఫ్యాక్టరీని కేసీఆర్ ఫాంహౌస్‌లో పెట్టుకోండి.. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం**


బహిరంగ సభలో మాట్లాడుతున్న కోదండరాం

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం గాలికొదిలేసి.. తమకొచ్చే లాభాలు, కమీషన్లపైనే దృష్టిపెడుతూ.. ప్రమాదకరమైన ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తోందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం ధ్వజమెత్తారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కెమికల్ ఫ్యాక్టరీని ఎత్తివేయాలని కోరుతూ చేపట్టిన పాదయాత్ర మంగళవారం వనపర్తి జిల్లా ఆత్మకూర్‌కు చేరింది. టీజేఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా, పాలమూరు అధ్యయన వేదిక, ఎమ్మార్పీఎస్, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 11 రోజుల అనంతరం ఆత్మకూర్‌లో ముగియడంతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాంతోపాటు ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు కృష్ణానదికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే ప్రమాదకర రసాయనాలు ఊకచెట్టు వాగులో కలిసి ఉమ్మడి పాలమూరుకు తాగునీటిని అందిస్తున్న రామన్‌పాడ్ జలాశయం కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇథనాల్ కంపెనీని సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌లో పెట్టుకోవాలని సూచించారు.

## మరణ ధ్రువపత్రం ఇచ్చేందుకు లంచం

**ఏసీబీకి చిక్కిన ఏఎస్‌వో**

భూపాలపల్లి అర్బన్: మరణ ధ్రువపత్రం ఇచ్చేందుకు రూ.2వేల లంచం తీసుకుంటూ ఒక అధికారి ఏసీబీకి పట్టుబడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై ఏసీబీ వరంగల్ రేంజ్ ఇన్‌చార్జి డీఎస్పీ కె.సుదర్శన్ తెలిపిన వివరాలివి. రేగొండ మండల కేంద్రానికి చెందిన వల్లకొండ మల్లికార్జున్ తన అత్త ఓడెటి కాంతమ్మ మరణ ధ్రువపత్రం కోసం డిసెంబర్ 5వ తేదీన మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాల యంలోని ఏఎస్‌వో రఘుపతికి సంబంధిత పత్రాలను అప్పగించాడు. పత్రం ఇవ్వాలంటే రూ.3వేల లంచం ఇవ్వాలని రఘుపతి డిమాండ్ చేయగా.. మల్లికార్జున్ రూ.2వేలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ముందే ఏసీబీకి సమాచారం ఇచ్చిన మల్లికార్జున్.. మంగళవారం కలెక్టరేట్ సమీపంలో రఘుపతికి డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## మెట్లచిట్టాపూర్‌లో సాంఘిక బహిష్కరణ

**అధికారులకు బాధితుల ఫిర్యాదు**

మెట్‌పల్లి (కోరుట్ల): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో గుడేటి కాపు, మున్నూరు కాపు కులస్తులకు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సాంఘిక బహిష్కరణ శిక్ష విధించారు. దీంతో తమకు న్యాయం చేయా లని కోరుతూ బాధితులు మంగళవారం పోలీ సులు, ఆర్డీవో కార్యాలయ అధికారులను వేడుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో వీడీసీ వ్యవహారాన్ని తప్పుబట్టడంతో తమపై కక్షకట్టి సాంఘిక బహిష్కరణ విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వ్యాపారులు, కూలీలు, పశువుల కాపరులు ఎవరూ సహక రించడం లేదని వాపోయారు. అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# వీధికుక్కల వీరంగం

▶ మొదటి పేజీ తరువాయి

ఏకంగా మూడురెట్లకు పైగా కుక్కకాట్లు జరిగాయి. దేశంలో కుక్కకాట్లలో తెలంగాణ 8వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో 2019లో 1.67 లక్షల కాట్లు, 2020లో 66,782 కేసులు నమోదయ్యాయి.

**హైదరాబాద్‌లో సమస్య తీవ్రం**

హైదరాబాద్‌లోని ఐపీఎంకు కుక్క కాట్లకు గురై చికిత్స కోసం వస్తున్నవారు నెలకు 2,000- 2,500కు పైగా ఉంటుండగా, నిజామాబాద్, కరీంనగర్ వంటి నగరాల్లో నెలకు 400 వరకు కుక్కకాటు కేసులు నమోదు కావడం.. వాటి బెడద ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తోంది. ఇక హైదరాబాద్‌తో పాటు జీహెచ్ఎంసీని ఆనుకొని ఉన్న జవహర్‌నగర్, బడంగ్‌పేట, బండ్లగూడ, మీర్‌పేట, జిల్లెలగూడ, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేటల్లో వీటి సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. జవహర్‌నగర్‌లో డంపింగ్ స్టేషన్ కుక్కలకు ప్రత్యేక ఆవాస కేంద్రంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్లలో వెటర్నరీ విభాగాలున్నా, అవి నామమాత్రంగా కొనసాగుతున్నాయి. వీధి కుక్కలు పెరిగిపోవడానికి, నగరాల్లో ఏటా వేల సంఖ్యలో కుక్కకాటు కేసులు నమోదవడానికి ఆయా కార్పొరేషన్లు, మునిసిపాలిటీలలో అధికార యంత్రాంగాల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, రామగుండం, ఖమ్మం కార్పొరేషన్లలో వీధికుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు తక్కువేనన్న విమర్శలున్నాయి.

**ఒక కుక్క, దాని పిల్లలు..పిల్లల పిల్లలు!**

ఒక కుక్క దాని పిల్లలు కలిపి ఏడాది కాలంలో దాదాపు 42 కుక్క పిల్లలను పెడతాయి. వాటి పిల్లలు.. పిల్లల పిల్లలు ఇలా మొత్తం ఏడేళ్ల కాలంలో దాదాపు 4 వేల కుక్కలు పుడతాయని అంచనా. ఇలా కుక్కల సంతతి అభివృద్ధి చెందుతున్నా వాటిని తగ్గించే కార్యక్రమాలు అంత చురుగ్గా సాగడం లేదు.

**స్టెరిలైజేషన్‌తోనే నియంత్రణ..**

వీధి కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం. అంటే కుక్కల పునరుత్పత్తి ప్రక్రియను నియంత్రించేలా శస్త్రచికిత్సలు చేయడం. మొత్తం కుక్కల్లో ఆడకుక్కలన్నింటికీ ఒకేసారి సంతాన నిరోధక శస్త్రచికిత్సలు జరిగితేనే కుక్కల సంతతి తగ్గుతుంది. ఏటా వేలాది కుక్కలకు శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు ఆయా కార్పొరేషన్ల వెటర్నరీ విభాగాల అధికారులు చెపుతున్న మాటలన్నీ డొల్ల మాటలేనని కుక్కల సంఖ్య పెరిగిపోతున్న తీరు స్పష్టం చేస్తోంది. ఒక్క వరంగల్ కార్పొరేషన్‌లోనే సుమారు 60 వేలకు పైగా వీధికుక్కలు ఉన్నట్లు అధికారులు లెక్కలేశారు. ఇక్కడ కుక్కల సంతాన నియంత్రణ కోసం ఓ ప్రైవేటు ఎన్‌జీవోకు శస్త్ర చికిత్సల బాధ్యత అప్పగించారు. కరీంనగర్, రామగుండంలలో కార్పొరేషన్ అధికారులే కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ చేపట్టినా, అవి ఎంతోకాలం సాగలేదు. కరీంనగర్‌లో స్టెరిలైజేషన్ పేరుతో కుక్కలను చంపుతున్నట్లు ఓ స్వచ్ఛంద సంస్థ పేర్కొనడంతో ఆ కార్యక్రమాన్ని నిలిపివేశారు. కరీంనగర్, నిజామాబాద్ నగరాల్లో ప్రతి నెల 400 వరకు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. ఖమ్మంలో 2021లో కుక్కల స్టెరిలైజేషన్ కార్యక్రమం ప్రారంభించిన కార్పొరేషన్ అధికారులు తర్వాత ఆ కార్యక్రమాన్ని నిలిపివేశారు.

**29,789 కుక్కలకు స్టెరిలైజేషన్**

రాష్ట్ర వ్యాప్తంగా వీధికుక్కల సంతతిని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పురపాలక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జీహెచ్ఎంసీ మినహా అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా జంతు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు 20 జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన జంతు సంరక్షణ కేంద్రాల్లో 29,789 కుక్కలకు సంతతి నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపింది. నగరాలు, మునిసిపాలిటీలలో ప్రజలకు ఇబ్బందిగా మారిన కుక్కలతో పాటు కోతులను కూడా ఈ సంరక్షణ కేంద్రాలకు తరలించి స్టెరిలైజేషన్ చేస్తున్నట్లు తెలిపింది. గ్రేటర్ నగరంలో 2022 జనవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 20 మధ్యకాలంలో 5,70,729 కుక్కలుండగా 4,01,089 కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేసినట్లు హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి చెప్పారు.

**ఆడకుక్కలన్నిటికీ ఆపరేషన్లు చేయాలి**

హైదరాబాద్‌లో కుక్కల సంఖ్య తగ్గించేందుకు ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కార్యక్రమాలు నిబంధనల కనుగుణంగా జరగడం లేదని జంతు ప్రేమికురాలు, సంబంధిత అంశాలపై అవగాహన ఉన్న డాక్టర్ శశికళ తెలిపారు. జైపూర్, గోవాల్లో ఈ కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయని చెప్పారు. ఆడ కుక్కలన్నింటికీ ఆపరేషన్లు చేయడంతో పాటు మగవాటికి సంతానోత్పత్తి వయసు వచ్చే సమయంలోనే (8-12 నెలల మధ్య) సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేస్తున్నారన్నారు. వీటితో పాటు 'మిషన్ ర్యాబిస్'పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తారని, కుక్కల బారిన పడకుండా ఎలా వ్యవహరించాలి వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు.



**అసలేం జరిగింది..**

హైదరాబాద్‌లో తండ్రితో కలిసి అతను పనిచేసే చోటుకు వెళ్లిన బాలుడు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి మరణించడం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయికి చెందిన గంగాధర్ జీవనోపాధి కోసం నగరానికి వచ్చి భార్యాపిల్లలతో కలిసి బాగ్‌అంబర్‌పేటలో నివాసముంటున్నాడు. ఛే నంబర్‌లోని కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న తన కుమారుడు ప్రదీప్ (4), కుమార్తెతో కలిసి కారు సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లాడు. పిల్లల్ని ఆడుకొమ్మనిచెప్పి విధుల్లో నిమగ్నమయ్యాడు. ప్రదీప్ అక్కడ ఆటవిడుపుగా ఒంటరిగా తిరుగుతున్న సమయంలో కుక్కల గుంపు ఒకటి ఆకస్మాత్తుగా దాడి చేసింది. బాలుని అక్క గమనించి కేకలు వేయడంతో గంగాధర్‌తో పాటు ఇతర సెక్యూరిటీ గార్డులు వచ్చి కుక్కలను తరిమికొట్టారు. అప్పటికే తీవ్రంగా గాయపడ్డ ప్రదీప్‌ను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందినట్లు చెప్పారు.

**ఈ ఘటనపై ఫిర్యాదుచేయాలని తల్లిదండ్రులను పోలీసులు కోరగా ఎవరి మీద ఫిర్యాదు చేయాలంటూ విలపించారు.**

**మాయమైన 'మాఇంటి నేస్తం' ..**

కుక్కల సంఖ్యను తగ్గించే చర్యల్లో భాగంగా ఐదేళ్ల క్రితం వీధికుక్కలను పెంచుకునే పథకం 'మా ఇంటి నేస్తం' ప్రారంభించారు. అప్పట్లో 3 వేల వీధికుక్కల్ని ఆసక్తి ఉన్న వారికి దత్తత ఇచ్చారు. కానీ ఆ తర్వాత ఆ పథకం కనుమరుగైంది. అది కొనసాగినా వీధికుక్కల సంఖ్య తగ్గి ఉండేదనే అభిప్రాయాలున్నాయి. హైదరాబాద్ నగరంలో కుక్కలను కట్టడి చేయాలని 8నెలల క్రితం హైకోర్టు ఆదేశించినప్పటికీ చర్యల్లేక పోవడం విచారకరం.

**హైదరాబాద్‌లో గతంలో...**

- 2016 ఫిబ్రవరి 12న కుషాయిగూడలో కుక్కలు దాడి చేయడంతో 8 ఏళ్ల బాలిక మృతి.
- 2020లో అమీర్‌పేటలో ఒకేరోజు 50 మంది కుక్కకాట్ల బారిన పడ్డారు.
- 2022 డిసెంబర్ 12న పీర్జాదిగూడలో చిన్నారికి తీవ్రగాయాలు.
- 2021 జనవరి 30న బహదూర్‌పురాలో 8 ఏళ్ల బాలుడు మృతి.
- 2017లో 14 మంది, 2018లో 9 మంది కుక్కకాట్ల వల్ల మరణించారు.

**పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం: కేటీఆర్**

అంబర్‌పేటలో కుక్కల దాడిలో బాలుడు మరణించడం బాధాకరమని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

### కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

సుజాతనగర్: కుక్కల దాడిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్, బేతంపూడి గ్రామాల్లో ఇద్దరు చిన్నారులు మంగళవారం గాయపడ్డారు. సుజాతనగర్‌లోని సుందరయ్యనగర్‌కు చెందిన నాలుగేళ్ల చిన్నారి ఫజీమా స్థానిక అంగన్‌వాడీ సెంటర్ నుంచి ఇంటికి వస్తుండగా.. ఒక్కసారిగా వచ్చిన కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఫజీమా చేతికి గాయాలు కాగా.. స్థానికులు కుక్కలను తరిమేశారు. బేతంపూడిలో ఇంటి వద్ద ఆడుకుంటున్న యశ్వంత్ అనే బాలుడిపై అకస్మాత్తుగా వచ్చిన వీధి కుక్కలు దాడి చేసి గొంతుపై కరిచాయి. కుక్కల నుంచి బాలుడిని విడిపించేందుకు వెళ్లిన గ్రామస్తుడు బానోత్ లాలుపై కూడా దాడి చేయగా స్థానికులు వాటిని తరిమేశారు.

## క్లుప్తంగా...

### జడ్జీల జీపీఎఫ్ ఖాతాలు క్లోజ్ చేస్తారా?: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** తమ జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) ఖాతాలను నిలిపివేశారని పేర్కొంటూ పాట్నా హైకోర్టు న్యాయమూర్తులు దాఖలు చేసిన విజ్ఞప్తి పట్ల సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. దీనిపై శుక్రవారం విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. ఏడుగురు జడ్జీల జీపీఎఫ్ ఖాతాలను క్లోజ్ చేశారని వారి తరఫు న్యాయవాది పేర్కొన్నారు. దీనిపై సాధ్యమైనంత త్వరగా విచారణ ప్రారంభించాలని కోరారు. న్యాయమూర్తుల జీపీఎఫ్ ఖాతాలను మూసేయడం ఏమిటని సీజేఐ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

### ఆ ఇద్దరు అధికారిణులను బదిలీ చేసిన కన్నడ సర్కారు

**బెంగళూరు:** సోషల్ మీడియాలో పరస్పరం బహిరంగ విమర్శలకు దిగిన కర్ణాటక హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ, ఐపీఎస్ రూప, హిందూ మత ధర్మాదాయ కమిషనర్, ఐఏఎస్ రోహిణి సింధూరిలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. వారికి పోస్టులు కేటాయించలేదు. రూపా భర్త, సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డుల విభాగం కమిషనర్ అయిన మునీశ్ మౌద్గిల్‌ను కూడా సిబ్బంది, పరిపాలన సంస్కరణల విభాగం ప్రిన్సిపల్ కార్యదర్శిగా బదిలీ చేసింది. రోహిణిపై పలు ఆరోపణలు చేస్తూ రూప ఇటీవల ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టడం, ఆమెపై పరువునష్టం చర్యలు తీసుకుంటానని రోహిణి పేర్కొనడం తెలిసిందే.

### సుప్రీంకోర్టు కార్యకలాపాలకు ఇక అక్షరరూపం

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో జరిగే కార్యకలాపాలు, వాదనలు, తీర్పులు ఎప్పటికప్పుడు అక్షరరూపంలోకి మారి, కక్షిదారులకు ప్రత్యక్షంగా కనిపిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది కదా! సుప్రీంకోర్టు ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని మంగళవారం ప్రారంభించింది. ఇందుకోసం కృత్రిమ మేధ(ఏఐ), నేచురల్ లాంగ్వేజీ ప్రాసెసింగ్ టెక్నాలజీని ఉపయోగించుకుంది. కోర్టులో పెద్ద తెర ఏర్పాటు చేశారు. వాదనలు, తీర్పులు ప్రత్యక్షంగా ఇందులో కనిపించాయి. అత్యున్నత న్యాయస్థానం ఇలాంటి ప్రయోగం చేయడం ఇదే మొదటిసారి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు చెందిన కోర్టు రూమ్‌లో ఈ లైవ్ ట్రాన్‌స్క్రిప్షన్‌కు శ్రీకారం చుట్టారు. మరో ఒకటి రెండు రోజుల పాటు ప్రయోగం కొనసాగనుంది. సత్ఫలితాలు వస్తే శాశ్వతంగా అమలు చేయనున్నారు. వాదనలు, తీర్పులు రికార్డు రూపంలో ఉంటే న్యాయ కళాశాలలకు సైతం ప్రయోజనకరంగా ఉంటుందని సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది.

# ఆస్తులు ఎవరివో!?

**మావంటే, కాదు మావేనంటున్న షిండే, ఉద్ధవ్ వర్గాలు ● ఎల్పీ, పార్లమెంటు ఆఫీసులు ఇప్పటికే షిండే వర్గం చేతికి**



**మహారాష్ట్ర ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్షను నెరవేర్చుకునేందుకు ఆగర్భ శత్రువుల్లాంటి పార్టీలతో జట్టుకట్టిన ఉద్ధవ్ ఠాక్రే, అందుకు భారీ మూల్యమే చెల్లించుకున్నారు. అదను చూసి సొంత పార్టీ నేత ఏక్‌నాథ్ షిండే చేసిన తిరుగుబాటుతో అటు అధికారమూ కోల్పోయారు. షిండే వర్గానిదేనన్న సిసలైన శివసేన అన్న ఈసీ తాజా నిర్ణయంతో ఇటు తన తండ్రి స్థాపించి, వారసత్వంగా తనకప్పగించి వెళ్లిన పార్టీకే పరాయి వాడిగా మిగిలిపోయారు! ఇప్పుడిక శివసేన కార్యాలయం, ఆస్తులు, నిధులు తదితరాలన్నీ కూడా షిండే వర్గం పరమవుతాయా అన్నది ఆసక్తికరంగా మారింది...** - సాక్షి, నేషనల్ డెస్క్

శివసేన పేరు, పార్టీ గుర్తు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికే చెందుతాయన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం ఉద్ధవ్‌కు భారీ ఎదురుదెబ్బే. శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే కుమారునిగా ఆయనకు ఇంతటి దుస్థితి కొంతకాలం క్రితం ఎవరూ ఊహించనిదే! చివరి ప్రయత్నంగా ఈసీ తీర్పుపై ఉద్ధవ్ సుప్రీంకోర్టు తలుపు తట్టారు. కోర్టు తీర్పుపైనే ఆశలన్నీ పెట్టుకున్నారు. కానీ ఈలోపు పార్టీని పూర్తిగా చెప్పుచేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలకు షిండే వర్గం పదును పెడుతోంది. మహారాష్ట్ర అసెంబ్లీలోని శివసేన శాసనసభాపక్ష కార్యాలయాన్ని సోమవారమే స్వాధీనం చేసుకుంది. తాజాగా పార్లమెంటులోని శివసేన కార్యాలయాన్ని కూడా షిండే వర్గానికే కేటాయిస్తున్నట్టు లోక్‌సభ సచివాలయం మంగళవారం పేర్కొంది. ఇదే ఊపులో శివసేన పార్టీ ప్రధాన కార్యాలయం, ముంబైతో పాటు మహారాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ ప్రాంతీయ కార్యాలయాలు, ఇతర ఆస్తులు, సొంత పత్రిక సామ్నాతో పాటు పార్టీ నిధులను కూడా సొంతం చేసుకుంటుందన్న అభిప్రాయాలు విన్పిస్తున్నాయి. ఉద్ధవ్ వర్గం అధీనంలో ఉన్న పార్టీ ఆస్తుల అప్పగింత కోరబోమని షిండే గతంలో చెప్పినా దానికిప్పుడు కట్టుబడబోరని పరిశీలకులు అంటున్నారు. ''ఇలాంటి ఆస్తుల తాయిలాలకు లొంగినవారే 2019లో అధికార లాలసతో తప్పటడుగు వేశారు. ఓటర్ల తీర్పును అపహాస్యం చేస్తూ ఆగర్భ శత్రువులైన పార్టీలతో జట్టుకట్టారు. అందుకే ఆస్తులు, పార్టీ నిధులపై మాకెలాంటి ఆశా లేదు. కేవలం బాల్‌ఠాక్రే ఆదర్శాలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మా ఏకైక లక్ష్యం'' అని అప్పట్లో షిండే పదేపదే చెప్పుకొచ్చారు. అయితే, ''మా తిరుగుబాటులో న్యాయముందని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడమే మా నాయకుని వ్యాఖ్యల అంతరార్థం. అంతే తప్ప న్యాయంగా మాకు దక్కాల్సిన వాటిని వదులుకునే ప్రశ్నే లేదు'' అని షిండే వర్గం కుండబద్దలు కొడుతోంది. శివసేనపై సర్వం సహా హక్కులు తమవేనని రుజువు చేసుకోవడం కోసమైనా భవనాలు, ఆస్తులు తదితరాలన్నింటినీ వీలైనంత త్వరగా తమ పరం చేసుకోవడమే సరైందని ఆయన వర్గం గట్టిగా భావిస్తున్నట్టు సమాచారం.

### పార్టీ నిధుల మాటేమిటి?

గ్రాంట్లు, విరాళాలు, చందాలు, పత్రిక విక్రయాలు తదితరాల రూపేణ శివసేనకు 2020-21లో రూ.13 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్టు ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికను బట్టి తెలుస్తోంది. ఇవి తమకే చెందుతాయని షిండే వర్గం కోరవచ్చు. దీన్ని ఊహించే ఈ నిధులను ఉద్ధవ్ ఇప్పటికే వేరే ఖాతాలకు మళ్లించినట్టు చెబుతున్నారు. దీనిపైనా కీచులాట తప్పకపోవచ్చు.

### అనుబంధ సంఘాలు

ఇక శివసేన అనుబంధ సంఘాలైన స్థానీయ లోకాధికార్ సమితి, భారతీయ కామ్‌గార్ సేన వంటివి సంఘాలు, విభాగాలుగానే పరిగణనలోకి వస్తాయే తప్ప పార్టీగా కాదు. కనుక వీటి యాజమాన్యం ఎవరిదన్నది కేంద్ర కార్మిక చట్టాల ఆధారంగా తేల్చాల్సి ఉంటుందని శివసేన వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### సేన ప్రాంతీయ కార్యాలయాలు

శివసేనకు ఆయువుపట్లుగా భావించే పార్టీ ప్రాంతీయ కార్యాలయాలు (శాఖలు) ముంబై, పరిసర ప్రాంతాల్లోనే అత్యధికంగా ఉన్నాయి. వీటిని వీలైనంత త్వరగా స్వాధీనం చేసుకునే దిశగా షిండే వర్గం పావులు కదుపుతోంది. అయితే దీనికి చెక్ పెట్టేందుకు శాఖలను శివాయ్ సేవా ట్రస్ట్‌కు బదలాయించాలని ఉద్ధవ్ వర్గం భావిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా, ముంబై వెలుపల ఉన్న శాఖలు చాలావరకు ఆయా శాఖా ప్రముఖ్‌లు (స్థానిక మండళ్లు), ట్రస్టుల పేరిటే ఉన్నాయని ఉద్ధవ్ వర్గం ఇప్పటికే గట్టిగా వాదిస్తోంది. అవి తమకే చెందాలని షిండే వర్గం గానీ, మరెవరు గానీ కోరడానికి అవకాశం లేదని ఉద్ధవ్ సేన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు అనిల్ దేశాయ్ చెబుతున్నారు. ఈ లెక్కన ప్రాంతీయ కార్యాలయాల విషయంలో కూడా ఇరు వర్గాల మధ్య సంఘర్షణ తప్పేలా కన్పించడం లేదు.

### శివసేన భవన్



శివసేన ప్రధాన కార్యాలయం. ముంబైలో ఉంది. షిండే వర్గమే అధికారిక శివసేనగా రుజువైతే ఈ భవనం వారికే సొంతం కావాలి. కానీ అది శివసేన ట్రస్టు యాజమాన్యంలో ఉండటం అడ్డంకిగా మారేలా కన్పిస్తోంది. పైగా దీని సారథి సుభాష్ దేశాయ్ ఠాక్రేల కుటుంబానికి విధేయుడు. అంతేగాక ఉద్ధవ్, దేశాయ్‌తో పాటు ట్రస్టీలుగా ఉన్న మిగతా నలుగురూ ఉద్ధవ్ అనుయాయులే! అంతమాత్రాన శివసేన భవన్ ఉద్ధవ్ వర్గం చెప్పుచేతుల్లోనే ఉంటుందని కూడా చెప్పలేని పరిస్థితి! ఎందుకంటే ట్రస్టు ఆస్తిగా ఉన్న భవనాన్ని దశాబ్దాల పాటుగా రాజకీయ పార్టీ కార్యాలయంగా వాడుకోవడం మహారాష్ట్ర పబ్లిక్ ట్రస్టుల చట్టం నిబంధనలకు విరుద్ధం. అధికారంలో ఉన్న షిండే వర్గం ఈ కోణం నుంచి నరుక్కొస్తే భవన వివాదంపై పీటముడి పడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దీనిపై ఓ న్యాయవాది ఇప్పటికే కోర్టుకెక్కారు కూడా. ఆ కేసులో ఉద్ధవ్ వర్గం వాదనలు విన్పించాల్సి ఉంది.

### సామ్నా ఎవరికో?

శివసేన పార్టీ వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే స్థాపించిన సామ్నా అప్పట్లో మహారాష్ట్ర రాజకీయాల్లోనే గాక దేశవ్యాప్తంగా కూడా సంచలనమే. ముఖ్యంగా తీవ్ర పదజాలంతో బాల్ ఠాక్రే రాసే సంపాదకీయాలు, విమర్శనాత్మక కథనాలు, మరీ ముఖ్యంగా వ్యంగ్య కార్టూన్లు జాతీయ స్థాయిలో సంచలనాలకు, వివాదాలకు కేంద్ర బిందువుగా మారేవి. దానితో పాటు కార్టూన్ మేగజైన్ మార్మిక్‌ను కూడా శివసేన వెలువరిస్తోంది. ఈ పత్రికలు, వాటి కార్యాలయాల యాజమాన్యం షిండే వర్గం చేతికి రావడం కష్టంగానే కన్పిస్తోంది. ఎందుకంటే అవి కూడా పార్టీ అజమాయిషీలో కాకుండా ప్రబోధన్ ప్రకాశన్ అనే ట్రస్టు యాజమాన్యంలో కొనసాగుతున్నాయి.




### పార్లమెంటులోని శివసేన ఆఫీస్ షిండే వర్గానికే

**న్యూఢిల్లీ:** పార్లమెంటు సముదాయంలోని శివసేన పార్టీ కార్యాలయం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని వర్గానికే దక్కింది. లోక్‌సభ సచివాలయం ఈ మేరకు పేర్కొంది. షిండే వర్గమే అసలైన శివసేన అంటూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్టు వెల్లడించింది. శివసేన (షిండే) లోక్‌సభా పక్ష నేత రాహుల్ షెవాలే రాసిన ఓ లేఖకు సచివాలయం ఈ మేరకు బదులిచ్చింది. శివసేన పార్టీ, దాని ఎన్నికల చిహ్నమైన విల్లుబాణాలు షిండే వర్గానికే చెందుతాయంటూ గత వారం ఈసీ నిర్ణయం వెలువరించడం తెలిసిందే. ఆ వెంటనే పార్లమెంటులోని శివసేన పార్టీ కార్యాలయాన్ని తమకే కేటాయించాలంటూ లోక్‌సభ సచివాలయానికి షెవాలే లేఖ రాశారు.

### 76 చోట్ల ఎన్‌ఐఏ సోదాలు

**ఆయుధాలు, మందుగుండు, నగదు స్వాధీనం**

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, మాదక ద్రవ్యాల స్మగ్లర్ల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) రంగంలోకి దిగింది. మంగళవారం పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీలో 76 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. 11 పిస్తోళ్లు, రివాల్వర్లు, రైఫిళ్లు, మందుగుండు సామగ్రితోపాటు కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, నగదు స్వాధీనం చేసుకుంది. భారత్‌లో అలజడి రేపడమే లక్ష్యంగా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు దేశంలోని అక్రమ ఆయుధ సరఫరాదారులు, డ్రగ్స్ స్మగ్లర్లు, స్థానిక గ్యాంగ్‌స్టర్లతో చేతులు కలిపాయని ఎన్‌ఐఏ అధికారి ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ''భారత్‌కు వ్యతిరేకంగా దేశం లోపల, బయటి నుంచి కుట్రలు జరుగుతున్నాయి. వీటిని ఛేదించేందుకు పేరుమోసిన గ్యాంగ్‌స్టర్లు, స్మగ్లర్లు, హవాలా ఆపరేటర్లు, అక్రమ ఆయుధ వ్యాపారులు, ఫైనాన్షియర్ల నివాసాల్లో సోదాలు జరిగాయి'' అన్నారు. భారత్‌లో ప్రముఖ వ్యక్తుల హత్యకు, ఉగ్రవాద కార్యకాలాపాల కోసం నేరగాళ్ల ముఠాలు నిధులు సేకరిస్తున్నట్లు, యువతను తమ గ్యాంగ్‌ల్లో నియమించుకుంటున్నట్లు తేలడంతో ఎన్‌ఐఏ గతేడాది మూడు కేసులు నమోదు చేసింది. భారత్‌లో నిఘా తీవ్రతరం కావడంతో చాలామంది గ్యాంగ్‌స్టర్లు పాకిస్తాన్, కెనడా, మలేషియా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు పారిపోయినట్లు గుర్తించింది.

## షిండే తదితరుల అనర్హతపై తేల్చండి

- సుప్రీంకోర్టును కోరిన ఉద్ధవ్ వర్గం
- స్పీకర్‌ది ట్రిబ్యునల్ పాత్ర: కోర్టు

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండేతో పాటు శివసేన నుంచి ఫిరాయించిన మొత్తం మొత్తం 40 మంది ఎమ్మెల్యేల అనర్హత అంశంపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా సుప్రీంకోర్టును ఉద్ధవ్ ఠాక్రే వర్గం కోరింది. అనర్హతపై అంశం ఎటూ తేలకుండానే షిండేతో నాటి గవర్నర్ బి.ఎస్.కోశ్యారీ సీఎంగా ఎలా ప్రమాణస్వీకారం చేయిస్తారని ప్రశ్నించింది. షిండే వర్గాన్నే అసలైన శివసేనగా గుర్తిస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఠాక్రే వర్గం దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం విచారణకు స్వీకరించింది. ఉద్ధవ్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ రోజంతా వాదనలు విన్పించారు. అనర్హత పిటిషన్లపై వారంలోగా నిర్ణయం తీసుకోవాల్సిందిగా స్పీకర్‌కు సూచించాల్సిందిగా కోరారు! ధర్మాసనం స్పందిస్తూ, ఫిరాయింపు కేసుల్లో స్పీకర్ నిజానికి ట్రిబ్యునల్ మాదిరిగా వ్యవహరిస్తారని అభిప్రాయపడింది. ఈ వ్యవస్థ సరిగా పని చేయడం లేదంటూ రాజకీయ పార్టీలు పార్లమెంటులో ఎప్పుడైనా చర్చించాయా అని ప్రశ్నించింది. ''రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం) ప్రకారం ఫిరాయింపుల కేసుల్లో స్పీకర్ ట్రిబ్యునల్‌లా వ్యవహరించాలన్నది పార్లమెంటు నిర్ణయం. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కూడా దీన్ని సమర్థించింది'' అని గుర్తు చేసింది. రాజ్యాంగ సవరణ జరిగితే తప్ప ఫిరాయింపు కేసుల్లో స్పీకర్ పాత్రను సవాలు చేయడం అసాధ్యమని స్పష్టం చేసింది. షిండే వర్గం చర్యలను కోర్టే సమర్థిస్తే ఫిరాయింపులను ప్రోత్సహించడమే అవుతుందని సిబాల్ వాదించారు. ''మూడొంతుల పై చిలుకు సభ్యులు పార్టీని వీడారా లేదా అన్నది వేరే పార్టీలో విలీనమైనప్పుడు మాత్రమే తెరపైకి వస్తుంది. షిండే వర్గం ఏకపక్షంగా పార్టీ విప్‌ను, శాసనసభాపక్ష నేతను మార్చేయడం, విశ్వాస పరీక్ష పెట్టించి నెగ్గడం, తమదే అసలైన సేన అని చెప్పుకోవడం, అందుకు ఈసీ ఆమోదముద్ర వేయడం... ఇదంతా ప్రజాస్వామ్యం పట్ల క్రూర పరిహాసమే'' అన్నారు. వాదనలు బుధవారమూ కొనసాగనున్నాయి.

# పశ్చిమ దేశాలదే ఈ పాపం

**ఉక్రెయిన్ పరిస్థితికి పూర్తిగా అవే కారణం: పుతిన్**

- రష్యా ఉనికి కోసమే మా పోరాటం
- ప్రపంచ భద్రత, శాంతి కోసం చర్చలకు సిద్ధం

**మాస్కో:** ఉక్రెయిన్‌లో ప్రస్తుత పరిస్థితికి ముమ్మాటికీ పశ్చిమ దేశాలే కారణమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. ఉక్రెయిన్‌లో సైనిక చర్య ప్రారంభం కావడానికి, ఇదింకా కొనసాగుతుండటానికి అవే బాధ్యత వహించాలన్నారు. తమను నిందించడం తగదన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో పుతిన్ మంగళవారం జాతినుద్దేశించి ప్రసంగించారు. పశ్చిమ దేశాల ఆటలో రష్యా, ఉక్రెయిన్ బాధిత దేశాలుగా మారాయన్నారు. తాము ఉక్రెయిన్ ప్రజలపై పోరాడడం లేదని, కేవలం స్వీయ మనుగడ కోసమే పోరాటం సాగిస్తున్నామని చెప్పుకొచ్చారు. సమస్య పరిష్కారం కోసం చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. పుతిన్ ఇంకా ఏం చెప్పారంటే...

### అందుకే ఇలాంటి అడ్డదారులు

''పాశ్చాత్య దేశాల చేతుల్లో ఉక్రెయిన్ బందీగా మారడం విచారకరం. రష్యా పతనమే వాటి లక్ష్యం. స్థానిక ఘర్షణను అంతర్జాతీయ పోరుగా మార్చడమే వాటి ఉద్దేశం. రష్యా సరిహద్దు వరకూ విస్తరించాలని నాటో కూటమి ప్రయత్నించింది. రష్యా ఉనికిని కాపాడుకునేందుకు దేనికైనా సిద్ధం. మాపై యుద్ధం ప్రారంభించింది పశ్చిమ దేశాలే. దాన్ని ముగించడానికి మేం బలాన్ని ఉపయోగిస్తున్నాం. మాపై 'సమాచార దాడులు' కూడా జరుగుతున్నాయి. రష్యా సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను దెబ్బతీయాలని కుట్రలు పన్నుతున్నారు. యుద్ధక్షేత్రంలో రష్యాను ఓడించడం అసాధ్యమని వారికి తెలుసు కాబట్టి ఇలాంటి అడ్డదారులు ఎంచుకుంటున్నారు. మా ఆర్థిక వ్యవస్థపైనా దాడి చేస్తున్నారు. కానీ, వారిప్పటిదాకా సాధించింది ఏమీ లేదు. ఇకపైనా ఏమీ ఉండబోదు.''

### సైనికులకు, వారి కుటుంబాలకు కృతజ్ఞతలు

''తూర్పు దేశాలను నాశనం చేయాలని పశ్చిమ దేశాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే నాటో దళాల సంఖ్యను పెంచుతున్నారు. డాన్‌బాస్ ప్రాంతంలో సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు మేము ప్రయత్నించాం. కానీ, పశ్చిమ దేశాలు క్రూరంగా వ్యవహరించాయి. ఉక్రెయిన్–రష్యా సమస్య పరిష్కారానికి అవి సిద్ధంగా లేవు. వాటి వైఖరి వల్లే వ్యవహారం మరింత జటిలంగా మారుతోంది. రష్యాపై యుద్ధం కోసం ఆ దేశాలు ఉక్రెయిన్‌కు 150 బిలియన్ డాలర్లు అందజేశాయి. చివరకు ఉక్రెయిన్‌కు ఇరాక్, యుగోస్లావియా గతి పట్టించడం ఖాయం. ప్రపంచ భద్రత, శాంతి కోసం చర్చలకు మేము సిద్ధంగా ఉన్నాం'' అని పుతిన్ పునరుద్ఘాటించారు. రష్యా కోసం పోరాడుతున్న సైనికులకు, వారి కుటుంబాలకు శిరసు వంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు.



అమెరికాతో కుదిరిన 'న్యూ స్టార్ట్ సంధి'లో తమ భాగస్వామ్యాన్ని రద్దు చేసుకున్నట్లు పుతిన్ మంగళవారం ప్రకటించారు. అణ్వాయుధాల నియంత్రణ కోసం అమెరికా, రష్యా మధ్య కుదిరి, ఇంకా అమల్లో ఉన్న చివరి ఒప్పందం ఇదే కావడం గమనార్హం. ఒకవేళ అమెరికా అణ్వాయుధ పరీక్షలు చేపడితే

### 'న్యూ స్టార్ట్'లో రష్యా భాగస్వామ్యం రద్దు

తాము కూడా అందుకు సిద్ధమని పుతిన్ పేర్కొన్నారు. అమెరికా, దాని నాటో మిత్రదేశాలు రష్యాను లక్ష్యంగా చేసుకున్నాయని, అందుకే న్యూ స్టార్ట్ సంధి నుంచి భాగస్వామ్యాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఒప్పందం నుంచి పూర్తిగా వైదొలగలేదని అన్నారు. తమను ఓడించి, తమ అణ్వాయుధాలను స్వాధీనం చేసుకోవాలన్నదే పశ్చిమ దేశాల ఆలోచన అని మండిపడ్డారు. అమెరికా, రష్యా మధ్య న్యూ స్టార్ట్ సంధి 2010లో కుదిరింది. 2021 ఫిబ్రవరిలో ఈ సంధి గడువు ముగిసిపోగా, మరో ఐదేళ్లు పొడిగించారు.

## పుతిన్ గెలవడం కల్ల

**రష్యాపై మరిన్ని ఆంక్షలు తప్పవు: బైడెన్**



**వార్సా:** ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్న పశ్చిమ దేశాల సంకల్పాన్ని ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కఠినతరంగా మార్చిందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. కఠినమైన, అప్రియమైన రోజులు ముందు ముందు ఉండబోతున్నాయని, అందుకు సిద్ధంగా ఉండాలని ఉక్రెయిన్‌కు సూచించారు. తాము, తమ మిత్రదేశాలు ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తాయని వెల్లడించారు. ఉక్రెయిన్‌పై రష్యా ఎప్పటికీ విజయం సాధించలేదని తేల్చిచెప్పారు. రష్యాపై దాడిచేసేందుకు పశ్చిమ దేశాలు కుట్ర పన్నుతున్నాయంటూ పుతిన్ చేసిన ఆరోపణలను బైడెన్ ఖండించారు. అలాంటి ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు నేడు, రేపు, ఎప్పటికీ రక్షణ కవచంగా నిలుస్తాయని ఉద్ఘాటించారు. జో బైడెన్ ఉక్రెయిన్ పర్యటన ముగించుకొని మంగళవారం పోలాండ్‌కు చేరుకున్నారు. పోలాండ్ అధ్యక్షుడు అంద్రెజ్ దుడాతో సమావేశమయ్యారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధంతోపాటు పలు కీలక అంశాలపై చర్చించారు. నాటోకు అమెరికా ఎంత అవసరమో అమెరికాకు నాటో, పోలాండ్ కూడా అంతే అవసరమని దుడాతో బైడెన్ అన్నారు. అనంతరం రాజధాని వార్సాలోని రాజభవనంలో ఉక్రెయిన్ శరణార్థులను, స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రష్యా దండయాత్రను తట్టుకొని ఉక్రెయిన్ బలంగా ఎదురు నిలుస్తోందని ప్రశంసించారు. ఉక్రెయిన్ వైఖరి గర్వకారణమన్నారు. 'నాటో' కూటమి గతంలో ఎన్నడూ లేనంతగా బలంగా ఇప్పుడు ఉందని పేర్కొన్నారు. నాటోలోని ఏ ఒక్క దేశంపై అయినా ఎవరైనా దాడి చేస్తే అది మొత్తం నాటోపై దాడి చేసినట్లేనని హెచ్చరించారు. అయితే న్యూ స్టార్ట్ ఒప్పందంలో తమ భాగస్వామ్యాన్ని రద్దు చేసుకుంటున్నామన్న పుతిన్ ప్రకటనపై బైడెన్ స్పందించలేదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి కృషి చేస్తున్నారంటూ పోలాండ్, ఉక్రెయిన్ సైన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ''పుతిన్ తనను తాను కఠినమైన వ్యక్తినని అనుకుంటున్నారు. కానీ అమెరికా ఉక్కు సంకల్పంతో పేచీ పెట్టుకుంటున్నారు. చేసిన తప్పులకు రష్యా మూల్యం చెల్లించుకోక తప్పదు'' అన్నారు. మిత్రదేశాలతో కలిసి రష్యాపై ఈ వారంలోనే మరిన్ని ఆంక్షలు విధించబోతున్నట్లు వెల్లడించారు.

### 'ముంబై' దాడుల కుట్రదారులు పాక్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు: జావేద్ అక్తర్

**లాహోర్:** పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రముఖ కవి, రచయిత జావెద్ అక్తర్ (78) పాక్ గడ్డపైనే కడిగేశారు! ''2008లో ముంబైలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన మారణహోమం గురించి భారత్ మాట్లాడితే పాకిస్తానీలు అసహనం వ్యక్తం చేయడం తగదు. ఎందుకంటే ఆ దాడుల కుట్రదారులు ఇప్పటికీ మీ దేశంలోనే స్వేచ్ఛగా తిరుగుతున్నారు'' అన్నారు. ప్రముఖ ఉర్దూ కవి ఫయాజ్ అహ్మద్ ఫయాజ్ స్మృత్యర్థం లాహోర్‌లో నిర్వహించిన ఫయాజ్ ఫెస్టివల్‌లో అక్తర్ పాల్గొన్నారు. ''పాక్‌కు చెందిన నుస్రత్ ఫతే అలీ ఖాన్, మెహిదీ హసన్‌లపై భారత్‌లో మేం భారీ కార్యక్రమాలు నిర్వహించాం. మీరెప్పుడైనా లతా మంగేష్కర్‌పై కార్యక్రమాలు చేశారా?'' అంటూ ఆయన ప్రశ్నించడంతో సభికులు హర్షధ్వానాలు చేశారు.

### శత్రు ఆస్తుల విక్రయంతో రూ.3,400 కోట్లు

**న్యూఢిల్లీ:** శత్రువుల ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీస్) అమ్మకంతో కేంద్రం రూ.3,407 కోట్లు ఆర్జించింది. ఇందులో అధిక భాగం షేర్లు, బంగారం వంటి చరాస్తులేనని అధికారులు తెలిపారు. దేశ విభజన సమయంలో, 1962, 1965 నాటి యుద్ధాల తర్వాత భారత్ నుంచి పాకిస్తాన్, చైనాకు వెళ్లి, అక్కడి పౌరసత్వం పొందినవారి ఆస్తులను శత్రువుల ఆస్తులంటారు. పాక్ జాతీయులకు చెందిన 12,485, చైనా పౌరులకు చెందిన 126 ఆస్తులను తాజాగా విక్రయించారు.

### సూడాన్ స్మగ్లర్ల నుంచి 100 కిలోల బంగారం సీజ్

**ముంబై:** భారత్–నేపాల్ సరిహద్దుల గుండా బంగారాన్ని అక్రమంగా తరలించే ముఠాకు చెందిన ఏడుగురు సూడాన్ దేశస్తులు సహా 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) మంగళవారం తెలిపింది. వారి నుంచి రూ.51 కోట్ల విలువైన 101 కిలోల బంగారాన్ని పట్టుకున్నట్లు వెల్లడించింది. పట్నా, పుణే, ముంబైల్లో 'ఆపరేషన్ గోల్డెన్ డాన్' పేరిట చేపట్టిన ఆపరేషన్‌లో ఈ ముఠా నుంచి రూ.1.35 కోట్ల దేశ, విదేశీ కరెన్సీ కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. పేస్ట్ రూపంలో బంగారాన్ని భారత్–నేపాల్ సరిహద్దుల గుండా పట్నాకు అక్కడి నుంచి ముంబై సహా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు, వేర్వేరు మార్గాల్లో ఈ ముఠా రవాణా చేస్తోందని డీఆర్ఐ వివరించింది.



అంతరిక్ష పర్యాటకానికి జపాన్ అంకురసంస్థ అవాయా గికెన్ సిద్ధంచేసిన బెలూన్ క్యాబిన్ ఇది. ఒక పర్యాటకుడు, ఒక పైలట్‌ను హీలియం బెలూన్ 25 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్తుంది. గంటసేపు అంతరిక్షం నుంచి భూమి అందాలను ఆస్వాదించవచ్చు. ఆ తర్వాత 60 నిమిషాల్లో నెమ్మదిగా కిందకు వస్తుంది. కుబేరుల కోసం కాకుండా సాధారణ ప్రజలకూ అత్యంత తక్కువ ఖర్చులో అంతరిక్ష పర్యాటకాన్ని అందిస్తూ 'ప్రజ్వాస్వామ్య' పర్యాటకాన్ని ఆవిష్కరించడమే తమ లక్ష్యమని సంస్థ అధ్యక్షుడు కీసుకే చెప్పారు.

## నా తండ్రిని రక్షణ శాఖ కార్యదర్శిగా... ఇందిర తొలగించారు: మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ:** దివంగత ప్రధాని ఇందిరాగాంధీ అప్పట్లో తన తండ్రి డాక్టర్ కె.సుబ్రమణ్యంను రక్షణ శాఖ కార్యదర్శి పదవి నుంచి తొలగించారని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. ''రక్షణ వ్యవహారాల్లో అతి లోతైన పరిజ్ఞానమున్న వ్యక్తిగా నాన్నకున్న పేరు ప్రతిష్ఠలు అందరికీ తెలుసు. 1979లో కేంద్రంలో జనతా ప్రభుత్వంలో ఆయన కార్యదర్శి అయ్యారు. అప్పట్లో అత్యంత పిన్న వయస్కుడైన కార్యదర్శి బహుశా ఆయనే. కానీ 1980లో ఇందిరాగాంధీ అధికారంలోకి వస్తూనే మా నాన్నను తొలగించారు'' అని మంగళవారం ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ''నాన్న చాలా ముక్కుసూటిగా వ్యవహరించేవారు. బహుశా అదేమైనా ఆమెకు సమస్యగా మారిందేమో తెలియదు'' అని అభిప్రాయపడ్డారు. ''ఇందిర చర్య వల్ల మా నాన్న కెరీర్‌లో ఎదుగుదల శాశ్వతంగా ఆగిపోయింది. తర్వాత ఎన్నడూ కేబినెట్ కార్యదర్శి కాలేకపోయారు. రాజీవ్‌గాంధీ హయాంలో ఆయన కన్నా జూనియర్ కేబినెట్ కార్యదర్శిగా ఆయన పై అధికారి అయ్యారు. అందుకే మా అన్న కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయికి ఎదిగినప్పుడు నాన్న చాలా గర్వపడ్డారు. కానీ నేను కార్యదర్శి అవడం చూడకుండానే 2011లో కన్నుమూశారు'' అంటూ చెప్పుకొచ్చారు. జై శంకర్ కూడా 2018లో విదేశాంగ శాఖ కార్యదర్శిగా రిటైరవడం తెలిసిందే.

### అనుకోకుండా మంత్రినయ్యా

కేంద్ర ప్రభుత్వోద్యోగిగా రిటైరయ్యాక తాను రాజకీయాల్లోకి రావడం, మంత్రి కావడం పూర్తిగా తలవని తలంపుగా జరిగిన పరిణామమేనని జైశంకర్ అన్నారు. ''కేంద్ర మంత్రివర్గంలో చేరాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ఫోన్ రావడంతో ఎంతో ఆశ్చర్యపోయా. రాజకీయ రంగ ప్రవేశంపై చాలా ఆలోచించా. ఎందుకంటే నేనప్పుడు అందుకు సిద్ధంగా లేను'' అంటూ గుర్తు చేసుకున్నారు. ''నా ఉద్యోగ జీవితమంతా రాజకీయ నాయకులను మంత్రులను దగ్గరగా గమనిస్తూనే గడిపాను. అయినా సరే, నిజాయితీగా చెప్పాలంటే మంత్రి అయ్యాక ఆ పాత్రలో రాణించగలనని తొలుత నాకు నమ్మకం కలగలేదు. కానీ మంత్రిగా నాలుగేళ్ల కాలం చాలా ఆసక్తికరంగా సాగింది. ఎంతో నేర్చుకున్నా'' అన్నారు. మంత్రి అయ్యాకకూడా బీజేపీలో చేరాల్సిందిగా ఎలాంటి ఒత్తిడీ రాకున్నా తనంత తానుగా చేరానన్నారు.

### 'అదానీ' అవకతవకలపై దర్యాప్తు ఏమైంది?: కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్‌లోని డొల్ల కంపెనీలు, అవకతవకలపై దర్యాప్తు ఎంతదాకా వచ్చిందని కేంద్రాన్ని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. ''అదానీ గ్రూప్‌తోపాటు పలు సంస్థలకు ఈ వ్యవహారంలో సంబంధముంది. ఇది అంతర్జాతీయ నెట్‌వర్క్. పలువురు నేతలకూ భాగస్వామ్యముంది. రష్యా, భారత ప్రభుత్వ కంపెనీలు కూడా ఈ అక్రమాల్లో పాలుపంచుకున్నాయి'' అన్నారు.

**ఈడీ బూచి చూపి మా గొంతు నొక్కలేరు**

ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నేతలపై ఈడీ దాడులను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఇలా తమ గొంతు నొక్కలేరని పేర్కొంది. మంగళవారం పార్టీ నేతలు, కార్యకర్తలు రాయ్‌పూర్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ''ఈ రాజకీయ కుట్రను ముందుగానే ఊహించాం. కాంగ్రెస్ ప్లీనరీ దాకా ఇవి కొనసాగుతూనే ఉంటాయి. మేం భయపడేది లేదు' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. వచ్చే 24–26 తేదీల మధ్య రాయ్‌పూర్‌లో జరిగే ప్లీనరీకి ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఆయన ధర్నాలో పాల్గొన్నారు.



నేషనల్ జియోగ్రాఫిక్ 'పిక్చర్ ఆఫ్ ది ఇయర్' పోటీలో విజేతగా నిలిచిన చిత్రమిది. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భారతీయ సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫొటోగ్రాఫర్ కార్తీక్ సుబ్రమణియన్ ఈ ఫొటో తీశారు. అలాస్కాలోని చిల్కాట్ బాల్డ్ ఈగల్ అభయారణ్యంలో తీసిన ఈ ఫొటోకు 'డ్యాన్స్ ఆఫ్ ది ఈగల్' అని పేరు పెట్టారు. ప్రకృతి, ప్రజలు, ప్రాంతాలు, ప్రాణులు కేటగిరీలో వచ్చిన 5,000 ఫొటోల్లోంచి చివరికి దీన్ని ఎంపిక చేసినట్లు సంస్థ తెలిపింది.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023





### శత శాతం లక్ష్యంగా..

పంచాయతీల్లో వంద శాతం పన్నుల వసూళ్లు లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే 87 శాతం వసూలు చేశారు. - 8లో▸



### పోచమ్మ తల్లికి బోనం

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/18.0

### వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. సాయంత్రం చలి పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### విద్యార్థులపై దృష్టి సారించాలి

- కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు
- ఎల్ఎండీ ఠాణా తనిఖీ



మానకొండూర్: ఇంజినీరింగ్ విద్యార్థులపై దృష్టి సారించాలని కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు అన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌ను సీపీ మంగళవారం తనిఖీ చేశారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఠాణాకు వచ్చిన సీపీకి సీఐ పర్శరమేశ్ స్వాగతం పలికారు. అనంతరం సీపీ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాలు పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే.. మానకొండూర్ పోలీస్ స్టేషన్‌ను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ స్వాగతం పలికారు. ఎస్సై తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

### నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్-1 డిపో పరిధిలోని మండలాలకు చెందిన ప్రయాణికుల నుంచి సలహాలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రణీత్ ఒక ప్రకటనలో తెలిపారు. మరింత మెరుగైన సేవలందించేందుకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 99592 25920 ఫోన్ చేసి, తెలియజేయాలని కోరారు.

### రేపు వ్యవసాయ మంత్రి రాక

కరీంనగర్ అర్బన్: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పద్మనగర్‌లో నిర్మించిన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరవుతారని టీఎస్ మార్క్‌ఫెడ్ డీఎం ఎస్.ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవం ఉంటుందని, మంత్రి గంగుల కమలాకర్ సైతం పాల్గొననున్నారని పేర్కొన్నారు.

**బీఎస్పీ జాతీయ కో–ఆర్డినేటర్..**

విద్యానగర్(కరీంనగర్): బీఎస్పీ జాతీయ కో–ఆర్డినేటర్ రామ్‌జీ గౌతమ్, రాష్ట్ర చీఫ్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు గురువారం కరీంనగర్ వస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చొప్పదండి, మానకొండూర్ అసెంబ్లీ ముఖ్య కార్యకర్తల సమీక్షా సమావేశానికి వారు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి సమావేశం జరిగే సాయి మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీతో స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి నల్లాల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, నాయకులు అక్కి బాలకిషన్, మంద రవీందర్, కొంకటి శేఖర్, జన్ను స్వరూప, నరేష్, గాలి అనిల్, సంపత్, శ్రీకాంత్, మధు పాల్గొన్నారు.


### ముగిసిన పోలీసు అభ్యర్థుల ఈవెంట్స్



కరీంనగర్ క్రైం: కరీంనగర్ సీటీసీలో సీపీ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆరు రోజులపాటు జరిగిన పోలీసు అభ్యర్థుల ఈవెంట్స్ మంగళవారం ముగిశాయి. చివరి రోజు 1210 మంది హాజరవగా 437 మంది అర్హత సాధించారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు జరిగిన శారీరక, దేహదారుఢ్య పరీక్షలకు 6,858 మందికి గాను 5,740 మంది హాజరవగా 2253 మంది అర్హత సాధించారు. పురుషులు 4899 మందికిగాను 4112 మంది వచ్చారు. వీరిలో 1416 మంది అర్హత సాధించారు. మహిళలు 1959 మందికిగాను 1628 హాజరయ్యారు. వీరిలో 837 మంది అర్హత సాధించారు. అడిషనల్ డీసీపీ(పరిపాలన) జి.చంద్రమోహన్, ఏసీపీలు కాశయ్య, కె.శ్రీనివాస్, సీహెచ్.మల్లికార్జున్, సత్యనారాయణ, సి.ప్రతాప్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మునిరామయ్య, సూపరింటెండెంట్ ఏవీఎస్ చారి, ఇన్‌స్పెక్టర్లు మాధవి, బి.సంతోష్‌కుమార్, సృజన్ రెడ్డి, జె.సురేష్, రవీందర్, పి.రమేష్, స్వర్ణజ్యోతి, ఆర్ఐలు సురేష్, జానీమియా, రమేష్, మురళి, మల్లేశం, మినిస్టీరియల్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త(పల్లి) ముసలం?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో పురపాలికల్లో అసంతృప్తి సెగలు ఆరడం లేదు. జగిత్యాలలో మొదలైన ఈ మంటలు తరువాత హుజూరాబాద్, సుల్తానాబాద్ వరకు పాకాయి. జమ్మికుంటలోనూ అసంతృప్తి రాగం తలెత్తినా.. నాయకుల చొరవతో ఆదిలోనే దాన్ని నిలువరించగలిగారు. తాజాగా కొత్తపల్లి మున్సిపాలిటీలోనూ కౌన్సిలర్లు అసంతృప్తి రాగం అందుకున్నారని సమాచారం. మున్సిపల్ చైర్మన్‌కు వ్యతిరేకంగా కౌన్సిలర్లు తిరుగుబావుటా ఎగరేసేందుకు పావులు కదుపుతున్నారు. నాలుగైదు రోజులుగా కౌన్సిలర్లు పలు దఫాలుగా సమావేశమై చైర్మన్ రుద్ర రాజుకు వ్యతిరేకంగా వ్యవహరించాలని తీర్మానించినట్లు తెలిసింది. కొత్తపల్లి మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు నగరంలోని ప్రముఖ హోటళ్లలో రెండుసార్లు, మరో ప్రజాప్రతినిధి ఇంట్లో ఇదే విషయమై సమావేశమయ్యారని తెలిసింది. వీరంతా తమ అసంతృప్తిని పెద్దల వద్ద ఉంచి, తమ డిమాండ్లు నెరవేర్చుకునే ప్రణాళికలో ఉన్నారని సమాచారం.



**మున్సిపల్ చైర్మన్‌కు వ్యతిరేకంగా సమావేశాలు**

- అభివృద్ధి పనులు జరగడం లేదని అలక
- పలుమార్లు సమావేశమైన కౌన్సిలర్లు
- కొత్తపల్లిలో వేడెక్కిన రాజకీయాలు

### మూడేళ్ల క్రితం..

పాలనలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తపల్లి(హెచ్) మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 12 వార్డులతో నూతనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీకి జనవరి 2020లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 12 స్థానాలకు గాను 11 స్థానాలను గెలుచుకొని చైర్మన్ పదవిని టీఆర్ఎస్ చేజిక్కించుకుంది. కొత్తపల్లి మున్సిపల్ తొలి చైర్మన్‌గా రుద్ర రాజు, వైస్ చైర్మన్‌గా బండ రాధగోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైడ్రామా మధ్య జరిగిన చైర్మన్ ఎన్నిక సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు బండ రాధ, జేరిపోతుల మొండయ్య, జేరిపోతుల అంజలి, మానుపాటి వేణుగోపాల్, రుద్ర రాజు, సయ్యద్ నాజియా, గండు రాంబాబు, చింతల సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గున్నాల విజయలు హాజరవ్వగా, టీఆర్ఎస్‌కు చెందిన వాసాల రమేశ్, స్వర్గం వజ్రాదేవి, వేముల కవిత గైర్హాజరయ్యారు. అప్పటి నుంచి మూడేళ్ల పదవీకాలాన్ని పాలక మండలి ఇటీవలే పూర్తి చేసుకుంది.

### అభివృద్ధి లేదని ఆరోపణ..

కొత్తపల్లి మున్సిపల్ పాలకమండలి ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా సరైన అభివృద్ధి పనులు జరగడం లేదన్నది కౌన్సిలర్ల ప్రధాన ఆరోపణ. దీనికితోడు ఇటీవల పెంచిన ఇంటి పన్నుల మూలంగా ప్రజలు నిలదీసే పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. నాయకత్వ లోపం వల్లనే ఒక్క అభివృద్ధి పని చేయలేకపోయామని.. ఇలాగైతే వచ్చే ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు ఎలా అడగాలని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే తప్ప మున్సిపాలిటీ ఏర్పడ్డాక తట్టెడు మట్టి తీయలేదన్న ఆవేదనకు లోనవుతున్నట్లు తెలిసింది.

### అలకకే పరిమితం..

ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఎక్కడా అవిశ్వాసానికి అవకాశం లేకుండాపోయింది. నాలుగేళ్ల వరకు అవిశ్వాసానికి అవకాశం లేదని ప్రభుత్వం కుండబద్దలు కొట్టడంతో ఇప్పుడు పురపాలికల్లో నేతలు అయోమయంలో పడ్డారు. జగిత్యాల, హుజూరాబాద్, సుల్తానాబాద్ పురపాలికల్లో అవిశ్వాసంపై ఎటూ తేలకపోవడంతో కొత్తపల్లి కౌన్సిలర్లు పునరాలోచనలో పడ్డారు. ఎలాంటి అవిశ్వాసాలకు వెళ్లవద్దని పార్టీ నుంచి స్పష్టమైన సంకేతాలు ఉన్న నేపథ్యంలో ఎలా ముందుకుపోవాలో కూర్చుని సుదీర్ఘంగా చర్చించుకుంటున్నారు. అదే సమయంలో తాము అసంతృప్తిలో ఉన్నామన్న విషయం పార్టీ పెద్దలకు తెలియాలన్న ప్రణాళికతో వరుసగా వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారని సమాచారం. తమను అధిష్టానం పిలిస్తే.. స్థానిక సమస్యలు చెప్పుకోవాలని వేచి చూస్తున్నారని తెలిసింది.

# కరీంనగర్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం



ఐలాండ్ల నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

- మంత్రి గంగుల కమలాకర్
- రూ.2.68 కోట్లతో చేపట్టనున్న ఐలాండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

కరీంనగర్‌సిటీ: తెలంగాణలో హైదరాబాద్ తర్వాత కరీంనగరాన్ని రెండో అతిపెద్ద నగరంగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ముందుకు సాగుతున్నామని, కరీంనగరాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, గొప్ప నగరంగా తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయమని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లో రూ.2.68 కోట్లతో చేపట్టనున్న ఐలాండ్ల నిర్మాణ పనులకు నగరంలోని ఓల్డ్ పవర్ హౌస్ జంక్షన్ వద్ద మంత్రి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూడళ్లలో నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా ఆధునిక డిజైన్లతో 13 కొత్తగా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 7 కూడళ్ల పనులకు టెండర్లు పూర్తయి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, మరో 6 కూడళ్లకు టెండర్లను త్వరితగతిన పూర్తిచేసి మార్చి 31 లోగా 13 జంక్షన్‌లను సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తెలంగాణ చౌక్, వన్‌టౌన్, బొమ్మకల్ కూడళ్ల పనులు చురుకుగా సాగుతున్నాయని, అందుబాటులో ఉన్న స్థలంలోనే ఆధునిక డిజైన్లతో, గ్రీనరీ, వాటర్, లైటింగ్ సిస్టంతో గొప్పగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కేబుల్ బ్రిడ్జ్ ప్రారంభం లోగానే పనులను పూర్తి చేస్తామన్నారు. ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సదాశివపల్లి వద్ద కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు బీటీ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వై.సునీల్ రావు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**మానవతకు మారుపేరు సీఎం కేసీఆర్**

కరీంనగర్: ఆడబిడ్డల కళ్లలో ఆనందం చూడాలనే ధ్యేయంతో.. పేదలు, నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ మానవతకు మారుపేరని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి, కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించారు. రూ.3 కోట్ల 70 లక్షల 42 వేల 920 విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో నగర మేయర్ వై.సునీల్ రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు తదితరులు పాల్గొన్నారు.

**సేవాలాల్ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి**

కొత్తపల్లి: చింతకుంట శాంతినగర్‌లోని సేవాఘాట్ గుట్టపై 26న జరిగే శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని మంత్రి కమలాకర్ పిలుపునిచ్చారు. జయంతి ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం కరీంనగర్‌లో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.తిరుపతి నాయక్ ఆలయ కమిటీ నాయకులు, పూజారులు పాల్గొన్నారు.

### తగ్గిన పత్తి ధర

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధరలు గత వారం క్వింటాల్‌కు రూ.7,950 ఉండగా మంగళవారం రూ.250 తగ్గి, గరిష్ఠంగా రూ.7,700 పలికింది. మార్కెట్‌కు 124 వాహనాల్లో 1,844 క్వింటాళ్ల పత్తిని రైతులు విక్రయానికి తీసుకురాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,500, కనిష్ఠ ధర రూ.7 వేలు వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 22 మంది రైతులు 40 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,300, మోడల్ ధర రూ.7 వేలు, కనిష్ఠ ధర రూ.6,300కు కొనుగోలు చేశారు.

# మార్చి మొదటి వారంలో జిల్లాకు రేవంత్ పాదయాత్ర

- నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో రేవంత్ కీలక సూచనలు

కరీంనగర్‌టౌన్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర మార్చి మొదటి వారంలో కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో కొనసాగనుంది. హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి ప్రారంభం కానున్న ఈ పాదయాత్ర దశలవారీగా పార్లమెంటు నియోజకవర్గంలోని మిగతా 6 అసెంబ్లీ నియోజకవర్గాలలో కొనసాగనుంది. ఇందుకు సంబంధించి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ముఖ్య నాయకుల బృందంతో మంగళవారం వరంగల్‌లో రేవంత్ సమావేశమయ్యారు. పాదయాత్ర ఒకరోజులో ఒక నియోజకవర్గంలో ఎన్ని కిలోమీటర్లు నడవాల్సి ఉంటుందో చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం నెరవేర్చని హామీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టేందుకు రూపొందించనున్న ప్రణాళికపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు మేడిపల్లి సత్యం, బల్మూరి వెంకట్, అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నాయకులు నాగుల సత్యనారాయణ గౌడ్, వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పత్తి కృష్ణా రెడ్డి, బొమ్మనపెల్లి అశోక్ రెడ్డి, మెనేని రోహిత్ రావు, సత్తు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యనేతలతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

# స్వాధీనమా.. పరాధీనమా..?

- ప్రభుత్వ భూముల గుర్తింపుపై కసరత్తు
- గతంలో గుర్తించిన వాటి మాటేమిటి?
- పారదర్శక సేవలే పరమావధి

కరీంనగర్ అర్బన్: ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమేనా.. తిరిగి స్వాధీనం చేసుకుని లక్షిత వర్గాలకు చేరుతుందా..నన్నది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే గతంలో నిర్వహించిన సర్వేతో 1,200 ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైందని తేలగా సదరు భూ వ్యవహారాన్ని ఎటూ తేల్చని యంత్రాంగం మళ్లీ దస్త్రాల దుమ్ము దులిపేందుకు సన్నద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల క్రమంలో భూ రికార్డుల ప్రక్షాళనలో వెల్లడైన భూ గణాంకాల ప్రకారం రక్షణకు సిద్ధమవుతోంది. మరి గతంలోలాగే మమ అనిపిస్తారా.. అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుంటారా వేచిచూడాల్సిందే. అయితే ఇప్పటివరకు వివిధ వర్గాలకు పంపిణీ చేసిన భూములు సహా అందుబాటులో ఉన్నవాటి వివరాలు సేకరిస్తోంది. సర్కారీ స్థలాల సమగ్ర వివరాలతో డేటాబేస్‌ను రూపొందించాలని సీసీఎల్ఏ రెవెన్యూ యంత్రాంగానికి నిర్దేశించింది.

**మారిన భూ స్వరూపం.. వసూళ్లే వసూళ్లు**

జిల్లావ్యాప్తంగా దాదాపు 50వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటుందని అధికార వర్గాలు చెబుతుండగా అందులో 21 వేల ఎకరాలను భూమిలేని పేదలకు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 1,218 ఎకరాలు ఖాళీగా ఉన్నట్లు తేల్చింది. కాగా పేదలకు కేటాయించిన భూముల్లో చాలావరకు చేతులు మారాయి. వీటన్నింటి సమాచారం సేకరించి ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఆక్రమితుల వివరాలు, విస్తీర్ణం కూడా పొందుపరచాలని తేల్చి చెప్పింది. కాగా అన్యాక్రాంతమైన అసైన్డు భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అయితే పలువురు తహసీల్దార్లు ప్రభుత్వ భూములను పంపిణీ చేసినట్లు రికార్డుల్లో చూపి ఇతరుల ద్వారా పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసి ఆక్రమణలకు సహకరించినట్లు పక్కా సమాచారం. ఈ నేపథ్యంలో సదరు ఆక్రమణ సక్రమమేనన్నట్లుగా రికార్డులు ఏమార్చి ఎపుడో సదరు ప్లాట్‌ను కేటాయించినట్లు పేర్కొంటున్నారు.



రికార్డుల ద్వారా భూముల పరిశీలన(ఫైల్)

**జిల్లాలో పంపిణీ చేసిన అసైన్డు భూముల వివరాలు(ఎకరాల్లో..)**

| | |
|---|---|
| పంపిణీ చేసిన భూమి | 21,723.33 |
| కాస్తులో ఉన్న భూమి | 20,505 |
| మిగిలి ఉన్న భూమి | 1,218 |

**జిల్లాలోని భూముల వివరాలు (ఎకరాల్లో..)**

| | |
|---|---|
| ప్రభుత్వ భూమి | 40,366 |
| వక్ఫ్ భూములు | 517 |
| అటవీ భూమి | 1,748 |
| సాగు విస్తీర్ణం | 3,33,450 |
| రెవెన్యూ గ్రామాలు | 206 |
| మొత్తం రైతులు | 1,70,320 |

### రికార్డులు ఏమార్చిన వారిపై చర్యలుంటాయా?

లబ్ధిదారుల్లో నిరుపేదలు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులుండగా భూముల విలువలు పెరగడంతో సగానికి పైగా ఇతరులకు విక్రయించినట్లు తెలుస్తోంది. సర్కారు ఆదేశాలతో అసైన్డు భూములను అక్రమంగా కలిగి ఉన్నవారికి లావోణి భూముల నిషేధం రూల్స్ 2007 కింద నోటీసులు జారీ చేస్తున్నారు. సదరు భూములను ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోరాదో సమాధానం కోరుతున్నారు. క్రయవిక్రయాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడం, రిజిస్ట్రేషన్లలో చేతివాటంతో చాలావరకు భూములు విక్రయించారని సమాచారం. భూ మాఫియా చేతుల్లోకి కొంత వెళ్లగా మరికొంత గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకోవడానికి కొనుగోలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో అసైన్డు భూముల్లో నిర్మాణాలు చేసుకున్నారు. ఇందుకు సంబంధిత రెవెన్యూ అధికారులు దన్నుగా నిలిచారన్న ఆరోపణలున్నాయి. జిల్లావ్యాప్తంగా 8వేల ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైనట్లు సమాచారం. అన్యాక్రాంతమైన ఇతరులకు విక్రయించిన అసైన్డుభూముల వివరాల సమాచారం రెవెన్యూ అధికారుల వద్ద లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అసైన్డు భూములను పహాణీలో పేరు మార్చి కొత్త పాసుపుస్తకాలు జారీచేసిన సంఘటనలున్నాయి. అందుకు రెవెన్యూ అధికారులు కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి.

### సమస్యలెన్నెన్నో..!

- భూ దస్త్రాల్లో ఉండే సమాచారానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. దస్త్రంలో ఒకే సర్వే నంబర్‌లో భూమి ఉన్నట్లు ఉంటే భౌతికంగా ఆ భూమి వేరే సర్వే నంబర్‌లో ఉంటోంది.
- దీంతో వీటిని మార్చడం సమస్యగా మారుతోంది. అలాగే దశాబ్దాల క్రితం ఇచ్చిన ఇనామ్ భూముల విషయంలో కూడా అనేక చిక్కుముళ్లు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల ఒక వర్గానికి లేదా కొందరికి కలిపి ఆ ఇంటి పెద్ద పేరుతో ఇనామ్ భూములు గతంలో పంపిణీ చేశారు.
- తర్వాత వారసుల పేరుతో ఆ భూములు బదిలీ అయ్యాయి. పద్ధతి ప్రకారం సోదరులు, వారి పిల్లల పేర్లతో కూడా బదిలీ కావాల్సి ఉంటుంది. అలా జరగకపోవడంతో వివాదంగానే ఉన్నాయి.
- ఇదిలాఉంటే దస్త్రాలు రాసేప్పుడు నాలుగైదు సర్వే నంబర్ల పరిధిలో ఉండే మొత్తం భూమిని ఏకమొత్తం కింద చూపించారు. సర్వే నంబర్ల వారిగా భూ విస్తీర్ణం చూపించకపోవడం వల్ల ఇప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి.
- ఇక గతంలో భూ లావాదేవీలు జరిగినపుడు తెల్లకాగితాలపై రాసుకునే వారు. వీటిని రెవెన్యూ దస్త్రాల్లో చూపించకపోవడం వల్ల ప్రస్తుతం కాస్తులో ఒకరుంటే సాదాబైనామాల్లో పేర్లు వేరేవారివి ఉంటున్నాయి.
- నగర, పట్టణ శివారుల్లో ఎక్కువ మేర సాగు భూములు వ్యవసాయేతరంగా మారిపోయాయి. ప్లాట్లు వేసి వెంచర్లు వేసినవి ఎక్కువగా ఉన్నాయి.
- అయితే వీటిని ఇప్పుడు కూడా కొందరు వ్యవసాయ భూములుగానే చూపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

## క్లుప్తంగా

### ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చవద్దు



విద్యానగర్(కరీంనగర్): ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చవద్దని బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి కోటేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి ముదిరాజ్‌లను మార్చడం వల్ల బీసీ–ఏ కులాలవారికి తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయమై బీసీ కమిషన్‌కు, సీఎస్‌కు వినతిపత్రాలు అందించామన్నారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి దేవేందర్, బాధ్యులు గడప నాగరాజు, కోటేశ్‌కుమార్, జంపాల నర్సయ్య, కిన్నెర సురేష్, రవీందర్, రామస్వామి పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్ వద్ద మంగళవారం ఓ బైక్‌ను మరో బైక్ ఢీకొన్న ఘటనలో గద్దపాక గ్రామానికి చెందిన తాళ్లపల్లి సతీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీశ్ మంగళవారం కేశవపట్నం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. మొలంగూర్ చేరుకోగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో సతీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా పరారయ్యాడని స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి, హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

# శతశాతం లక్ష్యంగా..

- మార్చి 31 నాటికి పన్నుల వసూళ్లు పూర్తి చేసేందుకు చర్యలు
- 98.34 శాతంతో ముందంజలో కొత్తపల్లి.. చివరి స్థానంలో సైదాపూర్ మండలం

జిల్లా వ్యాప్తంగా పన్నుల వసూళ్ల వివరాలు (రూ.కోట్లలో..)

| మొత్తం పన్నులు | వసూలైనవి | బ్యాలెన్స్ | శాతం |
|---|---|---|---|
| 9,49,62,613 | 8,29,09,963 | 1,20,52,650 | 87.31 |

కరీంనగర్: పల్లెల్లో అభివృద్ధి పనులు పరుగులు పెట్టాలంటే ప్రభుత్వమిచ్చే నిధులతో పాటు పన్నుల వసూళ్లు కీలకం. గ్రామపంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరులు ఇల్లు, నీటి పన్నులు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ విధిగా పన్ను చెల్లించాల్సిందే. అప్పుడే మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రాథమిక సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది. గతంలో పన్నులను గడువులోగా రాబట్టేందుకు అధికారులు, పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం పన్నుల వసూళ్లు, చెల్లింపుల వల్ల కలిగే ప్రయోజనాలపై అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుండడంతో ప్రజలు పన్నులు కట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఆస్తి పన్నును ప్రత్యక్ష పన్ను (ట్యాక్స్), ఇతర నల్లా బిల్లులు, లైసెన్స్ ఫీజులు, స్టాంప్‌డ్యూటీ, ఇతర అనుమతుల ద్వారా వచ్చే ఫీజులు, ఇతర రాయల్టీలు, ఇతరత్రా ఆదాయాన్ని (నాన్ ట్యాక్స్‌గా) పరిగణిస్తారు. ఈ పన్నుల ద్వారా వచ్చే ఆదాయం నుంచి ఐదు శాతం సాధారణ, 30 శాతం జీతాలు, 15 శాతం విద్యుత్ దీపాల నిర్వహణ, మౌలిక వసతులు, పారిశుధ్య పనులు, పండుగలకు ఏర్పాట్లు, అత్యవసర పనుల కోసం వినియోగిస్తారు. ఈనేపథ్యంలో వందశాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ముమ్మరంగా చర్యలు చేపడుతోంది. జిల్లాలోని 15 మండలాల్లో 313 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటికే దాదాపు మెజార్టీ గ్రామాల్లో వంద శాతం పన్నుల వసూళ్లను పూర్తి చేసి మార్చి 31 నాటికి టార్గెట్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.



పోచంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

#### సర్వేతో సత్ఫలితాలు

గ్రామాల్లో పన్నుల వసూళ్లకు క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. ఇంటింటా తిరుగుతూ ప్రజల నుంచి పన్నులు రాబట్టేలా కృషి చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం గ్రామాల్లో వ్యవసాయేతర ఆస్తుల నమోదును చేపట్టింది. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ప్లాట్లు వంటి వాటి వివరాలను పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సేకరించారు. ఈ సర్వేలో భాగంగా పన్నుల వసూళ్లు చేపడుతున్నారు. దీంతో గతంలో ఎప్పుడు లేని విధంగా ఒక నెల ముందుగానే జిల్లాలో 87.31శాతం పన్నులు వసూళ్లు చేయడం సులభతరమైంది.

#### మొదటి స్థానంలో కొత్తపల్లి

జిల్లాలోని 313 గ్రామపంచాయతీల్లో ట్యాక్స్, నాన్‌ట్యాక్స్‌లు గత సంవత్సరం బకాయిలతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.9,49,62,613 లక్ష్యం కాగా ఇప్పటి వరకు 87.31 శాతం వసూలైనాయి. జిల్లాలో కొత్తపల్లి మండలం పన్నుల వసూళ్లల్లో మొదటి స్థానంలో నిలిచింది. రూ.53,78,920 బకాయిలకు రూ.52,89,419 వసూలు చేసి 98.34 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసింది. రెండో స్థానంలో చొప్పదండి 98.13 శాతం, తిమ్మాపూర్ 96.47 శాతం, గన్నేరువరం 92.39 శాతంతో ముందు వరుసలో ఉండగా సైదాపూర్ 77.49 శాతంతో చివరిస్థానంలో ఉంది. కార్యదర్శులు, కారోబార్‌లకు మండల స్థాయి అధికారులు రోజూ సూచనలిస్తూ.. వసూలు చేసే క్రమంలో వచ్చే ఇబ్బందులను అధిగవించడానికి సర్పంచులను కలుపుకొని వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు.

#### వంద శాతం పూర్తి చేస్తాం



మార్చి 31 వరకు పన్నుల వసూళ్లు వంద శాతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే అన్ని మండలాల్లో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 87.31 శాతం పన్నుల వసూళ్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన గ్రాంట్లను నిర్దేశించిన పనులకు మాత్రమే వాడుకోవాల్సి ఉంటుంది. పన్నుల రూపంలో వచ్చే జనరల్ ఫండ్‌ను మాత్రం గ్రామంలోని ప్రతి అవసరానికి వాడుకునే వీలుంటుంది. ఆ దిశగా సర్పంచ్‌లకు, గ్రామస్తులకు అవగాహన కల్పించి పన్నుల వసూళ్లకు వెళ్తున్నాం.

– వీరబుచ్చయ్య, డీపీవో

# ఎనీమియా ముక్త్ జిల్లాకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

రామడుగు(చొప్పదండి): ఎనీమియా ముక్త్ కరీంనగర్ (రక్తహీనతలేని కరీంనగర్)గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ కోరారు. మండలంలోని వెదిర గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా రక్తహీనతతో చాలా మంది మహిళలు ఇబ్బందిపడుతున్నారని, వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల యొక్క బరువు, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సబిత, డీఎంహెచ్‌వో జువేరియా, ఎంపీపీ కలిగేటి కవిత, తహసీల్దార్ రాజుకుమార్, ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర, ఐసీడీఎస్ గంగాధర ప్రాజెక్టు అధికారి కస్తూరి, ఎంఈవో వేణుకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, సర్పంచ్ నాగుల సంగీత, ఎంపీటీసీ అనిల్, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీ, గ్రంథాలయాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. సర్పంచ్ పంజాల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

# రేపటి నుంచి ఏఐఎఫ్‌బీ మహాసభలు

కరీంనగర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 19వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మహాసభలకు దేశ నలుమూలల నుంచి 500 మంది ప్రతినిధులు, 20 దేశాల నుంచి విదేశీ ప్రతినిధులు, వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల జాతీయ నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. మహాసభల్లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేపథ్యం, పార్టీ బలోపేతం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి రానున్న రోజుల్లో సమరశీల పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేసేలా కార్యాచరణ ఉంటుందని తెలిపారు. నిష్కలంక దేశభక్తుడు సుభాష్‌చంద్రబోస్ ఆశయ సాధనకు దేశంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ఫార్వర్డ్ బ్లాక్ సైనికులు సిద్ధం కావాలన్నారు. జాతీయ మహా సభలకు పార్టీ శ్రేణులు, సుభాష్ చంద్రబోస్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, గవ్వ వంశీధర్‌రెడ్డి, శంకర్, లింగమూర్తి, ప్రశాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోజిరెడ్డి

# భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిస్తాం

కరీంనగర్: భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో ఎడ్ల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెడ్ బుక్ డే నిర్వహించారు. భగత్‌సింగ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని సామూహిక అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ పరాయి పాలన విముక్తి కోసం తన జీవితాన్నిఅంకితం చేసిన గొప్ప త్యాగశీలి భగత్ సింగ్ అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ రోజురోజుకు హరిస్తుందని, రచయితలు, జర్నలిస్టులు, మీడియా సంస్థలు, కవులు, కళాకారులపై దాడులు పెరిగాయన్నారు. గుప్పెడు మంది చేతిలో దేశ సంపద ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో శ్రమజీవికి గౌరవం లేదని, దోపిడీ ద్వారా సంపాదించిన వారికే గౌరవం దక్కుతుండడం ఆవేదన కలిగిస్తుందన్నారు. ప్రపంచ మానవాళి మనగడకు చోదక శక్తిగా కమ్యూనిస్టు మేనిఫెస్టో ఉపకరిస్తుందన్నారు. అధ్యయనం ద్వారా సమస్యను గుర్తించి, విశ్లేషించి, సత్యశోధన చేసి పరిష్కార మార్గాలను సూచించేది పుస్తకమేనన్నారు. కార్యక్రమంలో వర్ణ వెంకటరెడ్డి, జి.రాజేశం, డి.నరేష్, ఎస్.రజనీకాంత్, మక్కపెల్లి పూజ, తిరుపతినాయక్, అరవింద్, మనోజ్, సురేష్, శారద తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని చదువుతున్న నాయకులు

# వసతులు కల్పించకుంటే కఠిన చర్యలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సుజయ్
- బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని బీసీ గురుకుల పాఠశాలలో తనిఖీ

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్ చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ సంపత్‌తో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాత్‌రూంలు సరిగా లేవని, ఆహారంలో నాణ్యత లేదని గుర్తించారు. నీటి సౌకర్యంతోపాటు హాస్టల్‌లో పరిశుభ్రత సక్రమంగా లేదని, వెంటనే మార్పులు చేపట్టాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. త్వరలో మళ్లీ తనిఖీ చేస్తామని, అన్ని వసతులు కల్పించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇబ్బందులుంటే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది మహేశ్, ప్రత్యేక అధికారి రాజమౌళి, చైల్డ్‌లైన్ సభ్యుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అన్నం పరిశీలిస్తున్న జడ్జి సుజయ్

# సాంకేతికతతో ఉన్నత స్థానాలకు చేరుకోండి

- డీఈవో వి.జనార్దన్‌రావు
- ఫిలింభవన్‌లో జిల్లాస్థాయి సైన్స్ ప్రతిభా పరీక్షలు

విద్యానగర్(కరీంనగర్): విద్యార్థులు సాంకేతికతను సరైన పద్ధతిలో ఉపయోగించుకోవాలని డీఈవో వి.జనార్దన్‌రావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్ ఫిలింభవన్‌లో జిల్లాస్థాయి సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభాపోటీల్లో పాల్గొంటూ సాంకేతికతను వినియోగించుకొని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఉమ్మడి పరీక్షల కేంద్రం జిల్లా కార్యదర్శి సతీశ్‌కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామ్‌కిరణ్‌లు మాట్లాడుతూ.. ఫోరం తరపున పదోతరగతి విద్యార్థులందరికీ ఫిజికల్ సైన్స్ మెటీరియల్ అందిస్తామన్నారు. సబ్జెక్టు పరంగా వచ్చే సందేహాల నివృత్తికి, ప్రయోగాల నిర్వహణలో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలు నిలిచినవారికి డీఈవో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ బాధ్యులు దామోదర్, సత్యనారాయణ, సుధాకర్, శంకర్, భుజన్ చందర్, శ్రీనివాస్, ఓదెలు కుమార్, గుండా శ్రీనివాస్, వీరేందర్, ముకుంద రెడ్డి, హరిత, శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందించిన డీఈవో జనార్దన్‌రావు

# స్టార్టర్ల తొలగింపుతో హైరానా పడొద్దు

- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం
- ఎస్‌ఈ గంగాధర్

హుజూరాబాద్‌రూరల్: ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపుతో రైతులు హైరానా పడాల్సిన అవసరం లేదని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఎస్‌ఈ గంగాధర్ అన్నారు. హుజూరాబాద్ రూరల్ మండలంలోని పోతిరెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థ ఆదేశానుసారం ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా సమయానుగుణంగా జరుగుతుందని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, ఏఈ రవీందర్, ఇతర అధికారులు, సర్పంచ్ తాటికొండ పుల్లాచారి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈ గంగాధర్

# రేకుర్తి కంటి ఆసుపత్రి సేవలు భేష్

- లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రాజు

కొత్తపల్లి(కరీంనగర్): మూడు దశాబ్దాలుగా రేకుర్తి కంటి ఆసుపత్రి పేద ప్రజలకు అందిస్తున్న సేవలు భేష్ అని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ డైరెక్టర్ వి.విజయ్‌కుమార్‌రాజు కొనియాడారు. కరీంనగర్ శివారు రేకుర్తిలోని డా.మాడేకర్ లయన్స్ క్లబ్ ఉదార కంటి ఆసుపత్రి ప్రారంభించి 35 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి రిఫ్రాక్షన్ రూం, రోగులు వేచి ఉండే గదులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా రేకుర్తిలో లయన్స్ క్లబ్ ఉదార కంటి ఆసుపత్రి ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు 7,27,892 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు 89,324 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు అందించిన ఘనత ఆసుపత్రికి దక్కుతుందన్నారు. గ్రామాలు, పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ కంటి సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించడం మంచి పరిణామన్నారు. పేదలకు అండగా నిలుస్తూ ఆసుపత్రి మరింత అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి ట్రస్టు బోర్డు చైర్మన్ కొండ వేణుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ ఎం.విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా గవర్నర్ ఆర్.నారాయణరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్‌రావు, సభ్యులు చిదుర సురేష్, ప్రకాష్‌హొల్లా, బొమ్మ పవన్‌కుమార్, ఇంజినీర్ కోల అన్నారెడ్డి, డా.టి.మురళీధర్‌రావు, ఆసుపత్రి వైద్యులు విజయ్‌దేశ్‌ముఖ్, పి.శ్వేత, ఎం.స్వాతి, కె.హారిక, స్వాతిశ్రీ, మహమూనా, విజిటింగ్ వైద్యులు తులసి ప్రియ, పావనిరెడ్డి, సింధు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వైద్యులు, ఆసుపత్రి సిబ్బందిని ఘనంగా సన్మానించి ట్రస్టు బోర్డు సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



అన్నారెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్‌రాజు

# బ్యాంకర్లు రుణ లక్ష్యాలను చేరుకోవాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్ అర్బన్: ప్రజలకు అందించే రుణాల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ బ్యాంకర్లను ఆదేశించారు. డిసెంబర్ త్రైమాసికం వరకు జరిగిన ప్రగతిపై వారితో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.6,751.54 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.2,691.43 కోట్లు, ఎంఎస్‌ఎంఈ రంగంలో రూ.1,222.54 కోట్లు, విద్యా రుణాలకు రూ.17 కోట్లు, హౌసింగ్ లోన్స్ రూ.83 కోట్లు, ఇతర రంగాలకు సంబంధించి రూ.2,738 కోట్లు కేటాయించామన్నారు. అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని సూచించారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద రూ.21 కోట్ల రుణాలివ్వాలన్నారు. సైబర్ మోసాలు, ఫేక్ ఓటీపీల వల్ల నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంత ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాల్లో పారిశ్రామిక కార్మికులను, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగస్తులను చేర్పించాలన్నారు. బ్యాంకర్లు, అధికారులు సమష్టిగా జిల్లా అభివృద్ధి కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఆర్బీఐ అధికారి సాయిచరణ్ , నాబార్డ్ ఏజీఎం అనంత్, ఎస్బీఐ ఏజీఎం రవిశేఖర్, యూబీఐ ఏజీఎం వంశీకృష్ణ, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు, కరీంనగర్ లోకల్ బ్రాంచి మేనేజర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్, మెప్మా పీడీ రవీందర్, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు



కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ శాఖలో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులందరూ ఐక్యంగా పోరాడుతూ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్‌లోని విద్యుత్ ఇంజినీర్స్ భవన్‌లో సమావేశమై, విద్యుత్ ఉద్యోగుల జేఏసీని ఏర్పాటు చేశారు. జిల్లా చైర్మన్‌గా సీహెచ్.భాస్కర్, కన్వీనర్‌గా నాయిని అంజయ్య, కో–చైర్మన్‌గా కె.శ్రీనివాస్, కో–కన్వీనర్‌గా సంపత్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.స్వామి, కె.సత్యమయ్య, కె.సత్యనారాయణ, సుధీర్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 24, 25, 28 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరుకావాలని, వచ్చే నెల 1, 2 తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలపాలని నిర్ణయించారు.

### కిడ్నాప్ కేసు నమోదు

మానకొండూర్: వెల్దికి చెందిన ఓ బాలిక ఈ నెల 13 నుంచి కనిపించడం లేదని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. బాధితురాలి తండ్రి మంగళవారం మానకొండూర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించామని, ఆచూకీ లభించలేదన్నారు.

### యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): కిష్టంపల్లెకు చెందిన సాగర్ల పవన్‌కుమార్(22) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్ తలకు బలమైన గాయమైంది. అప్పటినుంచి మానసిక స్థితి సరిగాలేక ఇంట్లోనే ఉంటున్నాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి, క్రిమిసంహారక మందు తాగి, పడిపోయాడు. కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోకి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కమాన్‌పూర్ ఎస్సై షేక్‌మస్తాన్ పేర్కొన్నారు.

### 3న మానకొండూర్‌లో రేవంత్‌రెడ్డి పాదయాత్ర

- డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

శంకరపట్నం: మార్చి 3న మానకొండూర్ నియోజకవర్గంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాత్‌సే హాత్ జోడో యాత్ర ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం కేశవపట్నంలో మంగళవారం నిర్వహించారు. అంతకుముందు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ను మండల అధ్యక్షుడు గోపగోని బస్వయ్య సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. హాత్ సే హాత్ జోడో యాత్ర తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లో సాగుతుందని, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, రైతులు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు బస్వయ్య, మహిళా అధ్యక్షురాలు పద్మ, జిల్లా నాయకురాలు కవ్వ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శివాలయంలో అన్నపూజ



కొత్తపల్లి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కొత్తపల్లి శివాలయం (శ్రీసీతారామాంజనేయ సహిత సాయిబాబా ఆలయం)లో శివలింగానికి రుద్రాభిషేకం, అన్నపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు వాసాలమర్రి నాగరాజుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

### విద్యార్థికి ఎంపీ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన గాజుల లక్ష్మి–శంకర్ దంపతుల కుమార్తె సంజనకు చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో సీటు వచ్చింది. అయితే ఆర్థిక ఇబ్బందులతో చదువుకునే పరిస్థితి లేకపోవడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను ఇటీవల కలిసి సాయం చేయాల్సిందిగా కోరారు. మంగళవారం ఎంపీ సంజయ్ పంపించిన రూ.20వేలను స్థానిక బీజేపీ నాయకులు గొలపల్లి ప్రవీణ్, న్యాత శ్రీధర్, శనిగరం మనోజ్‌లు విద్యార్థి సంజనకు అందజేశారు.

### అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌లోని హౌసింగ్ బోర్డుకాలనీలోని వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ ఆశ్రమంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్–బొమ్మకల్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు చింతల మనీష, కిషన్, ర్యాకం మోహన్, సంపత్, రాజేందర్, మారుతీశ్వర్, ఆశ్రమ నిర్వాహకుడు వీరమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### కో ఆప్షన్ సభ్యుడికి నివాళి



కేశవరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రామ పంచాయతీ సభ్యులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామ పంచాయతీ కో ఆప్షన్ సభ్యుడు బారాజు కేశవరెడ్డి మృతికి సంతాపంగా మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సర్పంచ్ మొగిలి మంజుల, ఉప సర్పంచ్ గుర్రాల మంగాదేవి. ఎంపీటీసీ భూక్య తిరుపతినాయక్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, మాజీ సర్పంచ్ సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### పార్టీ కోసం పాటుపడే వారికి గుర్తింపు

విద్యానగర్(కరీంనగర్): పార్టీ కోసం పాటుపడే వారందరికీ ఎంఐఎంలో గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్‌లో పార్టీ విస్తరణ, పార్టీ నిర్మాణత్మక ప్రక్రియలో పాలుపంచుకొని, పదవుల కోసం కాకుండా పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేసే కార్యకర్తలందరికీ అధిష్టానం గుర్తింపు ఉంటుందని అందుకు తానే నిదర్శనమన్నారు. అదేవిధంగా మీర్జా రహమత్ బేగ్ పార్టీ కోసం పని చేయడం వల్లనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ ప్రకటించిందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రహ్మత్‌బేగ్‌కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

### డీఎల్పీవో విచారణ

వీణవంక: మండలంలోని బొంతుపల్లి గ్రామ పంచాయతీలో డీఎల్పీవో లత విచారణ చేపట్టారు. జీపీ నిధులు అవకతవకలపై గ్రామానికి చెందిన చదువు జితేందర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పంచాయతీ పాలకవర్గం సమక్షంలో విచారణ నిర్వహించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు తెలిసింది.





## వైభవంగా శివకల్యాణం

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా నగరంలోని భగత్‌నగర్ భవానీ శంకర ఆలయంలో మంగళవారం శివ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి తరఫున సీహెచ్ రాజిరెడ్డి–శివాని, అమ్మవారి తరఫున రాములు–సుగుణ మాతాపితృలు స్థానీయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు సీహెచ్.రాజిరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు సమ్మిరెడ్డి, ఆర్.శ్రీనివాస్, సభ్యులు, భక్తులు తదితరలు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

# గడువులోపు గగనమే..!

- పంచాయతీ భవనాల నిర్మాణంలో జాప్యం
- కరీంనగర్ నియోజకవర్గంలో 11 భవనాలు మంజూరు
- ఒక్కో భవనానికి రూ.20 లక్షలు



శిథిలావస్థలో ఉన్న బొమ్మకల్ గ్రామపంచాయతీ భవనం

కరీంనగర్‌రూరల్: గ్రామ పంచాయతీల్లో పరిపాలనను మెరుగుపర్చేందుకు అవసరమైన మౌలిక వసతులపై దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కరీంనగర్ నియోజకవర్గంలోని 11 గ్రామపంచాయతీలకు కొత్త భవనాల నిర్మాణం కోసం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. కరీంనగర్ మండలంలో బొమ్మకల్, దుబ్బపల్లి, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, జూబ్లీనగర్, మందులపల్లి, కొత్తపల్లి మండలంలో బావుపేట, చింతకుంట, ఎలగందల్, ఖాజీపూర్, మల్కాపూర్ గ్రామపంచాయతీలున్నాయి. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఈ నిధులతో సర్పంచ్, కార్యదర్శి గదులు, స్టోర్ రూం, సమావేశ మందిరం, మరుగుదొడ్లను నిర్మిస్తారు.

**మార్చి నెలాఖరులోపు పూర్తయ్యేనా?**

కొత్త గ్రామపంచాయతీ భవనాలకు నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టేందుకు సర్పంచులు ముందుకు రావడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉపాధిహామీ పథకం కింద పెద్ద మొత్తంలో సీసీ రోడ్లకు నిధులు మంజూరు కాగా ఆ పనులను చేపట్టేందుకు సర్పంచులు ఆసక్తి చూపుతున్నారు. మార్చి నెలాఖరు వరకు ఉపాధి పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చివరి గడువు విధించింది. అయితే ఇప్పటివరకు కొత్త గ్రామపంచాయతీ భవనాల పనులను ఇంకా ఏ గ్రామంలో ప్రారంభించలేదు. గడువులోపు భవనాలను నిర్మిస్తేనే బిల్లులు మంజూరవుతాయని అధికారులు చెప్పుతున్నప్పటికీ సర్పంచులు ఆర్థిక సమస్యలతో ముందుకు రావడం లేదు. ప్రస్తుతం సర్పంచులందరూ సీసీరోడ్లను నిర్మించే పనుల్లో నిమగ్నమయ్యారు.

**ఉపాధి నిధులకు గడువు లేదు**

ఉపాధి హామీ పథకం నిధులకు నిర్ణీత గడువు లేదు. మార్చి నెలాఖరులోపు పనులను పూర్తి చేస్తే వెంటనే బిల్లు వచ్చే అవకాశముంటుంది. త్వరలోనే సర్పంచులతో మాట్లాడి అన్ని గ్రామపంచాయతీ భవనాల నిర్మాణపు పనులను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– రమణారెడ్డి, ఏఈ, పంచాయతీరాజ్

## చిత్ర కథ



### 'డస్ట్'బిన్ ఫుల్.. క్లీనింగ్ నిల్..

కరీంనగర్ నగర పాలక సంస్థ 19వ డివిజన్ పరిధిలోని విజయపురికాలనీ-శాతవాహన విశ్వ విద్యాలయం రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్ చెత్తతో నిండుకుంది. కొన్ని రోజులుగా ఆ చెత్తను తొలగించడంలో అలసత్వం వహిస్తుంటంతో చెత్త ఎక్కువై కిందపడుతోంది. ఆ చెత్తలో పందులు స్వైర విహారం చేస్తుండటంతో చెత్త చెల్లాచెదురుగా అవుతూ రోడ్డుపైకి వస్తోంది. ఈ డస్ట్‌బిన్ రోడ్డు పక్కన ఉండటం.. వాహనాల రద్దీ ఎక్కువవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. చెత్తను ఎప్పటికప్పుడు తీసేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు. - కొత్తపల్లి

### అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



కరీంనగర్‌రూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో అనువాద ఆవశ్యకత, అవకాశాలపై విస్తరణోపన్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ కవి, అనువాదకులు వారాల ఆనంద్ హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, లైబ్రేరియన్ మోహన్‌రావు, స్టాఫ్ సెక్రెటరీ రోజారమణి, ఏసీవో సుష్మ, తెలుగు శాఖాధిపతి కవిత, సునీత, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

### పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నగరంలోని కట్టరాంపూర్, తిరుమల్‌నగర్, కాకతీయ స్కూల్, అంబేడ్కర్ స్టేడియం నుంచి గౌతమినగర్ రోడ్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

### సమాచారం

**నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ**

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో బుధవారం నుంచి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు బొమ్మకల్ పశువైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. ఈనెల 22న బొమ్మకల్, ఎలబోతారం, 23న చేగుర్తి, నల్లగుంటపల్లి, 24న దుర్శేడ్, ఇరుకుల్ల, గోపాల్‌పూర్, 25న మొగ్దుంపూర్, చామనపల్లి, దుబ్బపల్లి, 27న చెర్లభూత్కూర్, వల్లంపహాడ్, 28న నగునూరు, జూబ్లీనగర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గొర్రెల కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### గౌరీశంకరాలయంలో హుండీల లెక్కింపు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పాతబజార్ గౌరీశంకరాలయ హుండీలను మంగళవారం లెక్కించగా రూ.3,73,092 ఆదాయం సమకూరింది. లెక్కింపులో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ప్రొద్దుటూరి శ్రీనివాస్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో ఉడుతల వెంకన్న, భక్తులు తదితరలు పాల్గొన్నారు.

## సమాన స్కాలర్‌షిప్ వర్తింపజేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కరీంనగర్: విద్యార్థులందరికీ సమాన స్కాలర్‌షిప్ వర్తింపజేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ఉచిత వసతి కల్పిస్తూ భోజన ఖర్చుల నిమిత్తం ప్రతినెలా ఒక్కో విద్యార్థికి రూ.1,500 ఖర్చు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు మాత్రం రూ.500 మాత్రమే ఖర్చు చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయం, కూలీ పనికి వెళ్లే వారి పిల్లలు ఉదయం సరైన తిండి తినక కళాశాలలకు వస్తారని అన్నారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే రూ.500 బస్‌పాస్‌కు మాత్రమే సరిపోతాయని, మధ్యాహ్న భోజనంకు డబ్బులు లేక సగం పూట మాత్రమే తరగతులు విని ఇంటికి వెళ్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు నెలకు రూ.2,000 స్కాలర్‌షిప్ చెల్లించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యను సీఎం కేసీఆర్‌కు వివరించి విద్యార్థులకు న్యాయం చేస్తానని తెలిపారు.

### ప్లంబర్ల సమ్మె విరమణ



శెట్టి వెంకన్నను సన్మానిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్) కరీంనగర్ జిల్లా ప్లంబర్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్, ప్లంబర్ మేస్త్రి అసోసియేషన్ ఆధ్వర్యంలో పది రోజులుగా చేస్తున్న సమ్మెను మంగళవారం విరమించినట్లు అసోసియేషన్ల నాయకులు తెలిపారు. నిత్యావసర ధరలు, కూలీల ధరలు పెరిగినందున సమ్మె చేపట్టి కొత్త ధరలు నిర్ణయించామన్నారు. కొత్త ధరలకు ఇంటి యజమానులు, బిల్డర్లు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్లంబర్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శెట్టి వెంకన్నను ప్లంబర్ మేస్త్రి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జంగ కొమురయ్య, సలీం, మల్లేశం, అబ్దుల్లా, రహీం, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్యంపై సమగ్ర సర్వే

చొప్పదండి: మండలంలోని సాంబయ్యపల్లిలో మంగళవారం పారిశుధ్యంపై సమగ్ర సర్వే నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యంకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఇళ్లలో వ్యర్థాలను గుర్తించాలని, ప్రజల సమక్షంలో పరిష్కారం కనుగొనాలని సూచించారు. తడిపొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై మాట్లాడారు. గ్రామపటం ద్వారా సమస్యలను గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, సర్పంచ్ కొత్తపల్లి రామక్రిష్ణ, ఎంపీవో రాజగోపాల్, ఏపీఎం నర్మద, ఏపీవో రాజు, రమేశ్, వేణుప్రసాద్, సురేందర్‌రెడ్డి, శ్రీధర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు



రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అజిత్‌రెడ్డి యూఎస్ఏ, రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 9, 10 తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. చదువు ప్రాముఖ్యత, స్టడీ స్కిల్స్, మెమోరీ టెక్నిక్స్‌పై మాస్టర్ ట్రైనర్ అనంతపద్మనాభస్వామి అవగాహన కల్పించారు. ఉత్తమ సామాజిక సేవా పురస్కార్ అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, కోట్రైనర్ బాశెట్టి శ్రావణి, గుర్రం రాజశేఖర్ గౌడ్, చిలుముల రమేష్, ప్రధానోపాధ్యాయులు మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పెండింగ్ పనులపై దృష్టి పెట్టాలి

హుజూరాబాద్‌రూరల్: గ్రామాల్లో పెండింగ్‌లో పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ రాణి, ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జీపీడీపీ నిధులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల వివరాలపై సమగ్ర ప్రణాళిక రూపొందిస్తే నిధుల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. పనులు నాణ్యతా ప్రమాణాల ప్రకారం జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

### ఇంటిపన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

మానకొండూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అల్గునూర్‌లో ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కార్పొరేటర్ సల్ల శారద తెలిపారు. పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. బుధవారం చేపల కాలనీ వద్ద ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని, బిల్ కలెక్టర్లు అందుబాటులో ఉంటారని, పన్ను బకాయిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## చిత్ర కథ

### మురుగు.. నిర్లక్ష్యపు పరుగు



ఈ చిత్రం చూసి వర్షం నీరనుకుంటే మురుగులో కాలేసినట్లే. గణేశ్‌నగర్ బైపాస్ రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం ప్రజలకు శాపంగా మారింది. మురుగు నీటిని తోడుతూ పక్కన గల కాలువకు మళ్లిస్తుండగా ఇదిగో ఇది పరిస్థితి. అటుగా వెళ్లేవారు ముక్కు మూసుకుంటేనే గానీ అడుగు వేయలేని దుస్థితి. ఇకనైనా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - కరీంనగర్ అర్బన్

### కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నమిలికొండ రమణాచార్యులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని రామచంద్రాపూర్, దేవుళ్లపురి కాలనీలోని పంచముఖ హనుమదీశ్వరస్వామి సన్నిధిలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠా కరపత్రాలను ఆలయంలో మంగళవారం జ్యోతిష్య, వాస్తు, ఆగమ శాస్త్ర పండితుడు నమిలికొండ రమణాచార్యులు ఆవిష్కరించారు. మార్చి 8, 9, 10 తేదీల్లో ప్రతిష్ఠా కార్యక్రమాలుంటాయని, భక్తులు పాల్గొని తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంకణాలు భాస్కర్‌రెడ్డి, దేవసాని కిరణ్‌కుమార్‌రెడ్డి, బోయినపల్లి పెర్మారావు, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, వెన్నం రాజిరెడ్డి, ముంజం సతీశ్, ఇండ్ల తిరుపతి, మంచికట్ల వెంకటేశ్వర్, జూలపల్లి సంపత్‌రావు, చెర్లకోల రామకృష్ణారెడ్డి, ఎడవెల్లి శంకర్, అర్చకుడు రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలపై గ్రామాల్లో కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ శక్తి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సీఎం కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలను బలోపేతం చేయాలని కోరారు. ఎరువులను సబ్సిడీపై రైతులకు అందిస్తున్న ఘనత కేంద్రానికే చెందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మండలాధ్యక్షుడు ఎం.సంతోశ్‌కుమార్, ఉప సర్పంచ్ కె. తిరుపతి, బండి మల్లన్న, సతీశ్, రమేశ్, ఎం.శ్రీనివాస్, అంజన్‌రెడ్డి, శివరామకృష్ణ, దాడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### విచారణ చేపట్టాలి

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధి సర్వే నంబర్ 417లోని రెండెకరాల 34 గుంటల మిగులు భూమిని రెవెన్యూ అధికారులు మోఖాపై విచారణ చేపట్టాలని ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దొబ్బల మధు, నాయకులు ఎల్లేష్‌కుమార్, కనకయ్య, నాంపెల్లి, రాజలింగం, కనకయ్య కోరారు. ఈసందర్భంగా గ్రామంలో మాట్లాడుతూ.. విచారణ చేయాలని నెల రోజుల క్రితం పాలకవర్గం తీర్మానం చేసి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఫలితంలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

### అ, ఆ ఆకృతిలో విద్యార్థులు



కరీంనగర్: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్‌లోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల విద్యార్థులు వినూత్న తరహాలో కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులందరూ అ, ఆ ఆకలిలో ప్రదర్శన చేసి అలరించారు. సంతోశ్‌రెడ్డి, శశిధర్, రాజురెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### 22న శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: మార్చి, ఏప్రిల్, మే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటిలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన మిగతా ఆర్జిత సేవా టికెట్లకు ఆన్‌లైన్ లక్కీడిప్ నమోదు ప్రక్రియ 22న ఉదయం 10 గంటల నుంచి 24న ఉదయం 10 గంటల వరకు ఉంటుంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి సేవను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.


చెన్నారంలో చెరకు తోటలను పరిశీలిస్తున్న చరణ్‌జిత్‌సింగ్, అధికారులు

### మా దేశానికి రండి.. భూమి కౌలుకిస్తాం

**చెరకు రైతుల సాగు విధానం భేష్.. ఫిజీ చక్కెర పరిశ్రమల శాఖ మంత్రి చరణ్‌జిత్ సింగ్**

నేలకొండపల్లి: 'చెరుకు రైతుల సాగు విధానం బాగుంది.. ఆసక్తి ఉన్న రైతులు మా దేశానికి వస్తే భూమి కౌలుకు ఇప్పిస్తాం.. ఇక్కడితో పోలిస్తే మా దేశంలో ఆదాయం ఎక్కువ వస్తుంది..' అని ఫిజీ చక్కెర పరిశ్రమల శాఖ మంత్రి చరణ్‌జిత్ సింగ్ చెప్పారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీని చరణ్‌జిత్ సింగ్, ఫిజి దేశ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చెరుకు సాగు, ధర, క్రషింగ్ వివరాలపై ఫ్యాక్టరీ ఎండీ నామా కృష్ణయ్యతో చర్చించారు. అనంతరం చెన్నారంలో చెరుకు పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చరణ్‌జిత్ సింగ్ మాట్లాడుతూ చెరుకు సాగు విధానం ఇక్కడ బాగుందని ప్రశంసించారు. రైతులు తమ దేశానికి వస్తే భూములు కౌలుకు ఇప్పిస్తామని ఆహ్వానించారు. అక్కడే ఓ రైతు ఆవులతో దుక్కిపాటు చేస్తుండగా... తమ దేశంలో గోవులను పూజిస్తామని, వ్యవసాయం చేయమని స్పష్టం చేశారు. మంత్రి వెంట ఫిజీ కార్యదర్శి ఈలా, ప్రభుత్వ సీఈవో విమల్‌దత్, మధుకాన్ సీజీఎం కోటయ్య తదితరులున్నారు.

# సంక్షేమ సర్కారు ఆదర్శ పాలన

**వీడ్కోలులో ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసలు**

సాక్షి, అమరావతి: సమాజంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శప్రాయమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారని అభినందించారు. రాజకీయ నేతల అంతిమ లక్ష్యం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సమాజ శ్రేయస్సే కావాలని, ముఖ్యమంత్రి జగన్ దీన్ని ఆచరణలో చూపిస్తున్నారని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న విశ్వభూషణ్ హరిచందన్‌కు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విజయవాడలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ గవర్నర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ''రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటం సంతోషదాయకం. సమాజంలో ఏ వర్గాన్ని విస్మరించకుండా సంక్షేమ పథకాలను అందిస్తుండటం నిజంగా అబ్బురం. వీటిపై మేం చాలాసార్లు చర్చించుకున్నాం. ఇన్ని సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు అన్ని నిధులు ఎలా సమకూరుస్తున్నారని ముఖ్యమంత్రి జగన్‌ను అడిగితే అంతా దేవుడి ఆశీర్వాదమని వినమ్రంగా బదులిచ్చారు'' అని గవర్నర్ చెప్పారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించి రాజ్యాంగ విలువలకు పెద్దపీట వేశారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.


గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

# సీఐపై దాడి కేసులో 11 మంది టీడీపీ నేతల అరెస్ట్

- టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి ఆస్పత్రికి, 10 మంది జైలుకు..
- టీడీపీ వారిపై మూడు, ఎమ్మెల్యే అనుచరులపై ఒక కేసు నమోదు


దాడిలో గాయపడిన సీఐ కనకారావు

గన్నవరం / నాగాయలంక (అవనిగడ్డ) / కోనేరు సెంటర్: కృష్ణాజిల్లా గన్నవరంలో విధి నిర్వహణలో ఉన్న సీఐ పి.కనకారావును కులం పేరుతో దూషిస్తూ, రాళ్లతో కొట్టి గాయపరిచిన కేసులో టీడీపీ నేతలకు కోర్టు రిమాండ్ విధించింది. వీరిలో టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని ప్రభుత్వాస్పత్రికి, పదిమందిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. గన్నవరంలో సోమవారం టీడీపీ నేతలు సృష్టించిన ఘర్షణకు సంబంధించి పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. వీటిలో మూడు టీడీపీ నేతలు, కార్యకర్తలపై.. ఒకటి ఎమ్మెల్యే అనుచరులపై నమోదైంది. పట్టాభి తనను కులం పేరుతో దూషించడమేగాక ఆయనతోపాటు దొంతు చిన్నా, జాస్తి వెంకటేశ్వరరావు మరో ఎనిమిది మంది తనను రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపర్చడంతోపాటు చంపేవిధంగా అనుచరులను ప్రేరేపించారని సీఐ కనకారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభి తదితరులపై అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే వంశీమోహన్ అనుచరులు యతేంద్రరామకృష్ణ, మోహన్‌రంగా తదితరులు తమ ఇంటికి వచ్చి బెదిరించినట్లు టీడీపీ నేత దొంతు చిన్నా భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. టీడీపీ నేతలు పట్టాభి, చిన్నా, వీరంకి గురుమూర్తి, లావు వంశీకృష్ణ, జాస్తి ఆదిశేషు, లావు వంశీకృష్ణ, చల్లగుళ్ల సందీప్, గురివిందగుంట దేవేందర్, ముప్పరాజు కార్తీక్, గుజ్జర్లపూడి బాబూరావు, కంచర్ల సూర్యప్రకాష్‌లను అరెస్ట్‌చేసి మంగళవారం స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. పట్టాభి తనను పోలీసులు కొట్టినట్లు ఆరోపించడంతో ఆయనకు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యచికిత్స చేసిన తర్వాత రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపరచాలని జడ్జి బి.శిరీష పోలీసులను ఆదేశించారు. మిగిలిన పదిమందికి రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు పట్టాభిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి, మిగిలినవారిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు.

**పోలీసులతో పట్టాభి భార్య వాగ్వాదం**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పట్టాభి ఇంటివద్ద మంగళవారం ఆయన భార్య చందన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించిన ఆమె నిరపరాధి అయిన తన భర్తను విడుదల చేయకపోతే డీజీపీ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించటంతో పోలీసులు అభ్యంతరం చెప్పారు. దీనిపై ఆమె పోలీసులతో పరుష పదజాలంతో వాగ్వాదానికి దిగారు.

**టీడీపీ నేతల దౌర్జన్యం**

గన్నవరం ఘటనకు సంబంధించి మచిలీపట్నం, నాగాయలంకల్లో సోమవారం అర్ధరాత్రి టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగి, పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. గన్నవరం నుంచి తొమ్మిదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు మచిలీపట్నంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో గన్నవరం టీడీపీకి చెందిన ఒక న్యాయవాది తొమ్మిదిమంది అనుచరులతో అక్కడికి వెళ్లి భద్రత విధుల్లో ఉన్న సిబ్బందిపై దౌర్జన్యం చేసి పోలీసులు నిర్బంధించిన తొమ్మిదిమంది నాయకులు, కార్యకర్తలను కార్లలో తప్పించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ జాషువ వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది జీపీఎస్ ద్వారా తప్పించుకున్న వారిని వెంబడించి నిమిషాల వ్యవధిలో న్యాయవాదితో సహా అందరినీ పట్టుకుని బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ వాణి ఫిర్యాదు మేరకు మొత్తం 19 మందిపై కేసు నమోదు చేశారు. గన్నవరం ఘటనకు సంబంధించి పోలీసులు అదుపులోకి తీసుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సోమవారం అర్ధరాత్రి నాగాయలంక పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆయన అనుచరులు, స్థానిక టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. బోడెని చూసేందుకు అనుమతించాలంటూ సీఐ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగారు. టీడీపీ మహిళా నేత తలశిల స్వర్ణలత, కొందు తెలుగు తమ్ముళ్లు సచివాలయ మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా మాట్లాడారు. బోడె ప్రసాద్‌ను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

**రెచ్చగొట్టి మరీ రచ్చ రచ్చ**
గన్నవరం ఘటనలో బరితెగించిన టీడీపీ
వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రంలో భారీ లోపం

- 800 మెగావాట్ల తొలి యూనిట్ సిద్ధమైనా ట్రయల్ రన్ వాయిదా
- నాసిరకం రీహీటర్ ట్యూబ్స్ లీకేజీయే కారణం
- 7,500 చోట్ల మరమ్మతులు అవసరం.. వాటి పూర్తికి మరో నెల సమయం
- మార్చి చివరిలో తొలి యూనిట్‌లో ఉత్పత్తికి అవకాశం
- జూలైలో రెండో యూనిట్‌లో ఉత్పత్తికి ప్రణాళికలు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండంలో 1600 (2x800) మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో భారీ లోపం బయటపడింది. విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల తొలి యూనిట్ నిర్మాణం పూర్తయినా బాయిలర్‌లోని రీహీటర్ ట్యూబ్స్ విఫలం కావడంతో గత డిసెంబర్‌లో జరగాల్సిన ట్రయల్ రన్ వాయిదా పడింది. మరమ్మతుల్లో భాగంగా ఈ గొట్టాలకు లోపాలున్న చోట కట్ చేసి వెల్డింగ్ చేస్తున్నారు. ఏకంగా 7,500 చోట్ల వెల్డింగ్ చేస్తున్నారని, ఇందుకు మరో నెల రోజుల సమయం పట్టనుందని అధికార వర్గాలు తెలిపాయి. ఆలోగా మరమ్మతులు పూర్తయితే మార్చిలో తొలి యూనిట్ ద్వారా ప్రయోగాత్మకంగా విద్యుదుత్పత్తి జరిపి ట్రయల్ రన్ నిర్వహించే అవకాశాలున్నాయి.

**రీహీటర్ ట్యూబులే కీలకం**

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో హై ప్రెషర్, ఇంటర్మీడియేటరీ ప్రెషర్, లో ప్రెషర్ టర్బైన్లు ఉంటాయి. బాయిలర్లలో వేడిచేసిన నీళ్లు ఆవిరిగా మారి 600 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రత, భారీ పీడనంతో గొట్టాల ద్వారా 'హైప్రెషర్ టర్బైన్'లోకి ప్రవేశించి దాన్ని తిప్పుతూ మళ్లీ వెనక్కి మళ్లుతుంది. బాయిలర్‌లోకి తిరిగి చేరే సమయానికి ఆవిరి ఉష్ణోగ్రత 300 సెంటిగ్రేడ్‌లకు పడిపోతుంది. రీహీటర్ ట్యూబ్స్‌లో మళ్లీ 600 సెంటిగ్రేడ్‌లకు వేడెక్కిన తర్వాత 'ఇంటర్మీడియేటరీ ప్రెషర్ టర్బైన్'లోకి గొట్టాల ద్వారా ఆవిరి ప్రవేశించి దాన్ని తిప్పుతూ చివరకు 'లో ప్రెషర్ టర్బైన్ 'లోకి చేరుతుంది. అక్కడ చల్లబడిన ఆవిరి మళ్లీ బాయిలర్‌లోకి నీళ్ల రూపంలో ప్రవేశిస్తుంది. మళ్లీ ఆవిరిగా మారి 'హై ప్రెషర్ టర్బైన్'లోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రక్రియ అంతా ఒక లూప్‌గా జరుగుతుంది. నీళ్లు రీసైకిల్ అవుతూ ఉంటాయి.



**నాసిరకం గొట్టాలతో సమస్యే**

ఆవిరి టర్బైన్లను తిప్పడం ద్వారా వెలువడే యాంత్రికశక్తిని ఎలక్ట్రిక్ జనరేటర్ విద్యుచ్ఛక్తిగా మార్చుతుంది. ఈ ప్రక్రియలో కీలకమైన 'రీహీటర్ ట్యూబ్స్'లో నాణ్యత లేకుంటే అవి 600 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలతోపాటు తీవ్ర పీడనాన్ని తట్టుకోవడం సాధ్యం కాదు. నాసిరకం ముడిసరుకుతో తయారైన గొట్టాలు తరచూ కోతకు గురికావడం, తుప్పుపట్టడం జరుగుతుందని నిపుణులు అంటున్నారు. దీంతో ఆవిరి ఉష్ణోగ్రతలు పడిపోయి విద్యుదుత్పత్తి నిలిచిపోతుందని చెబుతున్నారు. రీహీటర్ ట్యూబ్స్‌లో వచ్చే సమస్యలతోనే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి అధిక శాతం అంతరాయాలు కలుగుతాయి. దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకున్న గొట్టాలను ఎన్టీపీసీ వినియోగించినా విఫలం కావడంపట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి వెల్డింగ్ చేసి మరమ్మతులు చేసినా భవిష్యత్తులో అవి మళ్లీ విఫలమయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. రీహీటర్ గొట్టాలకు లీకేజీలతో గత డిసెంబర్‌లో నిర్వహించాల్సిన తొలి యూనిట్ సింక్రనైజేషన్ ప్రక్రియ వాయిదా పడింది.

**నిర్మాణ జాప్యంతో రాష్ట్రంపై భారం**

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని తొలి యూనిట్ నుంచి 2020 జూన్‌లో, రెండో యూనిట్ నుంచి 2020 నవంబర్ నాటికి వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తి (సీఓడీ) ప్రారంభం కావాల్సి ఉంది. కానీ నిర్మాణంలో జాప్యంతో తొలి యూనిట్ గడువును 2023 మార్చి, రెండో యూనిట్ గడువును 2023 జూలైకు ఎన్టీపీసీ పొడిగించింది. రీహీటర్ ట్యూబ్స్ విఫలం కాకుంటే గత జనవరి నాటికి తొలి యూనిట్, మార్చి నాటికి రెండో యూనిట్ అందుబాటులోకి వచ్చేదని అధికార వర్గాలు తెలిపాయి. వేసవి విద్యుత్ అవసరాల కోసం ప్రస్తుతం రాష్ట్రం ఒక్కో యూనిట్‌ను సగటున రూ.7.20 ధరకు నిత్యం రూ.60 కోట్ల విలువైన విద్యుత్‌ను ఎక్ఛ్సేంజీల నుంచి కొంటోంది. ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం సకాలంలో పూర్తై ఉంటే యూనిట్‌కు రూ. 5 ధరతో విద్యుత్ లభించేది. దీంతో అధిక ధర విద్యుత్ కొనుగోళ్ల భారం తప్పేదని, ప్రస్తుత ఫిబ్రవరిలోనే రూ.50 కోట్ల మేర ఆదా అయ్యేవని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

# అవార్డుల ఆస్పత్రి


కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ముజ్గి పీహెచ్‌సీకి రెండోసారి 'ఎన్‌క్వాస్'
- గతంలో కాయకల్ప అవార్డు సైతం..

నిర్మల్‌చైన్‌గేట్: అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి జాతీయ నాణ్యతా హామీ పత్రాలను అందిస్తోంది. ఇందులో భాగంగా 2022 ఏడాదికి నిర్మల్ రూరల్ మండలం పరిధిలోని ముజ్గి పీహెచ్‌సీకి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్) ధ్రువీకరణ పత్రం ప్రకటించింది.

**పరిగణనలోకి తీసుకున్న అంశాలు..**

ఆరోగ్య కేంద్రంలో అన్నిరకాల సేవలు అందుతున్నాయా, పరిశుభ్రత, కనీస వసతులు, రికార్డుల నిర్వహణ, ఇన్‌ఫెక్షన్ నియంత్రించే సేవలు, కేంద్రంలో అందే సేవలు, వాటి నాణ్యత, రాష్ట్ర, జాతీయస్థాయిలో సగటుతో పోల్చితే ఎలా ఉన్నాయి? ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలు ఇలా ప్రతీ అంశాన్ని పరిగణలోకి తీసుకుంటారు. రోగులకు సమాచారం తెలిపే బోర్డులు, శుభ్రత, ప్రహరీ, సిబ్బంది ప్రవర్తన, రోగుల సంతృప్తిస్థాయి లెక్కలోకి తీసుకుంటారు. బయటి రోగులు, ప్రసూతి గది, ఇన్‌పేషెంట్ విభాగాలు, ల్యాబ్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, సాధారణ పరిపాలన అంశాలను రాష్ట్ర, కేంద్ర బృందాలు తనిఖీ చేస్తాయి. 70 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన కేంద్రాలకు ఎన్-క్వాస్‌కు సిఫారసు చేస్తాయి. కేంద్రం వాటిని పరిశీలించి ధ్రువీకరణ పత్రం అందిస్తుంది.

**వరుస అవార్డులు....**

నిర్మల్ రూరల్ మండలం ముజ్గి పీహెచ్‌సీ వరుసగా అవార్డులు చేజిక్కించుకుంది. గతంలో కాయకల్ప అవార్డు సొంతం చేసుకోగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎన్ క్వాస్ అవార్డుల్లో 78.4 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధిచి వరుసగా రెండోసారి ఎన్ క్వాస్ అవార్డు కూడా సొంతం చేసుకుంది.

**కౌటాల పీహెచ్‌సీకి..**

కౌటాల(సిర్పూర్): కుమురంభీం జిల్లా కౌటాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్ పొందినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి నవత తెలిపారు. గతేడాది నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం అధికారులు మీనా మిట్టల్, రాబిన్ చరణ్ పీహెచ్‌సీని పరిశీలించారు. వైద్యసేవలు, సాధారణ కాన్పులు, ఓపీ, ఇన్‌పేషెంట్, ఆస్పత్రిలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, వైద్యుల పనితీరు, ప్రసూతి గది, ఫార్మసి, ల్యాబ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన సేవలు అందుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా క్వాలిటీ సర్టిఫికెట్ అందించినట్లు వైద్యాధికారి తెలిపారు. పీహెచ్‌సీ 83.6 మార్కులు పొందినట్లు పేర్కొన్నారు. ఈ సర్టిఫికేషన్‌తో పీహెచ్‌సీకి ప్రత్యేక నిధులు విడుదల చేసి, అభివృద్ధికి ప్రభుత్వం సాయమందిస్తుందన్నారు.

**అన్ని పీహెచ్‌సీలకు వచ్చేలా కృషి**

నిర్మల్ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలకు ఎన్ క్వాస్ ప్రమాణాలు ఉండాలన్నది లక్ష్యం. ధ్రువీకరణ కోసం దశల వారీగా ప్రతిపాదనలు పంపాం. నిర్మల్‌రూరల్ మండలం ముజ్గి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి జాతీయ నాణ్యత ప్రమాణాల పత్రానికి ఎంపికైంది. జిల్లాలో మరిన్ని పీహెచ్‌సీలకు నాణ్యత ప్రమాణ పత్రాలు వచ్చేలా కృషి చేస్తాం .
–డాక్టర్ ధనరాజ్, డీఎంహెచ్‌వో, నిర్మల్

# కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

- గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్
- అలుగునూర్ చౌరస్తా నుంచి కరీంనగర్ కలెక్టరేట్ వరకు ర్యాలీ


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

కరీంనగర్: గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సఫాయి కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అలుగునూరు చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, గ్రామపంచాయతీ సిబ్బందికి కార్మిక చట్టాలు వర్తించకుండా కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని కార్మిక సంఘాలు ఎంతోకాలంగా పోరాడుతుంటే ప్రధాని మోదీ ప్రభుత్వం రోజుకు 178 రూపాయలుగా వేతనం నిర్ణయించిందని విమర్శించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా మల్టీపర్పస్ విధానంతో అదనపు పనిభారం మోపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈ నెల 28న రాజధానిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో నారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, నగర అధ్యక్షుడు కవ్వంపల్లి రవి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆహార భద్రత' పకడ్బందీగా అమలు చేయాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ కె.తిరుమల్‌రెడ్డి
- పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ
- వైద్యాధికారులు, సిబ్బంది తీరుపై ఆగ్రహం


రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్ కె.తిరుమల్‌రెడ్డి

గుడిహత్నూర్: ఆహార భద్రత చట్టం, ఇతర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పకడ్బందీగా అమలు చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ కె.తిరుమల్‌రెడ్డి పలు శాఖల అధికారులను హెచ్చరించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కేసీఆర్ కిట్ పథకం అమలుపై అవగాహన లేకపోవడంతో స్థానిక వైద్యాధికారిపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఆర్డీఏ కిషన్‌కు పలు సూచనలు చేశారు. ఆహార భద్రత కమిషన్‌కు సంబంధించి ప్రతీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో వాల్‌పోస్టర్లను ప్రదర్శించాలని సూచించారు. దీంతోపాటు సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. కేసీఆర్ కిట్‌కు సంబంధించి విడతల వారీగా వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. పథకానికి సంబంధించి ఆశ కార్యకర్తల వద్ద సమాచారం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాన్ని నీరుగారుస్తున్నట్లు అర్థమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మన్నూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

## పునరావాస కాలనీ పనులు పూర్తి చేయాలి

- పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియల్
- కవ్వాల్ టైగర్‌జోన్‌లో పర్యటన

కడెం/జన్నారం: నిర్మల్ జిల్లా కడెం మండలం రాంపూర్, మైసంపేట్ గ్రామాల పునరావాస కాలనీ పనులను గడువులోగా పూర్తి చేయాలని పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియల్ అన్నారు. మంగళవారం ఆయన నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో పర్యటించారు. కడెం మండలం కొత్తమద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణం పరిశీలించారు. మూడు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ అవసరాల కోసం కొంత అటవీ భూమి కేటాయించాలని కొత్తమద్దిపడగ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కల్పకుంట, గంగాపూర్ వాచ్‌టవర్‌లను సందర్శించారు. సోమవారం రాత్రి జన్నారం చేరుకున్న ఆయన కామన్‌పల్లి వాచ్‌టవర్ వద్ద బస చేశారు. రాత్రి సఫారీ ద్వారా పలు ప్రాంతాల్లో పర్యటించారు. మైసమ్మకుంట, కామన్‌పల్లి వాచ్‌టవర్, బర్తన్‌పేట్ గ్రాస్‌ల్యాండ్, మైసమ్మకుంట, ఘనిశెట్టికుంట, గొండుగూడ బేస్‌క్యాంపు, బైసన్‌కుంట ప్రాంతాల్లో పర్యటించారు. చిరుతపులి, నీలుగాయి, చుక్కలదుప్పులను చూసి మురిసిపోయారు. గతంతో పోలిస్తే చాలా మార్పు జరిగిందని, పులి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. అడవుల అభివృద్ధి, స్మగ్లింగ్ నిరోధానికి తీసుకుంటున్న చర్యలు, పెట్రోలింగ్, సీసీ కెమెరాల నిర్వహణ, ఎంస్ట్రైప్ నిర్వహణ, తదితర అంశాలను ఎఫ్‌డీవో మాధవరావు వివరించారు. మంచిర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్, ఎఫ్‌డీవో మాధవరావు, రేంజ్ అధికారి హఫీజొద్దీన్, డీఎఫ్‌వో సునీల్ హీరామత్, ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, ఎఫ్ఆర్వో అనిత తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియల్

# ఎల్లంపల్లి నీటిని విడుదల చేయండి


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

గంగాధర(చొప్పదండి): ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయాలని చర్లపల్లి, లక్ష్మీదేవిపల్లితోపాటు పలు గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ ధర్నాకు బీజేపీ నాయకులు సంఘీభావం వ్యక్తం చేశారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసి దిగువ ప్రాంత పొలాలను కాపాడాలని నెల రోజులుగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత వర్షాకాలంలో నారాయణపూర్, గంగాధర చెరువులకు గండ్లు పడితే ఇప్పటివరకు మరమ్మతు చేయలేదని అన్నారు. నారాయణపూర్ చెరువులోని మట్టిని తరలించడానికి అనుమతులిస్తున్న స్థానిక ఎమ్మెల్యే చెరువులోకి నీటిని పంపింగ్ చేయించడంపై పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయకుంటే రైతులు నష్టపోతారన్నారు. నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రైతులతోపాటు బీజేపీ నాయకులు దూళం కళ్యాణ్‌కుమార్, వైద రామానుజం, వినయసాగర్, ఇనుకొండ నర్సింహారెడ్డి, పొన్నం పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ పరిహారం ఇస్తాం**

నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో నష్టపోతున్న బాధితులందరికీ సర్వే ప్రకారం పరిహారం చెల్లిస్తామని, మరమ్మతు పనులు చేయడాన్ని అడ్డుకోవద్దని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. నారాయణపూర్ చెరువులోకి వచ్చే ఎల్లంపల్లి నీటిని గంగాధర చెరువులోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయడానికి వచ్చిన అధికారుల వాహనాలను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. చెరువు కట్ట తెగి పంటలు నష్టపోయామని, వ్యవసాయ భూములన్నీ దెబ్బతిన్నాయని పరిహారం చెల్లించే వరకు పనులు చేయనిచ్చేది లేదని భీష్మించారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడి రైతులకు డబ్బులు పంచుతున్న సర్కారు.. ఇక్కడి రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతులు పనులను అడ్డుకుంటున్న విషయం తెలిసి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ నారాయణపూర్ గ్రామానికి వచ్చారు. గ్రామస్తులతో మాట్లాడారు. చెరువు నింపితే జాలువారి ఇండ్లలోకి నీళ్లు వస్తాయని.. తమ సమస్యను పరిష్కరించి, నిర్వాసితులకు పరిహారం చెల్లించిన తరువాతే పనులు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. సేకరించే భూములకు, కోల్పోతున్న ఇండ్లకు పరిహారం చెల్లిస్తామని, మరమ్మతు పనులను అడ్డుకోవద్దని సూచించారు.

## ఎన్నికలెప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు కోరారు. మంగళవారం సుల్తానాబాద్‌లోని ఓ కల్యాణ మండపంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బుధవారం ఐతరాజుపల్లి రామాలయం నుంచి చేపట్టనున్న హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ, పల్లె పల్లెకూ విజ్ఞన్న అనే కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరిచిందని ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపుతోపాటు విద్యుత్ కోతల వల్ల వేసిన పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. రైతులకు రుణమాఫీ కాలేదని, బ్యాంకు అధికారులు వారిని ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తోపాటు నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని మండిపడ్డారు. సీనియర్ నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, దామోదర్‌రావు, అన్నయ్య గౌడ్, రాములు, రాజలింగం, సాయిరి మహేందర్, మండల శాఖ అధ్యక్షుడు చిలుక సతీశ్, పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
బుధవారం ॥ 22-2-2023

సుప్రసిద్ధ నటి హెలెన్ గొప్ప నాట్యగత్తెగా అందరికీ తెలుసు.
రచయిత సలీం భార్యగా,
సల్మాన్ ఖాన్ మారుతల్లిగా కూడా తెలుసు.
కాని ఆమెకు ఒక వెంటాడే గతం ఉంది.
తన కుమారుడు అర్బాజ్ ఖాన్ చేస్తున్న తాజా షోలో
ఆమె ఆ గతాన్ని గుర్తు చేసుకుంది.
ఆ జ్ఞాపకాలు కదిలించేవిగా ఉన్నాయి.


హెలెన్

● వెంటాడే గతం

# తొమ్మిది నెలలు నడిచాను

'నేను ఇవాళ ఈ స్థాయికి వచ్చానంటే, సినిమాల్లో నిలబడ్డానంటే దానికి మా అమ్మే కారణం. ఆమె చాలా ఆత్మస్థయిర్యం ఉన్న స్త్రీ' అని గుర్తు చేసుకున్నారు 84 ఏళ్ల హెలెన్. సాధారణంగా ఇంటర్వ్యూలకు దూరంగా ఉండే హెలెన్ నటుడు అర్బాజ్ ఖాన్ టాక్ షో 'ది ఇన్విన్సిబుల్స్'లో పాల్గొని మాట్లాడింది. ఆ సందర్భంగా తన బాల్యాన్ని, తల్లిని గుర్తు చేసుకుంది.

'మా అమ్మది బర్మా (మయన్మార్). నాన్న ఆంగ్లో ఇండియన్. నేను పెద్దదాన్ని. నా తర్వాత తమ్ముడు. చెల్లెలు. 1943లో అమ్మ గర్భంతో ఉండగా నాన్న చనిపోయాడు. అప్పుడే బర్మాను జపాన్ ఆక్రమించింది. అంతటా రెండో ప్రపంచ యుద్ధ మేఘాలు. బర్మాలో ఉండే పరిస్థితి లేదు. ఆ సమయానికి నాకు ఆరేళ్లు. అమ్మ నన్ను తమ్ముణ్ణి చెల్లెల్ని తీసుకుని ఇండియా వెళ్లడానికి ఎయిర్‌పోర్ట్‌కు వెళితే సరిగ్గా మేము వెళ్లే సమయానికి జపాన్ విమానాలు వచ్చి బాంబులు వేశాయి. ఇక విమానంలో వెళ్లే పరిస్థితి లేదు. దాదాపు 350 మంది నడక ద్వారానే ఇండియాకు బయలుదేరాం. అమ్మ ప్రెగ్నెంట్ అయినా భయపడక నన్ను, తమ్ముణ్ణి, చెల్లెల్ని తీసుకుని ఆ బిడారులో బయలుదేరింది. 9 నెలల పాటు నడిచాం. దారిలోని పల్లెల్లో కొంత మంది మాకు అన్నం పెట్టేవాళ్లు. బ్రిటిష్ సైనికులు కనిపించి తినడానికి ఇచ్చేవారు. దారిలో అమ్మకు అబార్షన్ అయ్యింది. చెల్లెలు చనిపోయింది. నేను, తమ్ముడు ఎముకల గూడుగా మారాం. ఇండియా చేరేనాటికి 350 మందిలో సగం మందిమే మిగిలాం. మేము మొదట అస్సాంకు తర్వాత కోల్‌కతాకు చేరాం. ఆ తర్వాతే బాంబే వచ్చి స్థిరపడ్డాం' అని చెప్పిందామె.

మరి సినిమా రంగానికి ఎలా వచ్చారు అని అర్బాజ్ అడగగా– 'బాంబేలో మేమున్న ఇంటి ఎదురుగా ఒక మణిపూరి డాన్సర్ ఉండేది. ఆమె దగ్గర అమ్మ నాకు మణిపురి నేర్పించింది. ఆ రోజుల్లో కుకూ అనే డాన్సర్ సినిమాల్లో ఫేమస్. ఆమెకు అమ్మతో స్నేహం కుదిరింది. ఆమెలా నేనూ డాన్సర్ అవ్వాలని అమ్మ అనుకుంది. కుకు నన్ను సినిమాల్లోకి గ్రూప్ డాన్సర్‌గా తీసుకెళ్లింది. దేవ్ ఆనంద్ నటించిన 'బారిష్' (1957)లోని 'మిస్టర్ జాన్ బాబాఖాన్' పాటతో ఐటమ్ గర్ల్‌గా మారాను. 'హౌరాబ్రిడ్జ్' (1958)లోని 'మేరా నామ్ చిన్ చిన్ చూ' పాటతో నాకు స్టార్‌డమ్ వచ్చింది' అని చెప్పిందామె.

'మా నాన్న (రచయిత సలీం ఖాన్)తో మీ స్నేహం ప్రేమ, పెళ్లి దాకా ఎలా దారి తీసింది' అని అర్బాజ్ అడగగా '1970లో నా ఆస్తి మొత్తం పోయింది (హెలెన్ మొదటి భర్త పి.ఎస్.అరోరా వల్ల). కోర్టు కేసుల్లో చిక్కుకున్నాను. ఆ సమయంలో మీ నాన్న నా ఇబ్బందిని గమనించి తాను రాసే సినిమాల్లో నాకు వేషాలు వచ్చేలా చూశాడు. అలా ప్రేమ ఏర్పడింది. పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడు నా కోసం ఆయన తన కుటుంబం నుంచి విడిపోయి రావడం నాకు ఏమాత్రం ఇష్టం లేదు. అందరూ కలసి ఉండేలా చూడమని గట్టిగా కోరాను. మీ అమ్మ (సల్మా ఖాన్), మీరు ఆ రోజుల్లో ఎక్కువ వేదన అనుభవించి ఉంటారు. నేనైతే మీ అమ్మకు ఎదురుపడటానికి కూడా భయపడేదాన్ని. ఏమైనా కొన్నాళ్లకు మీరంతా నన్ను యాక్సెప్ట్ చేశారు. నన్ను హెలెన్ ఖాన్‌గా గౌరవించారు. సల్మా, నేను మంచి ఫ్రెండ్స్ అయ్యాం. అర్పిత (సల్మాన్ చెల్లెలు) పెళ్లిలో శుభలేఖలో నా పేరు కూడా వేశారు. ఇంతకన్నా ఏం కావాలి?' అందామె. ●

తాము ఇష్టపడే వస్తువును కొనడానికి వెబ్‌సైట్లలోకి వెళ్లే యువతరం...
అక్కడ కనిపించే సుదీర్ఘమైన సమాచారాన్ని చదవడం బోర్‌గా ఫీలవుతున్నారు.
అలా అని వస్తువు గురించి పూర్తిగా తెలుసుకోకుండా కొనుగోలు చేయడానికి
ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో లైవ్ 'షాపర్‌టైన్‌మెంట్'ను ఇష్టపడుతున్నారు.
వెబ్‌సైట్లలో వన్‌సైడ్ కమ్యూనికేషన్ ఇష్టపడని వారికి లైవ్‌కామర్స్ యాప్‌లు దగ్గరయ్యాయి.

# షాపర్‌టైన్‌మెంట్‌కు స్వాగతం



యూత్ పల్స్

మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన 25 సంవత్సరాల కనిక షిండే యాక్టివ్ ఆన్‌లైన్ షాపర్. రియల్ టైమ్ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ కోసం లైవ్ స్ట్రీమింగ్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. ఇప్పుడు ఆమె నోట పదేపదే వినిపిస్తున్న మాట షాపర్‌టైన్‌మెంట్.

'షాపర్‌టైన్‌మెంట్‌లో షాప్‌కు వెళ్లి సరదాగా షాపింగ్ చేసిన అనుభూతి కలుగుతుంది. లిప్‌స్టిక్ నుంచి ఐ షాడోస్ వరకు మనం ఎంపిక చేసుకునే వస్తువుల విషయంలో స్పష్టత వస్తుంది. ఆ వస్తువులకు సంబంధించి సందేహాలకు వెంటనే సమాధానాలు దొరుకుతాయి' అంటుంది కనిక.

> ఇ–కామర్స్ ప్రపంచంలో కస్టమర్ రివ్యూలు కొనుగోలు ప్రక్రియలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే ఇవి కొన్నిసార్లు గందరగోళంగా మారి ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలోకి నెడతాయి. ఇలాంటి సమయంలోనే షాపర్‌టైన్‌మెంట్‌కు ప్రాధాన్యత పెరుగుతుంది.
> – హరిత, కోళికోడ్ (కేరళ)

నాసిక్‌లోని కనిక షిండే మాత్రమే కాదు మన దేశంలో చిన్న, పెద్ద పట్టణాలు అనే తేడా లేకుండా జెన్–జెడ్, మిలీనియల్స్ రియల్ టైమ్ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ కోసం 'షాపర్‌టైన్‌మెంట్'కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పుడది వారికి ప్యాషన్‌గా కూడా మారింది.

> వెబ్‌సైట్లలో కనిపించే సుదీర్ఘమైన సమాచారం చదవాలంటే బోర్‌గా ఉంటుంది. మనం కావాలనుకున్న వస్తువును కంటితో చూసి కొనుగోలు చేయడంలోనే మానసిక తృప్తి ఉంటుంది.
> – శాంతిస్వర, చెన్నై

చైనీస్ డిజిటల్ మార్కెట్‌లో పుట్టిన 'షాపర్‌టైన్‌మెంట్' (కాంబినేషన్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఇ–కామర్స్, వీడియో కంటెంట్) ట్రెండ్ ఇప్పుడు మన దేశంలోనూ హల్‌చల్ చేస్తోంది.

చైనాలో 'షాపర్‌టైన్‌మెంట్' అనేది పాపులర్ ట్రెండ్‌గా ఉంది. చైనాకు చెందిన దిగ్గజ షాపింగ్ ప్లాట్‌ఫామ్ 'టవ్‌భావ్' షాపర్‌టైన్‌మెంట్‌కు ఊపు ఇచ్చింది. అమ్మకాల్లో కొత్త చరిత్ర సృష్టించింది.

'ఇది కేవలం మరో మార్కెటింగ్ ట్రెండ్ కాదు. రిటైల్ ఇండస్ట్రీ ముఖచిత్రాన్ని మార్చే పరిణామం' అంటున్నారు విశ్లేషకులు.

చైనాలోని షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్స్ డౌయిన్, క్లైష్ 'షాపర్‌టైన్‌మెంట్' ట్రెండ్ దూసుకుపోవడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

యువతరాన్ని దృష్టిలో పెట్టుకొని చిన్నసంస్థల నుంచి పెద్ద సంస్థల వరకు 'షాపర్‌టైన్‌మెంట్'కు పెద్ద పీట వేస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్ ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ప్లాట్‌ఫాం 'మింత్రా' లైవ్ వీడియో స్ట్రీమింగ్ యాప్ లాంచ్ చేసింది.

2026 కల్లా 'షాపర్‌టైన్‌మెంట్' అమ్మకాలు గణనీయంగా పెరగనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ●

వైరల్

# నువ్వు సల్లగుండాలే




బ్రిటన్‌కు చెందిన జర్నలిస్ట్, టీవి ప్రెజెంటర్ తాను చేస్తున్న 'టైమ్‌లెస్ తమిళనాడు' టీవీ ప్రోగ్రామ్ కోసం తమిళనాడులోని మదురైలో అడుగు పెట్టింది. మదురై అద్భుత అందాల అనుభూతి నుంచి పూర్తిగా బయటికి రాకముందే మల్లెపూలు అమ్మే మహిళ రూపంలో ఆమెకు అపురూపమైన స్నేహం కలిసింది.

ఈవిడ మదురై తమిళ యాస ఆమెకు అర్థం కాకపోవచ్చు.

ఆవిడ బ్రిటీష్ ఇంగ్లీష్ ఈవిడకు అర్థం కాకపోవచ్చు... అయితే అదేమీ వారి స్నేహానికి అడ్డుగోడ కాలేదు. పూలమ్మ ఎలెక్స్‌కు జడ వేసి మల్లెపూలు పెట్టేది.

ఆ జడ చూసుకుని ఎలెక్స్ మురిసిపోయేది!

తన స్టైల్లో జోకులు చెప్పేది పూలమ్మ. అవి అర్థం కాక ఎలెక్స్ తెల్లముఖం వేసే లోపే దారిన పోయే దానయ్యలు తమకు తెలిసిన ఇంగ్లీష్‌లో ఎలెక్స్‌కు ఎక్స్‌ప్లెయిన్ చేసేవాళ్ళు.

మదురై నుంచి వెళ్లే క్రమంలో తన సెలబ్రిటీ పూలమ్మతో ఫొటోలు దిగింది ఎలెక్స్.

కథ ఇదే అయితే అది మదురైలో మాత్రమే ఆగిపోయి ఉండేది. అయితే ఎలెక్స్ స్వదేశానికి చేరుకున్న తరువాత పూలమ్మతో తాను ఉన్న చిన్న వీడియో క్లిప్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. తక్కువ సమయంలోనే ఈ క్లిప్‌కు 4.7 లక్షల వ్యూస్ వచ్చాయి.

ఈ వీడియో క్లిప్‌లో పెద్ద పెద్ద మాటలేవీ లేకపోవచ్చు. అయితే వారి భావోద్వేగాన్ని, అనుబంధాన్ని నెటిజనులు తమదైన శైలిలో వ్యాఖ్యానించారు.

'మల్లెపూలు అందమైనవి. మీ స్నేహం అంతకంటే అందమైంది' అన్నారు.

'గ్రేట్ క్రాస్ కల్చరలిజం' అంటూ వీరి స్నేహాన్ని ఆకాశానికెత్తారు!

తమిళనాడులోని సముద్రపు అందాలు, కొండలు, కోవెలల సౌందర్యం, తేయాకు తోటల పచ్చదనం, చల్లని మనసున్న హిల్ స్టేషన్‌ల గురించి చెబుతూ 'అద్భుతం' అన్నది ఎలెక్స్. అయితే వీరి వీడియో క్లిప్ మాత్రం సామాజిక మాధ్యమాల్లో మహా అద్భుతంగా మారింది! ●

# సినిమా

# వెయ్యి కోట్ల పఠాన్

● దేశవ్యాప్తంగా ఐదో స్థానం
● హిందీలో రెండో స్థానం




బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్నాడు 'పఠాన్'. షారుక్ ఖాన్ టైటిల్ రోల్‌లో నటించిన హిందీ స్పై ఫిల్మ్ 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దీపికా పదుకోన్, జాన్ అబ్రహాం ప్రధాన పాత్రలు పోషించగా, డింపుల్ కపాడియా, అశుతోష్ రాణా కీ రోల్స్ చేశారు. దాదాపు రూ. 250 కోట్ల బడ్జెట్‌తో యశ్‌రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది జనవరి 25న విడుదలైంది. ఫిబ్రవరి 20 (సోమవారం)కి 'పఠాన్' చిత్రం రూ. 1000 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వసూలు చేసినట్లు యశ్ రాజ్ ఫిలింస్ సంస్థ ప్రతినిధులు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించారు.

## దేశంలో 623.. విదేశాల్లో 377 కోట్లు

దేశవ్యాప్తంగా రూ. 623 కోట్ల గ్రాస్, ఓవర్‌సీస్‌లో రూ. 377 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను 'పఠాన్' రాబట్టిందని చిత్ర యూనిట్ పేర్కొంది. అలాగే సినిమా విడుదలైన తొలి దశలోనే రూ. 1000 కోట్ల గ్రాస్‌ను రాబట్టిన తొలి హిందీ చిత్రంగా కూడా 'పఠాన్' నిలిచిందని చిత్ర యూనిట్ చెబుతోంది. కాగా ఆమిర్ ఖాన్ హీరోగా నటించిన 'దంగల్' చిత్రం ఆల్రెడీ వెయ్యి కోట్లు వసూలు చేసిన హిందీ చిత్రంగా రికార్డుల్లో ఉంది. అయితే తొలిసారి రిలీజ్ చేసినప్పుడే ఈ ఫీట్ సాధించలేదట. ఆ తర్వాత కొన్ని నెలలకు చైనాలో రిలీజ్ చేశాక ఈ సినిమా వసూళ్లు జోరందుకున్నాయని, దీంతో 'దంగల్' వెయ్యి కోట్లు వసూలు చేసిన హిందీ చిత్రంగా నిలిచిందని బాలీవుడ్ టాక్.

ఇక విడుదలైన తక్కువ రోజుల్లోనే రూ. 250 కోట్లు వసూలు చేసిన తొలి హిందీ చిత్రం 'పఠాన్' అని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే 'దంగల్' తర్వాత హిందీలో వెయ్యి కోట్లు సాధించిన రెండో చిత్రం రికార్డ్ 'పఠాన్'దే. కాగా తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం రూ. 20 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది.

## ఐదో ఇండియన్ సినిమా

భారతీయ చిత్రాల్లో రూ. 1000 కోట్లు వసూళ్లను సాధించిన తొలి సినిమా రికార్డు ప్రభాస్ 'బాహుబలి: ది కన్‌క్లూజన్' దక్కించుకుంది. ఆ తర్వాత ఆమిర్ ఖాన్ 'దంగల్', ఎన్టీఆర్– రామ్‌చరణ్‌ల 'ఆర్ఆర్ఆర్', యశ్ 'కేజీఎఫ్' చిత్రాలు ఉన్నాయి. అయితే అత్యధిక వసూళ్ల పరంగా మాత్రం ఈ జాబితా కాస్త మారుతుంది. ఈ లెక్కల ప్రకారం 'దంగల్' (దాదాపు 2000 కోట్లు) తొలి స్థానంలో ఉండగా, ఆ తర్వాత 'బాహుబలి: ది కన్‌క్లూజన్' దాదాపు 1800 కోట్లు, కేజీఎఫ్: ఛాప్టర్ 2 దాదాపు 1200 కోట్లు, దాదాపు 'ఆర్ఆర్ఆర్' 1200 కోట్లు (ప్రస్తుతానికి జపాన్ వసూళ్లను కలుపుకుని... ఇంకా అక్కడ 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రదర్శితమవుతోంది) సాధించాయి.

## బాద్‌షా ఈజ్ బ్యాక్

'పఠాన్'కు ముందు షారుక్ ఖాన్ హీరోగా నటించిన చిత్రం 'జీరో' (2018). ఈ చిత్రం పరాజయాన్ని చవి చూసింది. దీంతో షారుక్ మరో చిత్రం ఒప్పుకోవడానికి చాలా టైమ్ తీసుకున్నారు. ఎన్నో కథలు విని ఫైనల్‌గా 'పఠాన్'కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. షారుక్ నిర్ణయం ఎంత కరెక్టో ఈ సినిమా వసూళ్లు చెబుతున్నాయని బాలీవుడ్ అంటోంది. అలాగే నాలుగేళ్ల తర్వాత ఈ బాలీవుడ్ బాద్‌షా బ్లాక్‌బాస్టర్ హిట్ సాధించడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ●

> నిజానికి 'పఠాన్' రూ. 970 కోట్ల (22 రోజులకు) గ్రాస్ సాధించిన సమయంలో వసూళ్లు కాస్త నెమ్మదించాయి. దీంతో సినిమా యూనిట్ టికెట్ ధరలను తగ్గించింది. ప్రముఖ మల్టీప్లెక్స్‌లలో ఒక రోజు మొత్తం రూ. 110కే టికెట్స్‌ను అమ్మారు. ఆ తర్వాత కూడా కొన్ని మల్టీప్లెక్స్‌లలో 'పఠాన్' సినిమా టికెట్ ధరలు కాస్త తగ్గి ఉన్నాయి. ఎప్పుడైతే టికెట్ ధర తగ్గిందో అప్పుడు ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. ఇదే వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరేందుకు దోహదపడిందని తెలుస్తోంది. అలాగే కార్తీక్ ఆర్యన్ హీరోగా నటించిన హిందీ చిత్రం 'సెహ్‌జాదా' (తెలుగు హిట్ 'అల.. వైకుంఠపురములో..' హిందీ రీమేక్) సినిమా ఫిబ్రవరి 10న విడుదల కావాల్సింది. కానీ 'పఠాన్'ని దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాని వారం రోజులు ఆలస్యంగా అంటే ఫిబ్రవరి 17న రిలీజ్ చేశారు. అయితే 'సెహ్‌జాదా' హిందీ బాక్సాఫీస్‌పై ప్రభావం చూపలేకపోయింది. కానీ ఈ సినిమా వారం రోజులు ఆలస్యంగా విడుదల కావడం మాత్రం బాక్సాఫీస్ పరంగా 'పఠాన్'కు కలిసొచ్చిందనే చెప్పాలి. అలాగే ఫిబ్రవరి 17న విడుదలైన హాలీవుడ్ మూవీ 'యాంట్ మ్యాన్' తాజా వెర్షన్ కూడా 'పఠాన్' కలెక్షన్స్‌ను ప్రభావితం చేయలేకపోయింది.

## ప్రముఖ ఎడిటర్ జీజీ కృష్ణారావు కన్నుమూత



ప్రముఖ ఎడిటర్ జీజీ కృష్ణారావు (87) మంగళవారం ఉదయం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుడివాడకు చెందిన జీజీ కృష్ణారావు చెన్నై నుంచి సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఎడిటర్‌గానే కాదు.. అసోసియేట్ డైరెక్టర్, ప్రొడక్షన్ డిజైనర్‌గానూ పని చేశారాయన. బాపు, ఆదుర్తి సుబ్బారావు, కె. విశ్వనాథ్, దాసరి నారాయణరావు, జంధ్యాల వంటి ఎందరో ప్రముఖ దర్శకుల చిత్రాలకు ఎడిటర్‌గా చేశారాయన. 'శంకరాభరణం, వేటగాడు, బొబ్బిలి పులి, సర్దార్ పాపారాయుడు, సాగర సంగమం, స్వాతిముత్యం, శుభలేఖ' వంటి దాదాపు 300 సినిమాలకు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు కృష్ణారావు. డైరెక్టర్ కె. విశ్వనాథ్‌తో కృష్ణారావుకు మంచి అనుబంధం ఉండేది. అందుకే ఆయన తెరకెక్కించిన దాదాపు అన్ని సినిమాలకు కృష్ణారావు పని చేశారు. విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'సప్తపది'కి కృష్ణారావు తొలిసారి నంది అవార్డు అందుకున్నారు. ఈ సినిమా నుంచే ఎడిటింగ్ విభాగంలో నంది అవార్డు ఇవ్వడం ప్రారంభమైంది. అనంతరం 'సాగర సంగమం, శుభ సంకల్పం' చిత్రాలకు కూడా నంది అవార్డులు సొంతం చేసుకున్నారాయన. కృష్ణారావుకి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బెంగళూరులోని తన కుమార్తె వద్ద ఉంటున్న ఆయన అక్కడే తుదిశ్వాస విడిచారు. జీజీ కృష్ణారావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. ''ఎడిటింగ్ శాఖకు గౌరవాన్ని తెచ్చిన వారిలో కృష్ణారావుగారు ఒకరు. ఆయన మరణంతో తెలుగు ఫిలిం ఎడిటర్స్ ఒక పెద్ద దిక్కును కోల్పోయారు'' అని తెలుగు ఫిలిం ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మార్తాండ్ కె. వెంకటేష్ ఓ ప్రకటన విడుదల చేశారు.

## రామ్‌చరణ్ ప్రెజెంట్స్....



మంగళవారం రామ్‌చరణ్ అమెరికా వెళ్లారు. ఎందుకంటే... హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో రామ్‌చరణ్ ఓ ప్రెజెంటర్‌గా ఉన్నారు. కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్ వేదికగా ఈ నెల 24న సిక్త్ హెచ్‌సీఏ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. నిర్వాహకుల ఆహ్వానం మేరకు రామ్‌చరణ్ అక్కడకు ఓ ప్రెజెంటర్‌గా వెళ్లారు. ఇక ఈ అవార్డుల జాబితాలో 'ఆర్ఆర్ఆర్' (రౌద్రం..రణం..రుధిరం)కు నాలుగు (బెస్ట్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ యాక్షన్ ఫిల్మ్, బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్) నామినేషన్స్ దక్కాయి. మరి.. అవార్డ్స్ వస్తాయా? అనేది చూడాలి.

## క్యారెక్టర్ ఉంటే తిరుగుండదు – రాజేంద్ర ప్రసాద్


● సోహైల్, కృష్ణారెడ్డి, రాజేంద్రప్రసాద్, మీనా, అచ్చిరెడ్డి, కల్పన

''యాక్టర్ కావటానికి నటన తెలిస్తే చాలు.. కానీ, సక్సెస్‌ఫుల్ యాక్టర్ కావాలంటే తప్పకుండా క్యారెక్టర్ కావాలి.. అది ఉంటే తిరుగుండదని ఈ తరం నటీనటులకు చెబుతున్నాను. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'' అని నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సోహైల్, మృణాళిని జంటగా రాజేంద్ర ప్రసాద్, మీనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'. ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో కె. అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించిన ఈ సినిమా మార్చిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ– ''వినోదం' సినిమా తర్వాత నేను చేసిన కంప్లీట్ కామెడీ మూవీ 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'. ప్రేక్షకుల నవ్వులు చూసేందుకు ఎదురు చూస్తున్నాను'' అన్నారు. మీనా మాట్లాడుతూ– ''రాజేంద్రప్రసాద్‌గారితో 30ఏళ్ల తర్వాత ఈ మూవీలో చేశాను. కృష్ణారెడ్డిగారితో సినిమా చేసే అవకాశం ఇన్నేళ్లకు కుదిరింది. తొలిసారి ఒక లేడీ ప్రొడ్యూసర్‌తో (కల్పన) పని చేయడం హ్యాపీ'' అన్నారు. ''ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు కె. అచ్చిరెడ్డి. ''ఈ సినిమాలో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు సోహైల్.

## విజిల్స్ వేసే సన్నివేశాలుంటాయి – శశిధర్ చావలి



''ఫ్యామిలీ అండ్ యూత్‌కి కనెక్ట్ అయ్యే సినిమా 'మిస్టర్ కింగ్'. సెకండ్ హాఫ్‌లో యూత్ విజిల్స్ వేసి చప్పట్లు కొట్టే సన్నివేశాలుంటాయి. క్లైమాక్స్ ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకట్టుకుంటుంది'' అని డైరెక్టర్ శశిధర్ చావలి అన్నారు. శరణ్ కుమార్, యశ్విక నిష్కల, ఊర్వీ సింగ్ హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'మిస్టర్ కింగ్'. బీఎన్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు శశిధర్ చావలి మాట్లాడుతూ– ''నా ఇష్టం' చిత్రంతో సహాయ దర్శకుడిగా నా ప్రయాణం మొదలుపెట్టాను. 'బాహుబలి 1'కి ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో చేశాను. ఆ తర్వాత విరించితో కలసి 'మజ్ను' సినిమాకి పని చేశాను. అనంతరం 'మిస్టర్ కింగ్' చాన్స్ వచ్చింది. మంచి క్యారెక్టర్ ఉన్న ఓ కుర్రాడి ప్రయాణమే ఈ చిత్రం. ప్రేమకు సంబంధించిన కథ. సామాన్య ప్రేక్షకుడు తనని తాను హీరోగా చూసుకునేలా హీరో పాత్ర ఉంటుంది. మిస్టర్ కింగ్ పాత్రకి శరణ్ చక్కగా సరిపోయాడు. బీఎన్ రావుగారు ఎక్కడా రాజీపడలేదు. మణిశర్మగారి నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది'' అన్నారు.

## అనుబంధాలు గుర్తుకొస్తాయి – 'దిల్' రాజు


● వేణు, 'దిల్' రాజు

''తెలంగాణకి చెందిన పల్లెటూర్లో జరిగే కథ 'బలగం'. మా సినిమా చూస్తే కుటుంబంలోని బంధాలు, అనుబంధాలు గుర్తొస్తాయి. వేణు చక్కగా తీశాడు. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని 'దిల్' రాజు అన్నారు. ప్రియదర్శి, కావ్య, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ముఖ్య పాత్రల్లో వేణు ఎల్దండి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు ప్రొడక్షన్స్ శిరీష్ సమర్పణలో హర్షిత్, హన్షిత నిర్మించారు.

## ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ – వెంకీ

''సార్'లాంటి సినిమాలు తీయడం ఆషామాషీ కాదు.. గుండె ధైర్యం కావాలి. ఇలాంటి ఒక మంచి చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు నమస్కరిస్తున్నాను'' అని నటుడు, దర్శక–నిర్మాత ఆర్. నారాయణ మూర్తి అన్నారు. ధనుష్, సంయుక్త మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'సార్' (తమిళంలో 'వాతి'). సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఆర్. నారాయణమూర్తి. ''సార్' కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్'' అన్నారు వెంకీ అట్లూరి. ''కె. విశ్వనాథ్‌గారిలా 'సార్' చిత్రంతో తనదైన ముద్రను ఆరంభించాడు వెంకీ'' అన్నారు తనికెళ్ల భరణి.


● వెంకీ, సంయుక్త, నాగవంశీ

## మొన్న నేను.. ఈరోజు గీత్! – విశ్వక్ సేన్


● గీత్, విశ్వక్ సేన్

''కష్టపడితే సక్సెస్ సాధిస్తాం. ఇందుకు ఉదాహరణ మేమే. మొన్న నేను ఇండస్ట్రీకి వచ్చాను.. ఈ రోజు గీత్ ఆనంద్ వచ్చాడు.. రేపు ఎవరో ఒకరు వస్తారు. 'గేమ్ ఆన్'ని ప్రేక్షకులు హిట్ చేయాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. గీత్ ఆనంద్ హీరోగా, నేహా సోలంకి, వాసంతి హీరోయిన్లుగా దయానంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఆన్'. వెంకటేశ్వరరావు కస్తూరి, సాక్షి రవి సమర్పణలో రవి కస్తూరి నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని విశ్వక్ సేన్ రిలీజ్ చేశారు. ''ఈ సినిమా నిరుత్సాహపరచదు'' అన్నారు దయానంద్. ''2023లో సౌత్ నుంచి వచ్చిన మంచి సినిమాల్లో 'గేమ్ ఆన్' తప్పకుండా ఉంటుంది'' అన్నారు గీత్ ఆనంద్. ''మా సినిమా కొత్త ట్రెండ్ సెట్ చేస్తుంది'' అన్నారు రవి కస్తూరి.

## పల్లెటూర్లో పరేషాన్

తిరువీర్, పావని కరణం జంటగా రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వంలో సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన చిత్రం 'పరేషాన్'. తెలంగాణలోని ఓ పల్లెటూరు నేపథ్యంలో సాగే ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ రిలీజ్ కార్యక్రమంలో తిరువీర్ మాట్లాడుతూ– ''ఈ సినిమా చాలా సహజంగా వుంటుంది'' అన్నారు. ''అందరం ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాం'' అన్నారు రూపక్ రోనాల్డ్‌సన్. ''ఇదొక ప్రత్యేకమైన సినిమా'' అన్నారు సిద్ధార్థ్.


● పావని, తిరువీర్



“నా జీవితంలో టెన్నిస్ ఎప్పటికీ అంతర్భాగంగా ఉంటుంది. అయితే టెన్నిస్ మాత్రమే జీవితం కాదు. ప్రొఫెషనల్ అథ్లెట్‌గా ఎదుగుతున్న సమయంలోనే అలా భావించాను. కాబట్టి ఏనాడూ ఓటమి భయం లేదు. ఓడితే మళ్లీ వచ్చి గెలవగలమనే ధైర్యంతోనే ఆడాను. పరాజయాలు నాపై ప్రభావం చూపలేదు. ఓడినప్పుడు కొద్దిసేపు బాధపడినా దాంతో ప్రపంచం ఆగిపోదని నాకు తెలును. డబుల్స్ కారణంగానే నాకు గుర్తింపు దక్కింది. దానికి నేను గర్విస్తున్నా. సింగిల్స్‌లోనూ మన దేశం నుంచి ఎవరికీ సాధ్యం కాని రీతిలో టాప్–30లోకి వచ్చాను కాబట్టి అదీ గొప్ప ఘనతే. మణికట్టుకు శస్త్రచికిత్సల తర్వాత సింగిల్స్‌లో ఆడటం ఇబ్బందిగా మారడంతో డబుల్స్‌కు మారాను తప్ప ఆడలేక కాదు. ఎక్కడైనా నంబర్‌వన్ అంటే చిన్న విషయం కాదు. ఒలింపిక్ పతకం లేకపోయినా నేను సాధించినదాంతో సంతృప్తిగా ఉన్నా. నేనో ట్రెండ్ సెట్టర్‌గా భావించడం లేదు. నాకు వచ్చిన, నచ్చిన రీతిలో ఆడుతూ పోయాను. ఆ క్రమంలోనే ఈ విజయాలన్నీ వచ్చాయి.”



# సలామ్ సానియా

## టెన్నిస్‌కు వీడ్కోలు పలికిన భారత స్టార్

### చివరి టోర్నీ దుబాయ్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఓటమి

సానియా మీర్జా అంటే మూడు డబుల్స్ గ్రాండ్‌స్లామ్, మూడు మిక్స్‌డ్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ మాత్రమేనా? సానియా మీర్జా అంటే 43 డబుల్స్ ట్రోఫీలు, 91 వారాలు వరల్డ్ నంబర్‌వన్ మాత్రమేనా? సానియా మీర్జా అంటే 20 ఏళ్ల పాటు టెన్నిస్ సర్క్యూట్‌లో ప్రొఫెషనల్‌గా కొనసాగడం మాత్రమేనా? వీటన్నింటికి సమాధానం ‘కాదు’ మాత్రమే!

మన దేశంలో అమ్మాయిలు క్రీడల్లో అడుగు పెట్టడమే అరుదుగా అనిపించిన సమయంలో సానియా టెన్నిస్‌ను ఎంచుకొని కొత్త బాటను వేసింది. తన ఆటను, తన సామర్థ్యాన్ని నమ్ముకొని ముందుకు వెళ్లింది. ఈ క్రమంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంది. ఆమె టెన్నిస్‌కే పరిమితం కాదు. భారత క్రీడలకే ఆమె ఒక ‘వండర్ ఉమన్’.



ఎన్నో ఏళ్లుగా మహిళల క్రీడలకు సంబంధించి ఉన్న మూసను సానియా బద్దలు కొట్టింది. ఆటతోనే కాకుండా అవసరమైతే మాటతోనూ తలపడింది. తన స్థాయి ప్లేయర్‌ను ఒక ‘ఎర’గా వేశారంటూ పురుషాధిక్య సమాజపు నైజాన్ని నేరుగా ప్రశ్నించింది. తన ఆటలో సంధించిన ఏస్‌ల తరహాలోనే మాటల్లో కూడా అంతే పదును చూపించింది.

ఎలాంటి టెన్నిస్ నేపథ్యం లేని నగరం నుంచి, సాంప్రదాయ కట్టుబాట్లతో కూడిన తన సొంత నేపథ్యం నుంచి వచ్చి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సింగిల్స్‌లో 27 వరకు, డబుల్స్‌లో నంబర్‌వన్ వరకు సానియా ఎదగగలిగింది. ఒక స్టార్‌గా, దిగ్గజంగా ఆటపై సానియా ముద్ర అసమానం. శ్రమించే తత్వం, పట్టుదలతో ఆమె సాధించిన ఘనతలు స్ఫూర్తిదాయకం.

సానియాకు పెద్ద సంఖ్యలో వీరాభిమానులున్నారు. వేర్వేరు కారణాలతో ఆమెను ద్వేషించే వారూ ఉన్నారు. కానీ అవునన్నా, కాదన్నా ఏ రూపంలోనైనా ఆమె గుర్తింపును మాత్రం ఎవరూ కాదనలేరు. దశాబ్ద కాలానికి పైగా భారత క్రీడల్లో ‘సానియా మానియా’ అన్ని చోట్లా కనిపించింది, వినిపించింది. ఆమె ఏం చేసినా అది వార్తగా నిలిచింది.

టెన్నిస్‌లో ఉచ్ఛస్థితికి చేరుతున్న సమయంలో వెంట నడిచి వచ్చిన వివాదాలను ఆమె లెక్క చేయలేదు. చాలా మందిలా కన్నీళ్లు పెట్టుకొని కుప్పకూలిపోలేదు... మొండిగా నిలబడింది. అంతే వేగంగా వాటికి తగిన రీతిలో జవాబిచ్చింది. ఎవరి కోసమో తాను మారలేదు, తాను అనుకున్నట్లు ఆడింది, ఆటను ఆస్వాదించింది, అద్భుతాలు చేసింది.

భారత టెన్నిస్ చరిత్రలో కేవలం ఐదుగురు మహిళలు మాత్రమే సింగిల్స్‌లో టాప్–200 వరకు రాగలిగారు. అందులో నలుగురు కనీసం వందో ర్యాంక్‌కు చేరువగా కూడా రాలేదు. అలా చూస్తే సానియా సాధించిన 27వ ర్యాంక్ విలువేమిటో అర్థమవుతుంది. దీంతో పాటు డబుల్స్‌లో శిఖరాన నిలిచి శాసించిన సానియా మీర్జా ఉజ్వల టెన్నిస్‌కు తెర పడింది.

**-సాక్షి క్రీడా విభాగం**



## అందని ఒలింపిక్ పతకం

సానియా కెరీర్‌లో ఎన్నో ఘనతలు ఉన్నా... ప్రతిష్టాత్మక ఒలింపిక్ పతకాన్ని మాత్రం ఆమె సొంతం చేసుకోలేకపోయింది. 2008, 2012, 2016, 2020ల్లో నాలుగు ఒలింపిక్స్‌లోనూ పాల్గొన్నా ఆమెకు అది లోటుగా ఉండిపోయింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రోహన్ బోపన్నతో కలిసి కాంస్య పతక పోరులో ఓడి నాలుగో స్థానం సాధించడమే ఆమె అత్యుత్తమ ప్రదర్శన. ఆసియా క్రీడల్లో 2 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలతో పాటు కామన్వెల్త్ క్రీడల్లో ఒక రజతం, ఒక కాంస్యం ఆమె గెలుచుకుంది.

## పట్టుదలతో పైపైకి...

సానియా మీర్జాకు 11 ఏళ్ల వయసు... హైదరాబాద్‌లోని ఒక కోర్టులో ఆమె సాధన కొనసాగుతోంది... అప్పటికి ఆమె రాకెట్ పట్టుకొని ఐదేళ్లవుతోంది. అయితే ఆమె కెరీర్‌పై తండ్రి ఇమ్రాన్ మీర్జాకు ఇంకా ఎలాంటి స్పష్టతా రాలేదు. సానియా ఏమాత్రం ఆడగలదు, అసలు పోటీ ప్రపంచంలో నిలబడగలదా, భవిష్యత్తు ఉంటుందా అనే సందిగ్ధత... అప్పటికే సన్నిహితులు కొందరు ‘మన అమ్మాయికి ఇలాంటి చిన్న స్కర్ట్‌లతో టెన్నిస్ అవసరమా’ అంటూ మాటలు విసురుతూనే ఉన్నారు. మరో మిత్రుడు వచ్చి ‘ఏంటి సానియాను మార్టినా హింగిస్‌ను చేద్దామనుకుంటున్నావా’ అంటూ వ్యంగ్య వ్యాఖ్య ఒకటి చేసి వెళ్లిపోయాడు. 16 ఏళ్ళ వయసుకే సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ గెలిచి హింగిస్ సంచలనం సృష్టించిన రోజులవి. అలాంటి మాటలతో ఒక దశలో ఇమ్రాన్‌లో ఆందోళన పెరిగింది. కానీ దానిని బయట పడనీయలేదు. తర్వాతి రోజుల్లో మార్టినా హింగిస్‌తోనే జత కట్టి వరల్డ్ నంబర్‌వన్ జోడీగా నిలవడంతో పాటు 14 డబుల్స్ టైటిల్స్ కలిసి సాధించడం విశేషం. సహజసిద్ధమైన ప్రతిభకు తోడు కష్టపడే గుణం, పట్టుదల, పోరాటతత్వం, ఓటమిని అంగీకరించని నైజం వెరసి సానియాను అగ్ర స్థానానికి చేర్చాయి. కెరీర్ ఆరంభంలో విమానాలకు పెద్దగా ఖర్చు పెట్టలేని స్థితిలో దేశవ్యాప్తంగా టోర్నీలు ఆడేందుకు ఆ కుటుంబం ఒక పాత కారును ఉపయోగించింది. అప్పుడు రోడ్డు ద్వారా ప్రయాణించిన దూరం ఎన్ని కిలోమీటర్లో కానీ... ఈ సుదీర్ఘ టెన్నిస్ ప్రయాణం మాత్రం వెలకట్టలేని విధంగా భారత క్రీడా చరిత్రలో నిలిచిపోయింది.

### జూనియర్ వింబుల్డన్ విజేతగా...



ఆటలో ఓనమాలు నేర్చుకున్న తర్వాత హైదరాబాద్‌లో చిన్న టోర్నీలు మొదలు జాతీయ స్థాయిలో కూడా వేర్వేరు నగరాల్లో జరిగే పోటీల్లో సానియా పోటీ పడింది. వెంటనే విజయాలు రాకపోయినా ఆమె ఆటలో ప్రత్యేకత ఉందని, దూకుడు కనిపిస్తోందని మాత్రం భారత టెన్నిస్ వర్గాల్లో చర్చ మొదలైంది. 13 ఏళ్ల వయసులో జాతీయ అండర్–14, అండర్–16 టైటిల్స్ గెలవడంతో సానియాకు అసలైన గుర్తింపు లభించింది. జూనియర్ స్థాయిలో ఆమె 10 సింగిల్స్, 13 డబుల్స్ టైటిల్స్ నెగ్గింది. ఆ తర్వాత అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోయేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు. 2003 వింబుల్డన్ టోర్నీలో జూనియర్ బాలికల డబుల్స్‌లో రష్యాకు చెందిన అలీసా క్లైబనోవాతో కలిసి సానియా విజేతగా నిలిచింది. ఈ గెలుపుతో ఆమె భారత టెన్నిస్‌లో కొత్త తారగా అందరి దృష్టిలో పడింది.

### సొంతగడ్డపై...



సరిగ్గా 20 ఏళ్ల క్రితం ఫిబ్రవరి 2003లో తన సొంత నగరంలో జరిగిన హైదరాబాద్ ఓపెన్‌లో వైల్డ్‌కార్డ్‌గా బరిలోకి దిగింది. అక్కడ తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైనా రెండేళ్ల తర్వాత ఇదే వేదికపై ఆమె తనకు కావాల్సిన ఫలితాన్ని అందుకుంది. ఇదే హైదరాబాద్ ఓపెన్‌లో విజేతగా నిలిచి సింగిల్స్‌లో డబ్ల్యూటీఏ తొలి టైటిల్ సొంతం చేసుకుంది. సానియా కెరీర్‌లో ఇదే ఏకైక సింగిల్స్ ట్రోఫీ. ఆపై మరో నాలుగు టోర్నీల్లో ఫైనల్ చేరినా, ఆమె రన్నరప్ స్థానానికే పరిమితమైంది.





### 27వ ర్యాంక్‌కు...

2005లో యూఎస్ ఓపెన్‌లో నాలుగో రౌండ్ వరకు చేరడంతో ‘డబ్ల్యూటీఏ న్యూ కమర్’గా గుర్తింపు తెచ్చుకున్న తర్వాత సింగిల్స్‌లో కొంత కాలం సానియా జోరు కొనసాగింది. టైటిల్స్ లేకపోయినా పలువురు అగ్రశ్రేణి క్రీడాకారిణులపై సాధించిన కొన్ని సంచలన విజయాలు ఆమె సత్తాను చూపించాయి. ముఖ్యంగా హార్డ్ కోర్టుల్లో ప్రదర్శనతో ఆమె ర్యాంక్ మెరుగవుతూ వచ్చింది. ఎట్టకేలకు 2007 ఆగస్టులో సానియా సింగిల్స్‌లో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానానికి చేరింది. ఇది ఆమె సింగిల్స్ కెరీర్‌లో అత్యుత్తమ దశ. అయితే ఆ తర్వాత దీనిని నిలబెట్టుకోవడంలో ఆమె విఫలమైంది. వరుస పరాజయాలు, మణికట్టు గాయాలు ఆమె సింగిల్స్ ఆటకు ప్రతిబంధకంగా మారాయి. దాంతో సింగిల్స్‌కు పూర్తిగా గుడ్‌బై చెప్పి డబుల్స్‌పైనే దృష్టి పెట్టాలని సానియా నిర్ణయించుకుంది. ఆమె తీసుకున్న ఈ కీలక నిర్ణయం భవిష్యత్తులో ఆమె కెరీర్‌కు కొత్త ఊపిరి పోసింది.

### డబుల్స్ స్టార్‌గా...



సొంతగడ్డపై హైదరాబాద్ ఓపెన్‌లోనే లీజెల్ హ్యూబర్ కలిసి డబుల్స్‌లోనూ తొలి టైటిల్ (2004) సాధించిన సానియా సింగిల్స్ నుంచి పూర్తిగా తప్పుకున్న తర్వాత వరుస విజయాలు అందుకుంది. మహిళల డబుల్స్‌లో 82 మందితో జత కట్టిన సానియా 17 మంది వేర్వేరు భాగస్వాములతో కలిసి ఏకంగా 43 డబ్ల్యూటీఏ టైటిల్స్ గెలవగలిగింది. వీరందరిలోనూ 70వ భాగస్వామి అయిన మార్టినా హింగిస్‌తో ఆమె అద్భుత ఫలితాలు సాధించింది. ఒక దశలో ఈ జోడీ ఓటమి అనేదే లేకుండా సాగింది. 2015–16 మధ్య కాలంలో వీరిద్దరు వరుసగా 41 మ్యాచ్‌లలో గెలుపొందడం పెద్ద విశేషం. గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో 14 మందితో ఆమె జోడీగా బరిలోకి దిగింది. ఇదే క్రమంలో 2015 ఏప్రిల్‌లో సానియా మొదటిసారి వరల్డ్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ‘వరల్డ్ నంబర్‌వన్’ స్థానానికి చేరింది.

### అమ్మగా మారాక...



హింగిస్‌తో కలిసి గెలిచిన 14 టైటిల్స్‌ను పక్కన పెట్టినా... ఇతర భాగస్వాములతో కలిసి సానియా ఖాతాలో 29 ట్రోఫీలు ఉన్నాయి. అయినా సరే సానియా–హింగిస్ జోడీ ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించింది. అగ్నికి వాయువు తోడైనట్లుగా సానియా అద్భుత ఫోర్‌హ్యాండ్, హింగిస్ బ్యాక్ హ్యాండ్ కలిసి ప్రత్యర్థులను పడగొట్టాయి. అయితే కారణాలేమైనా హింగిస్‌తో విడిపోయిన తర్వాత సానియాకు సంతృప్తికర ఫలితాలు రాలేదు. ఆ తర్వాత 4 టోర్నీల్లోనే ఆమె విజేతగా నిలిచింది. 2018 ఆరంభంలో గాయాలతో కొన్ని టోర్నీలకు దూరమైన సానియా అదే ఏడాది చివర్లో కొడుకు పుట్టడంతో టెన్నిస్‌కు నిరవధిక విరామం ఇచ్చింది. అయితే ఏడాదిన్నర తర్వాత మళ్లీ పూర్తి ఫిట్‌గా మారి పునరాగమనం చేసిన అనంతరం మరో రెండు టైటిల్స్ గెలవడం విశేషం. చివరకు ఈ ఏడాది జనవరిలో తన రిటైర్మెంట్ గురించి సానియా ప్రకటన చేసింది. దుబాయ్ ఓపెన్ తన ప్రొఫెషనల్ కెరీర్‌లో చివరి టోర్నమెంట్ అని ప్రకటించింది.

## పురుషాహంకారాన్ని ప్రశ్నిస్తూ...



కెరీర్ ఆరంభంలో వచ్చిన కీర్తికనకాదులతో పాటు పలు వివాదాలు సానియాతో నడిచొచ్చాయి. జాతీయ జెండాను అవమానించినట్లు వార్తలు, స్కర్ట్‌లపై ‘ఫత్వా’లు జారీ, మసీదులో షూటింగ్, కొన్ని అసందర్భ వ్యాఖ్యలు, ఆ తర్వాత పాకిస్తానీ అయిన షోయబ్ మలిక్‌తో వివాహం... ఇలాంటివన్నీ ఆమెను ఒక వివాదాస్పదురాలిగా చిత్రీకరించాయి. వీటి వల్ల ఆమె చాలా సందర్భాల్లో ‘నెగెటివ్’ వార్తల్లో నిలిచింది. వాటిపై వివరణలు ఇచ్చుకునేందుకు ఆమె చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. అయితే తర్వాతి రోజుల్లో తాను మరింత పరిణతి చెందానని, ఇలాంటివి పట్టించుకోవడం మానేశానని ఆమె చెప్పుకుంది. నిజంగా కూడా ఆపై కెరీర్ కీలక దశలో ఆమె తన ఆటతో మినహా మరే అంశంతోనూ ‘వార్త’గా మారలేదు. అయితే 2012 లండన్ ఒలింపిక్స్ సందర్భంగా రేగిన వివాదం సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలు మాత్రం సానియా వ్యక్తిత్వం గురించి చెబుతాయి. పురుషుల డబుల్స్‌లో లియాండర్ పేస్‌తో కలిసి బరిలోకి దిగేందుకు మహేశ్ భూపతి, రోహన్ బోపన్న నిరాకరించగా... విష్ణువర్ధన్‌ను ‘ఐటా’ ఎంపిక చేసింది. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జా తనతో కలిసి ఆడతానని హామీ ఇస్తేనే విష్ణుతో కలిసి బరిలోకి దిగుతానని పేస్ షరతు పెట్టాడు. ఈ విషయం తర్వాత తెలుసుకున్న సానియా దీనిని ‘పురుషాహంకారం’గా పేర్కొంది. పేస్ కోసం తనను ‘ఎర’గా వేశారంటూ విరుచుకుపడింది. వేర్వేరు సందర్భాల్లో కూడా ముక్కుసూటి జవాబులతో ఘాటుగా సమాధానాలు ఇవ్వడం సానియా శైలి. పెళ్లయిన ఆరేళ్ల తర్వాత కూడా ఇంకా ‘జీవితంలో స్థిరపడలేదేంటి’ అంటూ ఒక సీనియర్ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నపై... ‘నేను వరల్డ్‌నంబర్ కావడంకంటే తల్లిగా మారలేదేంటని మీరు అడుగుతున్నట్లున్నారు. నేనే కాదు ప్రతీ మహిళకు ఇలాంటి ప్రశ్నలే ఎదురవుతాయి. పెళ్లి చేసుకొని పిల్లల్ని కంటే తప్ప స్థిరపడినట్లు కాదా. నేను ఎన్ని గ్రాండ్‌స్లామ్ గెలిచినా వాటికి విలువ లేనట్లుంది’ అని తీవ్రంగా జవాబిచ్చింది.

## సానియా... ఓటమితో ముగింపు

తన ప్రొఫెషనల్ టెన్నిస్ కెరీర్ చివరి టోర్నీలో భారత స్టార్ సానియా మీర్జాకు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. మంగళవారం జరిగిన దుబాయ్ ఓపెన్ టోర్నీ మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సానియా మీర్జా (భారత్)–మాడిసన్ కీస్ (అమెరికా) జోడీ 4–6, 0–6తో వెరోనిక కుదెర్‌మెతోవా–లుద్మిలా సమ్‌సనోవా (రష్యా) ద్వయం చేతిలో ఓడిపోయింది. గంటపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా–కీస్ జోడీ తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయింది. తొలి రౌండ్‌లో ఓడిన సానియా–కీస్‌లకు 7,900 డాలర్ల (రూ. 6 లక్షల 54 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



### వ్యక్తిగతం...




1986 నవంబర్ 15న సానియా మీర్జా ముంబైలో పుట్టింది. 2010లో పాకిస్తానీ క్రికెటర్ షోయబ్ మలిక్‌ను వివాహం చేసుకున్న సానియాకు నాలుగేళ్ల కుమారుడు ఇజ్‌హాన్ ఉన్నాడు. ‘ఏస్ అగైనెస్ట్ ఆడ్స్’ పేరుతో ఆమె ఆటోబయోగ్రఫీ వచ్చింది. కెరీర్‌లో ఎన్నో కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించిన సానియా జీవితాన్ని సినిమాగా తీయాలని ప్రతిపాదనలు వచ్చినా అవి ఫలించలేదు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరు కలిసి ‘మీర్జా మలిక్ షో’ అనే చాట్ షోను సమర్పిస్తున్నారు. ఇది పాకిస్తాన్‌లోని ‘ఉర్దూ ఫ్లిక్స్’ ఓటీటీలో ప్రసారమవుతోంది. భారత ప్రభుత్వం ద్వారా అర్జున, ఖేల్‌రత్న, పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు ఆమె అందుకుంది.

### ఆ ఆరు గ్రాండ్‌స్లామ్‌లు...

**మహిళల డబుల్స్:** వింబుల్డన్ (2015), యూఎస్ ఓపెన్ (2015), ఆస్ట్రేలియన్ ఓపెన్ (2016; అన్నీ మార్టినా హింగిస్‌తో).

**మిక్స్‌డ్ డబుల్స్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ (2009), ఫ్రెంచ్ ఓపెన్ (2012; ఈ రెండూ మహేశ్ భూపతితో); యూఎస్ ఓపెన్ (2014; బ్రూనో సోరెస్‌తో).



### కెరీర్ రికార్డ్

**సింగిల్స్:** విజయాలు 271, పరాజయాలు 161

**డబుల్స్:** విజయాలు 536, పరాజయాలు 248

**కెరీర్ ప్రైజ్‌మనీ:** 72 లక్షల 65 వేల 246 డాలర్లు (రూ. 60 కోట్ల 20 లక్షలు)

**1** భారత్ నుంచి డబ్ల్యూటీఏ టైటిల్ (సింగిల్స్, డబుల్స్) గెలిచిన, గ్రాండ్‌స్లామ్ సింగిల్స్‌లో నాలుగో రౌండ్‌కు చేరిన, వరల్డ్ ర్యాంకింగ్ టాప్–50లో నిలిచిన, మహిళల గ్రాండ్‌స్లామ్ గెలిచిన, డబ్ల్యూటీఏ ఫైనల్స్ గెలిచిన, వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచిన తొలి భారత ప్లేయర్ సానియా మీర్జా.

---

# రుద్రాంక్ష్ పసిడి గురి



కైరో (ఈజిప్ట్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. మంగళవారం భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, ఒక కాంస్యం చేరింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్ పసిడి పతకం సాధించగా... మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో తిలోత్తమ సేన్ కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఫైనల్లో రుద్రాంక్ష్ 16–8తో మాక్సిమిలన్ ఉల్‌బ్రిచ్ (జర్మనీ)పై గెలిచాడు. ఎనిమిది మంది షూటర్లు పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో రుద్రాంక్ష్ 262 పాయింట్లు, ఉల్‌బ్రిచ్ 260.6 పాయింట్లు స్కోరు చేసి ఫైనల్‌కు అర్హత సాధించారు. మిరాన్ మారిసిచ్ (క్రొయేషియా; 260.5 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకున్నాడు. 74 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో రుద్రాంక్ష్ 629.3 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచి ర్యాంకింగ్ రౌండ్‌కు చేరాడు. టాప్–8లో నిలిచిన షూటర్లు ర్యాంకింగ్ రౌండ్‌లో పోటీపడతారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ర్యాంకింగ్ రౌండ్‌లో తిలోత్తమ సేన్ 262 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించింది. ప్రస్తుతం భారత్ 3 స్వర్ణాలు, 2 కాంస్యాలతో కలిపి ఐదు పతకాలతో టాప్ ర్యాంక్‌లో ఉంది.

# క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ



దోహా: ఖతర్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. దోహాలో మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్–యూకీ ద్వయం 6–3, 6–4తో ప్యుయెట్జ్–జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ) జోడీని ఓడించింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–యూకీ నాలుగు ఏస్‌లు సంధించారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 5–7, 6–1, 10–3తో జ్వెరెవ్ (జర్మనీ)–లామ్‌బ్రాడీ (బ్రిటన్) ద్వయంపై గెలిచింది.

# వార్నర్ కూడా అవుట్

## భారత్‌తో మిగతా టెస్టులకు దూరమైన ఆసీస్ ఓపెనర్



న్యూఢిల్లీ: భారత పర్యటనలో మైదానంలోనే కాకుండా మైదానం బయట కూడా ఆస్ట్రేలియా కష్టాలు కొనసాగుతున్నాయి. కాలి కండరాల గాయంతో ఇప్పటికే పేస్ బౌలర్ హాజెల్‌వుడ్ సిరీస్ నుంచి తప్పుకొని స్వదేశానికి వెళ్లిపోగా... హాజెల్‌వుడ్ సరసన తాజాగా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ కూడా చేరాడు. రెండో టెస్టులో గాయపడ్డ వార్నర్ ‘బోర్డర్–గావస్కర్ ట్రోఫీ’లోని మిగతా రెండు టెస్టులకూ దూరమయ్యాడు. అతను స్వదేశానికి పయనమవుతాడని, అయితే వచ్చే నెలలో జరిగే మూడు వన్డేల సిరీస్‌కల్లా జట్టుకు అందుబాటులో ఉంటాడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వర్గాలు తెలిపాయి. ‘ఢిల్లీలో జరిగిన రెండో టెస్టులో వార్నర్ మోచేతికి ఫ్రాక్చర్ అయింది. వైద్య పరీక్షల అనంతరం గాయం తీవ్రత దృష్ట్యా పూర్తిగా కోలుకునేందుకు పునరావాస శిబిరానికి పంపాలని సీఏ నిర్ణయించింది. నాలుగు టెస్టుల సిరీస్ ముగిశాక జరిగే వన్డే సిరీస్ ఆడతాడని బోర్డు అంచనా వేస్తుంది’ అని సీఏ తెలిపింది. 36 ఏళ్ల ఓపెనర్ ఈ పర్యటనలో నిరాశ పరిచాడు. మైదానంలో గాయపడటంతో అతని స్థానంలో కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా రెన్‌షా బరిలోకి దిగాడు. మూడో టెస్టు మార్చి 1 నుంచి ఇండోర్‌లో, నాలుగో టెస్టు 9 నుంచి అహ్మదాబాద్‌లో జరుగుతుంది.

# ‘టాటా’ డబ్ల్యూపీఎల్

## భారత కంపెనీకి టైటిల్ హక్కులు

న్యూఢిల్లీ: భారత మల్టీనేషనల్ కంపెనీ ‘టాటా’ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కుల్ని కైవసం చేసుకుంది. ఇప్పటికే ఈ దేశీయ కార్పొరేట్ దిగ్గజం పురుషుల లీగ్ ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌గా ఉంది. ‘టాటా’ చైనా మొబైల్ సంస్థ ‘వీవో’ స్థానంలో ఐపీఎల్‌లోకి ప్రవేశించింది. తాజాగా మహిళల లీగ్‌లోనూ భాగమైంది. ఐదేళ్ల పాటు డబ్ల్యూపీఎల్ టైటిల్ స్పాన్సర్‌గా ‘టాటా’ కొనసాగనుంది. అయితే ఎంతమేరకు ఈ ఒప్పందం కుదిరిందనే వివరాలను అటు బోర్డుగానీ, ఇటు కార్పొరేట్ సంస్థగానీ వెల్లడించలేదు. వచ్చే నెల 4 నుంచి డబ్ల్యూపీఎల్ పోటీలన్నీ ముంబైలోని రెండు వేదికలు బ్రబోర్న్, డీవై పాటిల్ స్టేడియాల్లో జరుగనున్నాయి.

**స్టాక్‌ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▽ 19 | 60,673 |
| నిఫ్టీ ▽ 18 | 17,827 |

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్‌ | 11,549 | ▽ 237 |
| డోజోన్స్‌ | 33,282 | ▽ 544 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,978 | ▽ 37 |
| డాక్స్‌ | 15,398 | ▽ 80 |
| షాంఘై | 3,307 | △ 16 |
| నికాయ్‌ | 27,473 | ▽ 59 |

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

**బులియన్‌** రూ.లలో — ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (24 క్యారెట్‌) | 56,384 | ▽ 217 |
| బంగారం (22 క్యారెట్‌) | 56,158 | ▽ 216 |
| వెండి (కేజీ) | 65,770 | △ 10 |

**ఫారెక్స్‌ రేట్లు** రూ.లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 82.00 | 83.67 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | ఎస్‌బీఐ | 86.83 | 89.92 |
| € | యూరో | ఎస్‌బీఐ | 97.94 | 101.26 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | ఎస్‌బీఐ | 60.65 | 62.60 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్‌ | ఎస్‌బీఐ | 56.04 | 58.42 |
| S$ | సింగపూర్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 60.94 | 62.92 |
| SAR | సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 21.08 | 22.75 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 21.64 | 23.44 |
| ¥ | చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 10.92 | 12.99 |

# త్వరలోనే నగదును మించి డిజిటల్‌!

- ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం
- సింగపూర్‌ పేనౌ, యూపీఐ కనెక్టివిటీ ఆవిష్కరణ
- ఇరు దేశాల మధ్య సులభతరం కానున్న చెల్లింపులు



**న్యూఢిల్లీ:** ఏకీకృత చెల్లింపుల విధానం (యూపీఐ) ద్వారా పేమెంట్స్‌ పెరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే నగదు లావాదేవీలను డిజిటల్‌ లావాదేవీలు అధిగమించగలవని ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. దేశీయంగా తీర్చిదిద్దిన ఈ పేమెంట్‌ సిస్టమ్‌ అత్యంత సురక్షితమైనదిగా ఉంటోందనడానికి దీని ద్వారా భారీ స్థాయిలో లావాదేవీలు జరుగుతుండటమే నిదర్శనమని ఆయన తెలిపారు. వీడియో కాన్ఫరెన్సింగ్‌ ద్వారా సింగపూర్‌కు చెందిన పేనౌ, యూపీఐ మధ్య సీమాంతర కనెక్టివిటీని మంగళవారం ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ విషయాలు వివరించారు. మోదీ, సింగపూర్‌ ప్రధాని లీ హిసియన్‌ లూంగ్‌ సమక్షంలో యూపీఐ–పేనౌ లింకేజీని ఉపయోగించి ఆర్‌బీఐ గవర్నర్‌ శక్తికాంత దాస్‌, సింగపూర్‌ మానిటరీ అథారిటీ (ఎంఏఎస్‌) ఎండీ రవి మీనన్‌ లాంఛనంగా లావాదేవీ జరిపారు. 'భారత్‌, సింగపూర్‌ మధ్య మైత్రిని, ఫిన్‌టెక్‌ .. నవకల్పనల్లో సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి సంబంధించి నేడు చాలా ప్రత్యేకమైన రోజు' అని మోదీ ట్వీట్‌ చేశారు. 2018లో మోదీ సింగపూర్‌లో పర్యటించినప్పుడు పేనౌ, యూపీఐని అనుసంధానించే ఆలోచనకు బీజం పడిందని లీ తెలిపారు. 'అప్పటి నుంచి ఇరు దేశాల బ్యాంకులు ఈ దిశగా కృషి చేశాయి. మొత్తానికి ఇది సాకారం కావడం సంతోషదాయకం' అని ఆయన పేర్కొన్నారు.

**ఏటా 1 బిలియన్‌ డాలర్ల రెమిటెన్సులు..**

భారత్‌, సింగపూర్‌ మధ్య ఏటా 1 బిలియన్‌ డాలర్ల పైగా సీమాంతర రిటైల్‌ చెల్లింపులు, రెమిటెన్సుల లావాదేవీలు జరుగుతున్నాయి. ఇరు దేశాల ప్రజలు మొబైల్‌ ఫోన్‌ ద్వారా చౌకగా సీమాంతర లావాదేవీలు జరిపేందుకు యూపీఐ–పేనౌ అనుసంధానం తోడ్పడగలదని మోదీ చెప్పారు. వ్యక్తుల మధ్య సీమాంతర చెల్లింపులు జరిపేందుకు భారత్‌ ఒప్పందాన్ని కుదుర్చుకున్న తొలి దేశం సింగపూర్‌ అని ఆయన తెలిపారు. 2022లో యూపీఐ ద్వారా రూ. 126 లక్షల కోట్లకు పైగా విలువ చేసే 7,400 కోట్ల లావాదేవీలు జరిగాయని, ఇది దాదాపు 2 లక్షల కోట్ల సింగపూర్‌ డాలర్ల విలువకు సరిసమానమని ప్రధాని వివరించారు. 'ఈ నేపథ్యంలో చాలా మంది నిపుణులు త్వరలోనే భారత్‌లో డిజిటల్‌ వాలెట్‌ లావాదేవీలు.. నగదు లావాదేవీలను అధిగమిస్తాయని అంచనా వేస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు.

## లావాదేవీలు ఇలా...

ఆర్‌బీఐ, ఎంఏఎస్‌, ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్‌ పేమెంట్స్‌ (ఎన్‌ఐపీఎల్‌), బ్యాంకింగ్‌ కంప్యూటర్‌ సర్వీసెస్‌ (బీసీఎస్‌), ఇతరత్రా బ్యాంకులు, నాన్‌–బ్యాంకింగ్‌ ఆర్థిక సంస్థలు కలిసి యూపీఐ–పేనౌ లింకేజీని తీర్చిదిద్దాయి. దీనితో ఇరు దేశాల ప్రజలు తమ తమ మొబైల్‌ యాప్‌ల ద్వారా సురక్షితంగా సీమాంతర నిధుల బదలాయింపు లావాదేవీలు చేయవచ్చు. తమ బ్యాంక్‌ ఖాతాలు లేదా ఈ–వాలెట్లలో డబ్బును యూపీఐ ఐడీ, మొబైల్‌ నంబరు లేదా వర్చువల్‌ పేమెంట్‌ అడ్రస్‌ (వీపీఏ) ద్వారా పంపించవచ్చని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం.. తొలి దశలో భారతీయ యూజర్లు రోజుకు రూ. 60,000 వరకూ (1,000 సింగపూర్‌ డాలర్లు) పంపించవచ్చు. లావాదేవీ చేసేటప్పుడే రెండు కరెన్సీల్లోనూ విలువను సిస్టమ్‌ చూపిస్తుంది. ఎస్‌బీఐ, ఐఓబీ, ఇండియన్‌ బ్యాంక్‌, ఐసీఐసీఐ ఇన్‌వార్డ్‌, అవుట్‌వార్డ్‌ రెమిటెన్సుల సేవలను.. యాక్సిస్‌, డీబీఎస్‌ ఇండియా కేవలం ఇన్‌వార్డ్‌ రెమిటెన్సుల సేవలను అందిస్తాయి.

## బీమా సంస్థలు పెరగాలి..

- అప్పుడే అందరికీ బీమా సాకారం
- ఐఆర్‌డీఏఐ చైర్మన్‌ దేవాశిష్‌ పాండా



**ముంబై:** దేశంలో 2047 నాటికి అందరికీ బీమాను చేరువ చేయాలన్న లక్ష్యం సాకారానికి మరిన్ని బీమా సంస్థలు రావాల్సిన అవసరం ఉందని బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) చైర్మన్‌ దేవాశిష్‌ పాండా అభిప్రాయపడ్డారు. విస్తృతమైన, వైవిధ్యమైన బీమా ఉత్పత్తులు, మరిన్ని పంపిణీ భాగస్వాములు కూడా కావాలన్నారు. ప్రైవేటు ఈక్విటీ అండ్‌ వెంచర్‌ క్యాపిటల్‌ పరిశ్రమ అసోసియేషన్‌ వార్షిక సదస్సును ఉద్దేశించి పాండా మాట్లాడారు. ''బీమా పరిశ్రమలో ప్రైవేటు సంస్థలకు ద్వారాలు తెరిచి రెండు దశాబ్దాలకు పైనే గడిచింది. బీమా మార్కెట్‌ ఎంతో వృద్ధి చెందింది. గడిచిన ఐదేళ్లలో బీమా రంగం ఏటా 10 శాతం వృద్ధిని చూసింది. అయినప్పటికీ 2021నాటికి బీమా విస్తరణ 4.2 శాతంగానే ఉంది. మరింత మందికి చేరువ కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా ఉన్న వైవిధ్యభరిత దేశం. అందరికీ ఒక్కటే విధానం సరిపోదు. అధిక ధనవంతులు, పేద ప్రజల కోసం విభిన్నమైన బీమా పరిష్కారాలు అవసరం. అలాంటి వినూత్నమైన ఉత్పత్తులను నేడు ఉన్న 70 కంపెనీల నుంచి సాధ్యం కాదు. కనుక మరిన్ని కంపెనీలు రావాలి. విస్తృతమైన బీమా ఉత్పత్తులు, పంపిణీదారులు కూడా అవసరం. అప్పుడే 2047 నాటికి అందరికీ బీమా లక్ష్యాన్ని సాధించగలం'' అని దేవాశిష్‌ పాండా వివరించారు.

## ఐకామ్‌ ప్లాంటులో కారకల్‌ ఆయుధాలు



**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** అధునాతన ఆయుధాల తయారీ, సరఫరాలో ప్రపంచస్థాయి దిగ్గజం కారకల్‌ ఇంటర్నేషనల్‌తో హైదరాబాద్‌కు చెందిన ఐకామ్‌ టెలీ సాంకేతిక బదిలీ ఒప్పందం కుదుర్చుకుంది. యూఏఈలోని అబుదాబిలో ప్రపంచంలోనే అతిపెద్ద ట్రై–సర్వీస్‌ డిఫెన్స్‌ ఎగ్జిబిషన్లలో ఒకటైన ఐడీఈఎక్స్‌ 2023 కార్యక్రమంలో మంగళవారం ఇరు సంస్థల మధ్య డీల్‌ కుదిరింది. మేఘా ఇంజనీరింగ్‌ అండ్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్‌ (ఎంఈఐఎల్‌) గ్రూప్‌ కంపెనీ అయిన ఐకామ్‌.. భారత రక్షణ రంగానికి అవసరమైన ఆయుధాల తయారీలో భాగస్వామిగా ఉంది. తాజా డీల్‌ ప్రకారం హైదరాబాద్‌ ప్లాంటులో కారకల్‌ టెక్నాలజీతో చిన్నపాటి ఆయుధాలను తయారు చేస్తామని ఐకామ్‌ టెలి ఎండీ పి.సుమంత్‌ తెలిపారు. క్షిపణులు, కమ్యూనికేషన్స్‌, ఈడబ్ల్యూ సిస్టమ్స్‌, రాడార్లు, ఎలక్ట్రో–ఆప్టిక్స్‌, మందుగుండు, షెల్టర్లు, డ్రోన్‌, కౌంటర్‌–డ్రోన్‌ సిస్టమ్స్‌ను ఐకామ్‌ ఇప్పటికే తయారు చేస్తోంది. 1989లో ప్రారంభమైన ఐకామ్‌కు హైదరాబాద్‌ శివారులో 110 ఎకరాల్లో ప్లాంటు ఉంది.

## జీ-20 దేశాల ప్రయాణికులకు యూపీఐ సేవలు



**ముంబై:** విదేశాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులకు పెద్ద ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని ఆర్‌బీఐ తీసుకుంది. జీ–20 దేశాలకు చెందిన ప్రయాణికులు యూపీఐ ఆధారిత చెల్లింపులు చేసేందుకు వీలుగా ప్రీపెయిడ్‌ పేమెంట్‌ ఇన్‌స్ట్రుమెంట్స్‌ వాలెట్స్‌ను అమల్లోకి తెచ్చింది. బెంగళూరు, ముంబై, న్యూఢిల్లీ విమానాశ్రయాల్లో ఈ వాలెట్స్‌ను జారీ చేస్తారు. దేశవ్యాప్తంగా క్యూఆర్‌ కోడ్‌ ఆధారిత యూపీఐ చెల్లింపులను స్వీకరించే 5 కోట్లకుపైగా వర్తకుల వద్ద యాత్రికులు తమ లావాదేవీలు పూర్తి చేయవచ్చు. ప్రస్తుతానికి ఐసీఐసీఐ బ్యాంక్‌, ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్‌, పైన్‌ ల్యాబ్స్‌, ట్రాన్స్‌కార్ప్‌ ఇంటర్నేషనల్‌ ఈ వాలెట్స్‌ను జారీ చేస్తాయి.

# వరుసగా మూడోరోజూ నష్టాలే..

- ఫెడ్‌ మినిట్స్‌ వెల్లడికి ముందు అప్రమత్తత
- స్వల్ప నష్టాలతో ముగిసిన సూచీలు



**ముంబై:** రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్‌ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. అమెరికా ఫెడరల్‌ ఓపెన్‌ మార్కెట్‌ కమిటీ సమావేశం వివరాల వెల్లడి(బుధవారం)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నారు. క్రూడాయిల్‌ ధరల్లో లాభాల స్వీకరణ, ప్రపంచ ఆర్థిక మందగమన ఆందోళనలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఉదయం సూచీలు స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. మార్కెట్లో చోటు చేసుకున్న అప్రమత్తతతో ట్రేడింగ్‌ ఆద్యంతం లాభనష్టాల మధ్య దోబూచులాడాయి. మిడ్‌ సెషన్‌లో నుంచి కొంత సేపు లాభాల్లో కదలాడినా..., ఆఖర్లో కీలక రంగాల్లో అమ్మకాలు తలెత్తడంతో సూచీలు మూడోరోజూ నష్టాల ముగింపు తప్పలేదు. ట్రేడింగ్‌లో 393 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్‌ 19 పాయింట్లు నష్టపోయి 60,673 వద్ద స్థిర పడింది. ఇంట్రాడేలో 60,584 కనిష్టాన్ని, 60,977 గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 18 పాయింట్లు పతనమై 17,827 వద్ద నిలిచింది. రోజంతా 17,800 – 17,925 పాయింట్ల శ్రేణిలో ట్రేడైంది. బ్యాంకింగ్‌, రియల్టీ, ఆటో, ఐటీ షేర్లు అధికంగా నష్టపోయాయి. బీఎస్‌ఈ స్మాల్‌, మిడ్‌ క్యాప్‌ సూచీలు వరుసగా 0.30%, 0.21 శాతం చొప్పున నష్టపోయాయి. పారిశ్రామిక, వినిమయ, క్యాపిటల్‌ గూడ్స్‌, విద్యుత్‌ షేర్లు స్వల్పంగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.235 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.526 కోట్ల షేర్లను కొన్నారు. ఫారెక్స్‌ మార్కెట్లో రూపాయి 9 పైసలు నష్టపోయి 82.79 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడాయి.

# 5జీ సేవలకు మరింత స్పెక్ట్రం కావాలి

సీవోఏఐ వెల్లడి

**న్యూఢిల్లీ:** 5జీ సేవలను విస్తరించాలంటే మరింత స్పెక్ట్రం అవసరమని టెల్కోల సమాఖ్య సీవోఏఐ డైరెక్టర్‌ జనరల్‌ ఎస్‌పీ కొచర్‌ తెలిపారు. కీలకమైన 6 గిగాహెర్ట్జ్‌ బ్యాండ్‌ స్పెక్ట్రంను టెలికం సంస్థలకు కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలా జరగని పక్షంలో 5జీ సేవలను విస్తరించడం, వేగంగాను.. చౌకగాను అందించడంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని కొచర్‌ వివరించారు. భారీ జనాభా ఉండే ప్రాంతాల్లో.. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నెట్‌ సర్వీసులను విస్తరించడానికి అత్యంత నాణ్యమైన 6 గిగాహెర్ట్జ్‌ బ్యాండ్‌ అనువుగా ఉంటుంది. దీంతో ఈ బ్యాండ్‌లో స్పెక్ట్రం కోసం వైఫై సంస్థలు, టెల్కోల మధ్య పోటీ ఉంటోంది. నగరాల్లో విస్తృతంగా మొబైల్‌ నెట్‌వర్క్‌ను పెంచుకోవాలంటే 6 గిగాహెర్ట్జ్‌ బ్యాండ్‌ కీలకమని కొచర్‌ తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే టెలికం శాఖకు విజ్ఞప్తి చేశామని ఆయన చెప్పారు. దీనిపై ప్రత్యేక కమిటీ కూడా ఏర్పాటైందని వివరించారు.




**కాల్‌ డ్రాప్స్‌పై రాష్ట్ర స్థాయి డేటా సాధ్యం కాదు**

కాల్‌ అంతరాయాలకు సంబంధించి రాష్ట్రాల వారీగా డేటా ఇవ్వాలన్న టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ ఆదేశాలు ఆచరణ సాధ్యం కాదని కొచర్‌ పేర్కొన్నారు. యూజర్లకు ఎట్టి పరిస్థితుల్లోనైనా నాణ్యమైన సేవలను అందించేందుకు టెల్కోలు ప్రయత్నిస్తుంటాయని, కానీ ఈ సూచనలను అమలు చేయాలంటే క్షేత్ర స్థాయిలో అడ్మినిస్ట్రేషన్‌పరంగా అనేక సవాళ్లు ఉంటాయని ఆయన చెప్పారు. నిబంధనల ప్రకారం టెలికం సేవలను ప్రస్తుతం సర్కిళ్ల వారీగా, ఎల్‌ఎస్‌ఏ (లైసెన్స్‌డ్‌ సర్వీస్‌ ఏరియా)వారీగా అందిస్తున్నామని, దానికి అనుగుణంగానే డేటా కూడా ఉంటుందని కొచర్‌ తెలిపారు. ఇవన్నీ వివిధ జ్యూరిడిక్షన్‌లలో ఉంటాయి కాబట్టి రాష్ట్రాలు, జిల్లాల స్థాయిలో డేటా ఇవ్వాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారమని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పాటిస్తున్న ఎల్‌ఎస్‌ఏ (లైసెన్స్‌డ్‌ సర్వీస్‌ ఏరియా) స్థాయి డేటా విధానాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని కొచర్‌ వివరించారు. రాష్ట్ర స్థాయి డేటా వెల్లడి ఆదేశాలపై పునరాలోచన చేయాలని ట్రాయ్‌ను సీవోఏఐ కోరినట్లు చెప్పారు.



# విద్య, ఉద్యోగ సమాచారం

### టీఎస్‌ఎస్పీడీసీఎల్‌లో 1553 జూనియర్‌ లైన్‌మ్యాన్‌ పోస్టులు

హైదరాబాద్‌లో ఉన్న దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీఎస్‌ఎస్పీడీసీఎల్‌).. డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ప్రాతిపదికన జూనియర్‌ లైన్‌ మ్యాన్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1553(లిమిటెడ్‌ రిక్రూట్‌మెంట్‌–553,జనరల్‌ రిక్రూట్‌మెంట్‌–1000).
» **అర్హత:** పదో తరగతితోపాటు ఐటీఐ(ఎలక్ట్రికల్‌ ట్రేడ్‌/వైర్‌మ్యాన్‌) లేదా ఇంటర్మీడియట్‌ వొకేషనల్‌ కోర్సు(ఎలక్ట్రికల్‌ ట్రేడ్‌) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.24,340 నుంచి రూ.39,405 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పోల్‌ క్లైంబింగ్‌ టెస్ట్‌, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా.
» **రాతపరీక్ష కేంద్రాలు:** జీహెచ్‌ఎంసీ/హెచ్‌ఎండీసీ పరిధిలోని వివిధ కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభతేది:** 08.03.2023. » **ఆన్‌లైన్‌ దరఖాస్తు ఫీజు, చెల్లింపు చివరితేది:** 28.03.2023.
» **పరీక్ష తేది:** 30.04.2023.
» **వెబ్‌సైట్‌:** www.tssouthernpower.com

### టీఎస్‌ఎస్పీడీసీఎల్‌లో 48 అసిస్టెంట్‌ ఇంజనీర్‌ పోస్టులు

హైదరాబాద్‌లో ఉన్న దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీఎస్‌ఎస్పీడీసీఎల్‌).. డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ప్రాతిపదికన అసిస్టెంట్‌ఇంజనీర్‌(ఎలక్ట్రికల్‌) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 48
» **అర్హత:** బ్యాచిలర్స్‌ డిగ్రీ(ఎలక్ట్రికల్‌ ఇంజనీరింగ్‌ /ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ ఇంజనీరింగ్‌) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.64,295 నుంచి రూ.99,345 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **రాతపరీక్ష కేంద్రాలు:** జీహెచ్‌ఎంసీ/హెచ్‌ఎండీసీ పరిధిలోని వివిధ కేంద్రాల్లోపరీక్ష నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభతేది:** 23.02.2023. » **ఆన్‌లైన్‌ దరఖాస్తు, ఫీజు చెల్లింపు చివరితేది:** 15.03.2023.
» **పరీక్ష తేది:** 30.04.2023.
» **వెబ్‌సైట్‌:** www.tssouthernpower.com

### అస్సాం రైఫిల్స్‌లో 616 పోస్టులు

షిల్లాంగ్‌లోని అస్సాం రైఫిల్స్‌, డైరెక్టర్‌ జనరల్‌ కార్యాలయం.. గ్రూప్‌ బి, గ్రూప్‌ సి విభాగాల్లో రాష్ట్రాల వారీగా టెక్నికల్‌, ట్రేడ్స్‌మ్యాన్‌ పోస్టుల భర్తీకి మే నెలలో రిక్రూట్‌మెంట్‌ ర్యాలీ నిర్వహిస్తోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 616
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్‌-25, తెలంగాణ-27.
» **ట్రేడులు:** బ్రిడ్జి అండ్‌ రోడ్‌(మేల్‌, ఫిమేల్‌), రెలీజియస్‌ టీచర్‌(మేల్‌), క్లర్క్‌(మేల్‌, ఫిమేల్‌), ఆపరేటర్‌ రేడియో అండ్‌ లైన్‌(మేల్‌), రేడియో మెకానిక్‌(మేల్‌), పర్సనల్‌ అసిస్టెంట్‌(మేల్‌, ఫిమేల్‌), ల్యాబొరేటరీ అసిస్టెంట్‌(మేల్‌), నర్సింగ్‌ అసిస్టెంట్‌(మేల్‌), వెటర్నరీ ఫీల్డ్‌ అసిస్టెంట్‌(మేల్‌), ఫార్మసిస్ట్‌(మేల్‌, ఫిమేల్‌), వాషర్‌మ్యాన్‌(మేల్‌), ఫిమేల్‌ సఫాయి(ఫిమేల్‌), బార్బర్‌(మేల్‌), కుక్‌(మేల్‌), మేల్‌ సఫాయి(మేల్‌), ప్లంబర్‌(మేల్‌), ఎలక్ట్రీషియన్‌(మేల్‌), ఎలక్ట్రికల్‌ ఫిట్టర్‌ సిగ్నల్‌(మేల్‌), లైన్‌మ్యాన్‌ ఫీల్డ్‌(మేల్‌), ఎలక్ట్రీషియన్‌ మెకానిక్‌ వెహికల్‌(మేల్‌), డ్రాఫ్ట్స్‌మ్యాన్‌(మేల్‌, ఫిమేల్‌).
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఫిజికల్‌ మెజర్‌మెంట్‌ టెస్ట్‌, ఫిజికల్‌ ఎఫిషియెన్సీ టెస్ట్‌, స్కిల్‌ టెస్ట్‌/ట్రేడ్‌ టెస్ట్‌, రాతపరీక్ష, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్‌, మెడికల్‌ ఎగ్జామినేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 19.03.2023.
» **ర్యాలీ ప్రారంభం:** 01.05.2023 నుంచి.
» **వెబ్‌సైట్‌:** assamrifles.gov.in

### ఎయిర్‌ ఇండియా, తిరుపతిలో 28 ఉద్యోగాలు

తిరుపతిలోని ఎయిర్‌ ఇండియా ఎయిర్‌పోర్ట్‌ సర్వీసెస్‌ లిమిటెడ్‌, తిరుపతి ఇంటర్నేషనల్‌ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేసేందుకు ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
» **పోస్టుల వివరాలు:** కస్టమర్‌ సర్వీస్‌ ఎగ్జిక్యూటివ్‌ /జూనియర్‌ కస్టమర్‌ సర్వీస్‌ ఎగ్జిక్యూటివ్‌–09, ర్యాంప్‌ సర్వీస్‌ ఎగ్జిక్యూటివ్‌/యుటిలిటీ ఏజెంట్‌ కమ్‌ ర్యాంప్‌ డ్రైవర్‌–05,హ్యాండీమ్యాన్‌–14.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్‌ఎస్‌సీ/పదో తరగతి/10+2/ఐటీఐ /డిప్లొమా/గ్రాడ్యుయేషన్‌ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 నుంచి 33 ఏళ్లు ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.11,700 నుంచి రూ.16,530 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ట్రేడ్‌ టెస్ట్‌/పీఈటీ/పర్సనల్‌/వర్చువల్‌ ఇంటర్వ్యూలో మెరిట్‌ ఆధారంగా.
» **ఇంటర్వ్యూ వేదిక:** ఓల్డ్‌ టెర్మినల్‌ బిల్డింగ్‌, ఓల్డ్‌ ఎయిర్‌పోర్ట్‌, రేణిగుంట, తిరుపతి–517520.
» **ఇంటర్వ్యూ తేది:** 23.02.2023.
» **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు.
» **వెబ్‌సైట్‌:** www.aial.in

# అవుతారా.. బ్యాంక్‌ పీవో!

**బ్యాంకింగ్‌ రంగంలో అత్యంత క్రేజీ పోస్టు.. పీవో! ప్రభుత్వ రంగ బ్యాంకు.. బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా పీవో పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో రెగ్యులర్‌ ప్రాతిపదికన 500 పీవో (ప్రొబేషనరీ ఆఫీసర్‌) పోస్టులను భర్తీ చేయనుంది. రాత పరీక్ష, గ్రూప్‌ డిస్కషన్‌, పర్సనల్‌ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన వారు ముందుగా ఏడాది వ్యవధి ఉండే పీజీడీబీఎఫ్‌ కోర్సు పూర్తిచేయాలి. అనంతరం అసిస్టెంట్‌ మేనేజర్‌ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఈ నేపథ్యంలో.. బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా భర్తీ చేసే పీవో పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పీజీడీబీఎఫ్‌ కోర్సు తదితర వివరాలు..**

» బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాలో 500 పీవో కొలువులు
» రాత పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక




- మొత్తం పీవో పోస్టులు: 500
- **విభాగాల వారీగా ఖాళీలు:** జనరల్‌ బ్యాంకింగ్‌ స్ట్రీమ్‌లో క్రెడిట్‌ ఆఫీసర్‌ పోస్టులు–350, స్పెషల్‌ స్ట్రీమ్‌లో ఐటీ ఆఫీసర్‌ పోస్టులు–150.

**అర్హతలు**

క్రెడిట్‌ ఆఫీసర్‌ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఐటీ ఆఫీసర్‌ ఉద్యోగాలకు కంప్యూటర్‌ సైన్స్‌/ఐటీ/ఎలక్ట్రానిక్‌ విభాగాల్లో బీఈ/బీటెక్‌ లేదా ఇవే విభాగాల్లో పీజీ లేదా ఏదైనా డిగ్రీతోపాటు డీఓఈఏసీసీలో బీ లెవల్‌ ఉత్తీర్ణత ఉండాలి.

**వయసు**

ఈ రెండు పోస్టులకు ఫిబ్రవరి 01, 2023 నాటికి 20 నుంచి 29 ఏళ్లలోపు వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

**తుది ఎంపిక ఇలా**

ఆన్‌లైన్‌ పరీక్ష, గ్రూప్‌ డిస్కషన్‌, పర్సనల్‌ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌ రాత పరీక్షలో సాధించిన మెరిట్‌, గ్రూప్‌ డిస్కషన్‌లో చూపిన ప్రతిభ, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కుల మెరిట్‌ ఆధారంగా, రిజర్వేషన్లను అనుసరించి తుది ఎంపిక చేస్తారు.

**రాత పరీక్ష విధానం**

- తొలుత కంప్యూటర్‌ ఆధారిత పరీక్షను ఆబ్జెక్టివ్‌ పద్ధతిలో 200 మార్కులకు–155 ప్రశ్నలకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 3 గంటలు. దీంతోపాటు డిస్క్రిప్టివ్‌ విధానంలో 2 ప్రశ్నలను అడుగుతారు. వీటికి 25 మార్కులుంటాయి. దీనికి అరగంట సమయం కేటాయిస్తారు.
- ఆబ్జెక్టివ్‌ విధానంలో నిర్వహించే పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఇందులో ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌ 35 ప్రశ్నలు–40 మార్కులు, రీజనింగ్‌ అండ్‌ కంప్యూటర్‌ ఆప్టిట్యూడ్‌ 45 ప్రశ్నలు–60 మార్కులు, జనరల్‌/ఎకనామీ/బ్యాంకింగ్‌ అవేర్‌నెస్‌ 40 ప్రశ్నలు–40 మార్కులు, డేటా అనాలిసిస్‌ అండ్‌ ఇంటర్‌ప్రిటేషన్‌ విభాగం నుంచి 35 ప్రశ్నలు–60 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- నెగిటివ్‌ మార్కింగ్‌ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కులో నుంచి పావు వంతు తగ్గిస్తారు.
- ఆబ్జెక్టివ్‌ విభాగంలోని ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌, డిస్క్రిప్టివ్‌ ఇంగ్లిష్‌ పేపర్లలో అర్హత సాధిస్తే సరిపోతుంది. వీటిలో సాధించిన మార్కులు తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు.
- ఆబ్జెక్టివ్‌ పరీక్షలో అర్హత సాధించేందుకు జనరల్‌, ఈడబ్ల్యూఎస్‌ అభ్యర్థులు కనీసం 40 శాతం, ఇతరులు కనీసం 35శాతం మార్కులు సాధించాలి.

**గ్రూప్‌ డిస్కషన్‌**

రాత పరీక్షలో మెరిట్‌తోపాటు, రిజర్వేషన్‌ ప్రకారం ఎంపిక చేసిన కొంత మందిని గ్రూప్‌ డిస్కషన్‌కు పిలుస్తారు. దీనికి 40 మార్కులుంటాయి. ఇందులో జనరల్‌, ఈడబ్ల్యూఎస్‌లు కనీసం 40 శాతం, ఇతర అభ్యర్థులు కనీసం 35శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది.

**ఇంటర్వ్యూ**

గ్రూప్‌ డిస్కషన్‌లో అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తారు. మొత్తం 60 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. జనరల్‌, ఈడబ్ల్యూఎస్‌లు 40 శాతం, ఇతరులు కనీసం 35 శాతం మార్కులు సాధించాలి.

**పీజీడీబీఎఫ్‌ కోర్సు**

- తుది ఎంపికలో అర్హత సాధించిన వారికి పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ డిప్లొమా ఇన్‌ బ్యాంకింగ్‌ ఫైనాన్స్‌ (పీజీడీబీఎఫ్‌) కోర్సు ఏప్రిల్‌ మొదటి వారంలో మణిపాల్‌ క్యాంపస్‌లో ప్రారంభ మవుతుంది. మొత్తం కోర్సు ఫీజు రూ.3.5 లక్షలు. జీఎస్‌టీ ఇందుకు అదనంగా చెల్లించాలి. ఇందులో భాగంగా వసతి, భోజన సౌకర్యాలు కూడా అందిస్తారు. కోర్సు ఫీజు కోసం రుణ సౌకర్యం కూడా ఉంది. ఏడాది కోర్సు అనంతరం ప్రతి నెల కొంత మొత్తం చొప్పున సులభ వాయిదాల్లో రుణ మొత్తాన్ని చెల్లించే వెసులుబాటు ఉంది.
- ఈ కోర్సులో మొత్తం నాలుగు ట్రైమిస్టర్లు ఉంటాయి. మొదటి మూడు ట్రైమిస్టర్లకు నెలకు రూ.2500 స్టయిపెండ్‌గా చెల్లిస్తారు. చివరి ట్రైమిస్టర్లో ఏదైనా బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాలో జాబ్‌ ట్రెనింగ్‌ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో నెలకు రూ.15,000 స్టయిపెండ్‌ అందుతుంది.
- విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్న వారికి అసిస్టెంట్‌ మేనేజర్‌ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. కనీసం మూడేళ్లు విధుల్లో కొనసాగుతామని రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. సంబంధిత గడువు తీరిన తర్వాత సెక్యూరిటీ డిపాజిట్‌ మొత్తాన్ని తిరిగి ఇస్తారు. అలాగే సంస్థలో ఐదేళ్లు సర్వీస్‌ పూర్తిచేసుకున్న వారికి కోర్సు ఫీజు కూడా వెనక్కి ఇచ్చేస్తారు.

**వేతనాలు**

ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.36,000 వరకు మూలవేతనంగా అందుతుంది. ఈ మూలవేతనంతోపాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు అదనంగా లభిస్తాయి. అన్నీ కలుపుకొని సుమారు రూ.60 వేల వరకు వేతనం పొందవచ్చు.

**ప్రిపరేషన్‌ పక్కాగా**

- ఇప్పటికే బ్యాంకింగ్‌ పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు అదే ప్రిపరేషన్‌తో ఈ పరీక్షను కూడా రాయవచ్చు. తాజాగా ప్రిపరేషన్‌ మొదలు పెట్టాలనుకునే వారు పరీక్ష సిలబస్‌ను పూర్తిగా అధ్యయనం చేయాలి. ఇచ్చిన సిలబస్‌లో బేసిక్‌ అంశాలతో ప్రిపరేషన్‌ మొదలు పెడితే.. అనంతరం ఆయా అంశాలపై పట్టు సాధించవచ్చు.
- ప్రిపరేషన్‌లో భాగంగా ఎక్కువగా మాక్‌ టెస్టులను రాయాలి. వీలైనన్నీ మాదిరి ప్రశ్నలను ప్రాక్టీస్‌ చేయడం ద్వారా మంచి మార్కులు సాధించడమే కాకుండా.. నిర్దిత సమయంలో వేగంగా సమాధానాలు గుర్తించడానికి సన్నద్ధత లభిస్తుంది. కష్టమనిపించే అంశాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి. మాక్‌ టెస్టుల్లో చేసే తప్పులను గుర్తించి.. అవి పునరావృత్తం కాకుండా చూసుకోవాలి. నెగిటివ్‌ మార్కుల నిబంధన ఉన్నందున తెలియని ప్రశ్నలను వదిలేయడం మంచిది. ఎందుకంటే.. వాటితో సమయం వృథా అవుతుంది.
- ఆబ్జెక్టివ్‌ పరీక్షతోపాటు డిస్క్రిప్టివ్‌ పరీక్షను రాయాల్సి ఉంటుంది. కాబట్టి ప్రిపరేషన్‌లోనే దాన్ని కూడా భాగం చేసి ప్రాక్టీస్‌ చేయాలి.
- డేటా అనాలసిస్‌ అండ్‌ ఇంటర్‌ప్రిటేషన్‌కు అధిక ప్రాధాన్యమివ్వాలి. దీని తర్వాత రీజనింగ్‌ అండ్‌ కంప్యూటర్‌ ఆప్టిట్యూడ్‌ ప్రధానమైంది. ఈ రెండు విభాగాల్లో మెరుగైన మార్కులు పొందిన వారు మాత్రమే తర్వాత దశకు చేరుకోగలుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడానికి షార్ట్‌కట్‌ మెథడ్స్‌ను అనుసరించాలి.
- గత పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలతోపాటు వీలైనన్ని ఎక్కువ మాక్‌టెస్టులు, ప్రాక్టీస్‌ టెస్టులను రాయాలి. దీని ద్వారా ఆయా అంశాలపై ఏ మేరకు అవగాహన ఉందో తెలుస్తుంది.

**ముఖ్యసమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఫిబ్రవరి 25, 2023
- **వెబ్‌సైట్‌:** https://bankofindia.co.in

## ● మూగ ప్రాణుల 'మహా' వేదన



మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా బోధిడి ప్రాంతంలో వేసవి ఆరంభంలోనే నీటి ఎద్దడి, పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో పశువులను పస్తులుంచలేక.. తాగునీటికి అల్లాడిపోతుంటే చూడలేక యజమానులు వేసవి కాలం ముగిసేవరకు పశువుల కాపరికి అప్పగించారు. వందలాది పశువులను ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం తర్నం సమీపంలో పది రోజులుగా ఉంచుతున్నారు. పేడ ఎరువు కోసం రైతులు రాత్రివేళల్లో తమ పంట చేలలో ఉంచుతూ.. తర్నం వాగులో వాటి దాహార్తి తీర్చుతున్నారు. మంగళవారం తర్నం వాగులో తాగునీటి కోసం పశువులు వచ్చిన దృశ్యమిది.

## ● ప్రమాదకరమని తెలిసినా పయనం





కుంగిపోయిన వంతెనపై రాకపోకలు నిషేధించినా.. పాదచారులు పట్టించుకోవడం లేదు. జైనథ్ మండలం తరోడ బ్రిడ్జి కుంగిపోవడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. దీంతో ఆదిలాబాద్ నుంచి ఈ బ్రిడ్జి వరకు ఒక బస్సు.. బ్రిడ్జి అవతల మరో బస్సును ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ప్రయాణికులు కాలినడకన కుంగిపోయిన బ్రిడ్జిపై నుంచి దాటుతున్నారు. బ్రిడ్జిపైకి ఎవరూ వెళ్లకుండా 'వంతెన కుంగినది.. రోడ్డు మూసివేయబడినది' అనే బోర్డును అధికారులు ఏర్పాటు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

## రాష్ట్రంలో తొలిసారిగా ట్రాన్స్‌జెండర్‌కు రుణం

**మరొకరికి ఫోర్‌వీలర్ డ్రైవింగ్ లైసెన్స్**

కరీంనగర్: ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద స్వయం ఉపాధి యూనిట్ స్థాపన కోసం రాష్ట్రంలోనే ప్రథమంగా కరీంనగర్ జిల్లాలోని ట్రాన్స్‌జెండర్‌కు సబ్సిడీ రుణం మంజూరు చేసినట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన డీసీసీ డీఎల్ఆర్‌సీ సమావేశంలో ట్రాన్స్‌జెండర్‌కు రుణ మంజూరు పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



రుణం అందుకున్న ట్రాన్స్‌జెండర్ ఆషాడం ఆశ

రాష్ట్రంలోనే ప్రథమంగా జిల్లాలోని ట్రాన్స్‌జెండర్ ఆషాడం ఆశ (ఎస్సీ)కు ఫొటోగ్రఫీ యూనిట్ స్థాపన కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. మరో ట్రాన్స్‌జెండర్ నక్క సింధుకు.. ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆయన అందజేశారు.

# కొత్తగా 300 వంతెనలు

| రాష్ట్ర రహదారులపై నిర్మించనున్న ప్రభుత్వం | పాడైన 133 చోట్ల, ఇప్పటివరకు లేని 167 ప్రాంతాల్లో నిర్మాణం | రూ. 635 కోట్లతో పనులు |
|---|---|---|

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రహదారుల మీదుగా పారే వాగులు, వంకలపై కొత్తగా 300 వంతెనలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత రెండేళ్లలో కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల రోడ్లు, కల్వర్టులు తీవ్రంగా దెబ్బతినడంతో ఆయా ప్రాంతాల్లో వెంటనే వంతెనలు నిర్మించి వరద పారేందుకు సరైన ఏర్పాట్లు చేయాలని, లేకుంటే రోడ్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఇటీవల అధికారులు నివేదిక సమర్పించారు. ఇందుకు ప్రభుత్వం అంగీకరించడంతో అధికారులు సర్వే చేసి 300 ప్రాంతాల్లో వంతెనలు అవసరమని తేల్చారు. ఇప్పుడు వాటిల్లో 150 వంతెనల పనులను ప్రారంభించి వీలైనంత తొందరగా పూర్తి చేయనున్నారు.

**10 మీటర్ల నుంచి 50 మీటర్ల నిడివితో..**

పంచాయతీ రోడ్లు పోను రాష్ట్ర స్థాయి రోడ్ల నిడివి 28 వేల కిలోమీటర్ల మేర ఉంది. వాటిల్లో కొన్ని చోట్లే వంతెనలు ఉన్నాయి. మిగతా చోట్ల పాత కల్వర్టులు, పాత బ్రిడ్జీలకే మరమ్మతులు చేస్తూ అధికారులు నెట్టుకొస్తున్నారు. గత రెండేళ్లలో వరదలకు 133 వంతెనలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు వాటిని ఎత్తుగా నిర్మించనున్నారు. వాగులు పారే మరో 167 చోట్ల వంతెనలు లేవు. వర్షాకాలంలో ఆ రోడ్ల మీదుగానే వరద పారుతోంది. ఈ ప్రాంతాల్లో రూ. 635 కోట్లతో వంతెనలు నిర్మించనున్నారు. 10 మీటర్ల నుంచి 50 మీటర్ల నిడివితో వాటిని ఎత్తుగా నిర్మించనున్నారు. గత పదేళ్లలో వరదనీరు ఆయా ప్రాంతాల్లో ఎంత ఎత్తు, ఎంత వెడల్పుతో ప్రవహించిందన్న వివరాలను సేకరించిన అధికారులు ఆ మేరకు ఆయా ప్రాంతాల్లో వంతెనల పొడవు, ఎత్తు నిర్ధారించారు.



**ప్రారంభమైన పునరుద్ధరణ పనులు**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక తొలిసారి రాష్ట్ర రహదారులకు కాలానుగుణ పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నారు. దాదాపు 2 వేల కి.మీ. నిడివి గల రోడ్లను పటిష్టపరిచేలా మరమ్మతులు చేపట్టనున్నారు. వాటిని 1,187 పనులుగా విభజించగా ఇందులో ఇప్పటికే 126 పనులు పూర్తి చేశారు. మిగతా వాటిల్లో 173 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 474 పనులు టెండర్లు పూర్తి చేసి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతావాటికి టెండర్లు పిలవాల్సి ఉంది. ఈ మరమ్మతులకు రూ. 1,700 కోట్లు ఖర్చు కానుంది.

## వివాదాల తక్షణ పరిష్కారానికే ఐఏఎంసీ




సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వీకే రాజా, తెలంగాణ హైకోర్టు సీజే ఉజ్జల్ భూయాన్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఎల్.నాగేశ్వరరావు

▶ మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సింగపూర్ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వీకే రాజా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎల్.నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'సింగపూర్‌లోని ఆర్బిట్రేషన్ సెంటర్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడంలో జస్టిస్ రాజా కృషి ఎనలేనిది. ఆయన మార్గదర్శనం, సీఎం కేసీఆర్ కృషి కారణంగానే ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో ఐఏఎంసీ ఏర్పాటైంది. సీఎం కేసీఆర్ పరిశ్రమలకు అనుమతిలో ఇబ్బందులను తెలుసుకుని సింగిల్ విండో విధానాన్ని రూపొందిస్తూ టీఎస్ ఐపాస్‌ను తెచ్చారు. దీంతో సమయం, నిధులు భారీగా ఆదా అవుతున్నాయి. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన కంపెనీలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. పారిశ్రామిక వివాదాల పరిష్కారం కోసమే ఐఏఎంసీ ఏర్పాటైంది'అని కేటీఆర్ వివరించారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాలను పెంచేందుకు రాష్ట్రాలు దృష్టి సారించాలని జస్టిస్ రాజా సూచించారు. తొలిసారి హైదరాబాద్ రావడం ఆనందంగా ఉందన్నారు. 'కోర్టుల్లో దాఖలైన కేసుల్లో ఎక్కువ శాతం న్యాయం సరిగా అందడం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. న్యాయవ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించపోతే మధ్యవర్తిత్వ కేంద్రం గ్లోబల్ హబ్‌గా మారదు. హైదరాబాద్‌లో సమర్థవంతమైన న్యాయవ్యవస్థ అవసరం'అని పేర్కొన్నారు.

**అంతర్జాతీయ స్థాయికి ఐఏఎంసీ..:** 'ఐఏఎంసీ నెమ్మదిగానైనా..అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందుతుంది. దేశంలో ఇప్పటికీ వ్యాపారాలు ప్రభుత్వాల నీడలోనే సాగుతున్నాయి. అవి ఈ నీడ నుంచి బయటపడి పూర్తి కార్పొరేట్‌గా మారినప్పుడు సంస్థాగత మధ్యవర్తిత్వం అవసరం అవుతుంది. ఇది వివాదాల సత్వర పరిష్కారానికి దోహదం చేస్తుంది'అని హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వెల్లడించారు. అనంతరం జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు మాట్లాడారు.

## ఖాళీగా కళ్లద్దాల పెట్టెలు

**అవాక్కయిన కంటి రోగులు**

కామారెడ్డి టౌన్: కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్ష చేయించుకున్నారు. కళ్లద్దాల పెట్టె అందిస్తే ఆనందంగా అందుకున్నారు..



తీరా దాన్ని తెరిచి చూస్తే ఖాళీగా కనిపించడంతో అవాక్కవుతున్నారు. కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం అంచనూర్ గ్రామానికి చెందిన దూడ బీరయ్య కంటి వెలుగు కార్యక్రమంలో తనిఖీ చేయించుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనకు వైద్య సిబ్బంది కళ్లద్దాల పెట్టె అందజేశారు. కానీ పెట్టె తెరిచాక అందులో కళ్లద్దాలు లేకపోవడంతో బీరయ్య, అక్కడి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది విస్తుపోయారు. మళ్లీ వివరాలను నమోదు చేసుకుని ఆర్డర్ చేస్తామని తెలిపారు. చాలాచోట్ల ఇలాగే జరుగుతోందని సిబ్బంది వాపోతున్నారు.

● పుట్టు మచ్చలతో జాతకాలు మారుస్తామంటూ..

## నగ్న చిత్రాలు సేకరించిన ముఠా

- ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఆగడాలు
- జడ్చర్ల పోలీసుల అదుపులో ఇద్దరు..
- మరో ఇద్దరి కోసం గాలింపు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'హస్తరేఖలు, పుట్టు మచ్చల ఆధారంగా ఉన్నది ఉన్నట్లు చెబుతాం.. మీరు కోరినట్లుగా జాతకం మారుస్తాం.. ఆ తర్వాత మీరు అనుకున్నది జరుగుద్ది.. కనకవర్షం కురిపిస్తాం' అంటూ మహిళలకు పలువురు జ్యోతిష్కులు మాయ మాటలు చెప్పి నగ్న చిత్రాలు సేకరించారు. ఈ ఉదంతం మహబూబ్‌నగర్ జిల్లాలో వెలుగు చూడగా.. తవ్వేన కొద్దీ వారి లీలలు బయటకు వస్తున్నాయి.

**ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో..**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని కోడుపర్తి, వికారాబాద్ జిల్లా ఆమనగల్, రంగారెడ్డి జిల్లాలో కొందరు జ్యోతిష్కులు జ్యోతిష్యకేంద్రాలు తెరిచారు. తమ దగ్గరికి వస్తే మంచి జరుగుతుందంటూ తెలిసిన వారి నుంచి విస్తృత ప్రచారం చేపట్టారు. పూలు, పండ్లు, కూరగాయలు విక్రయించే మహిళలకు వల వేశారు. శరీరంపై పుట్టుమచ్చలను తాము స్వయంగా చూసి గుర్తిస్తే జాతకం పక్కాగా ఉంటుందని చెప్పారు. ఫొటోలను పైకి పంపిస్తామని.. అక్కడ అమ్మ వారికి పూజలు చేస్తారని.. మీకు అమ్మవారి పూనకం వస్తుందని.. ఆతర్వాత కనక వర్షం కురుస్తుందనీ.. అప్పుడే మాకు కొంత ముట్టజెప్పాలని మాయమాటలు చెప్పి నమ్మబలికారు. అలా కొంతమంది మహిళల వద్ద న్యూడ్ ఫొటోలను సేకరించినట్లు సమాచారం. బాధితుల్లో కొందరు మగవారు కూడా ఉన్నట్టు తెలుస్తోంది.

### బ్లాక్ మెయిల్‌తో బయటికొచ్చిన బాగోతం

జాతకం పేరిట న్యూడ్‌ఫొటోలు సేకరించిన అక్రమార్కులు చివరికి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన క్రమంలో వారి బాగోతం బట్టబయలైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన ఖాకీలు జైనుద్దీన్, రాములు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని విచారించిన క్రమంలో తిరుపతి, శంకర్ పేర్లు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. వీరిని పట్టుకునేందుకు ఓ పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. పూర్తి విచారణ తర్వాతే వివరాలు వెల్లడిస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

## భూసారాన్ని కాపాడితేనే ఆరోగ్యం

**మంత్రి హరీశ్‌రావు వెల్లడి ● 'సిద్దిపేట కార్బన్ లైట్స్' సేంద్రియ ఎరువు విడుదల**

సాక్షి, సిద్దిపేట:'భూమి బాగుంటే మనిషి బాగుంటాడు. రసాయనిక ఎరువులు ఎక్కువ వినియోగించడంతో సమాజంలో కేన్సర్ వేగంగా విస్తరిస్తోంది. భూ సారాన్ని కాపాడుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం' అని ఆర్థిక, వైద్య, ఆరోగ్య మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పత్తి మార్కెట్ ఆవరణలో భూ మిత్ర.. మన తడిచెత్త–మన సేంద్రియ ఎరువు – మన నేల అనే నినాదంతో 'సిద్దిపేట కార్బన్ లైట్స్' సేంద్రియ ఎరువును మార్కెట్‌లోకి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇది సిద్దిపేట మున్సిపాలిటీలోని 41,322 మంది ప్రజల విజయమన్నారు. ఇదంతా నిత్యం తడి, పొడి, హానికరమైన చెత్త వేర్వేరుగా ఇవ్వడంతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ, పర్యావరణవేత్త డాక్టర్ శాంతి పాల్గొన్నారు.



సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

**తొలి బ్యాగ్ కొన్న మంత్రి..**

సిద్దిపేట బ్రాండ్‌తో తయారైన జీవ సంపన్న సేంద్రియ ఎరువు తొలి బ్యాగును మంత్రి హరీశ్‌రావు కొనుగోలు చేశారు. సిద్దిపేట శివారులోని తన పొలంలో వినియోగించేందుకు రూ.37వేలు చెల్లించి 125 బ్యాగుల ఎరువును కొనుగోలు చేశారు.

**మా భూమి సారం పెరిగింది సార్ మాది చిన్న కోడూరు మండలం రాముని పట్ల గ్రామం. నా పేరు కృప**

**మంత్రి హరీశ్‌రావు:** ఎన్ని ఎకరాల భూమి ఉందమ్మ?

**కృప:** నాకు నాలుగెకరాల భూమి ఉంది. మూడున్నర ఎకరాల్లో వరి, అరెకరంలో కూరగాయలు సాగు చేస్తున్న.

**మంత్రి:** సేంద్రియ ఎరువుతో సాగు చేస్తున్నావా?

**కృప:** అవును సార్.. ఆరు నెలల నుంచి సేంద్రియ ఎరువుతోనే పండిస్తున్న.

**మంత్రి:** ఇప్పటివరకు ఎన్ని బస్తాలు తీసుకున్నావు

**కృప:** శాంపిల్‌గా ఇచ్చిన 25 బస్తాలను తీసుకున్నాను సార్. సేంద్రియ ఎరువుతో సాగు చేయడంతో మార్కెట్‌లో మా కూరగాయలకు బాగా డిమాండ్ ఉంటుంది. ఇటీవల చిక్కుడు కాయ తెంపినం. మార్కెట్‌లో అందరూ కిలో రూ.35కు అమ్మితే నేను రూ.40కిలో అమ్మాను.

**మంత్రి:** నీకు ఆదాయం పెరగడంతో పాటు ఆరోగ్యం కాపాడుతున్నావు అమ్మ. శభాష్.

## బావిలో పడిపోయి.. మృత్యువుతో పోరాడి

- మూడు గంటలపాటు వృద్ధురాలి పోరాటం
- రక్షించిన అగ్నిమాపక శాఖాధికారులు



మానకొండూర్: మతిస్థిమితం లేక నడుస్తూ అదుపుతప్పి బావిలో పడిపోయిన ఒక వృద్ధురాలిని అగ్నిమాపక శాఖ సిబ్బంది రక్షించారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ సంజీవ్‌నగర్ కాలనీలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. మండల కేంద్రానికి చెందిన ఉండింటి మధునమ్మ (80)కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులతో నివసిస్తున్న ఆమె.. మంగళవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో నిద్రలేచింది. అలాగే నడుస్తూ సమీపంలోని చేదబావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. బావిలోని బోర్ మోటార్ పైపును పట్టుకొని అలాగే ఉండిపోయింది. ఉదయం 4.30 గంటల సమయంలో నిద్ర లేచిన ఓ మహిళకు బావిలోంచి వృద్ధురాలి అరుపులు వినిపించడంతో ఆమె సమీపంలోని వారికి చెప్పింది. వెంటనే స్థానికులు ఆమెను కాపాడేందుకు ప్రయత్నించినా వీలుకాలేదు. మధునమ్మ కుమారుడు రవి అందించిన సమాచారంతో మానకొండూర్ అగ్నిమాపక శాఖాధికారి భూదయ్య, లీడింగ్ ఫైర్‌మన్ ధర్మ, ఫైర్‌మన్ పి.సంతోష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. లీడింగ్ ఫైర్‌మన్ ధర్మ చేదబావిలోకి దిగి వృద్ధురాలిని ఉదయం 6.30 గంటల సమయంలో క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. సుమారు మూడు గంటలపాటు చేదబావిలో ఉన్న వృద్ధురాలు ప్రాణాలతో బయటపడటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.